


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు





మూడు తరాలుగా
ఎత్తిన పసుపు జెండా దించని...

### అవిశ్రాంత సేవకుడు డాక్టర్ గురురాజా

నేడు గ్లోబల్ ఎన్ఆర్ఐ టీడీపీ చీఫ్‌గా ప్రమాణస్వీకారం

వివరాలు లోపలి పేజీల్లో..



నేడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో

## ముఖ్యమంత్రి పర్యటన

- 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ
- రైతులతో ముఖాముఖి... గ్రామసభలో పాల్గొననున్న చంద్రబాబు

*ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పర్యటించనున్నారు. 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా పి.గన్నవరం నియోజకవర్గంలో పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేయనున్నారు. రైతులతో ముఖాముఖి మాట్లాడడంతో పాటు పాటు గ్రామసభలో పాల్గొని భూ హక్కుల పరిరక్షణ, రెవెన్యూ సంస్కరణలను ప్రజలకు వివరిస్తారు. అనంతరం బుడుంగపేటలో తెలుగుదేశం పార్టీ సమావేశంలో పాల్గొని నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తారు.*

3

స్థానిక సంస్థల ఎన్నికల్లో

# క్లీన్ స్వీప్ చేయాలి

- అన్ని స్థానాల్లో విజయమే లక్ష్యంగా నేతలు శ్రమించాలి
- మేయర్లు, మున్సిపల్ చైర్మన్ల ఎంపిక ప్రత్యక్ష పద్ధతిలోనే
- మంచి గుర్తింపు, ఆమోదం ఉన్నవారికే టికెట్లు
- పార్టీకి చెడ్డపేరు తెస్తే సస్పెన్షన్ వేటు తప్పదు
- 'గొడ్డలి పార్టీ' విష ప్రచారాన్ని ఎక్కడికక్కడ తిప్పికొట్టాలి
- టీడీపీ 'లీడర్‌షిప్ కాంక్లేవ్' ముగింపు సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు



'రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మనం క్లీన్ స్వీప్ చేయాలి. రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో విజయమే లక్ష్యంగా కూటమి నేతలు శ్రమించాలి. అందుకు ఇప్పటి నుంచే ప్రజాప్రతినిధులు, నాయకులు రంగంలోకి దిగాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు. మేయర్లు, మున్సిపల్ చైర్మన్లను ప్రత్యక్ష ఎన్నికల ద్వారానే ఎన్నుకోవాలని నిర్ణయించామన్నారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన 'లీడర్‌షిప్ కాంక్లేవ్' ముగింపు సమావేశంలో సీఎం స్థానిక సమరానికి సిద్ధం కావాల్సిన తీరుపై నేతలకు దిశానిర్దేశం చేశారు. గెలుపు గుర్రాలకే ప్రాధాన్యత ఇస్తామని అభ్యర్థుల ఎంపికను ప్రత్యేక కమిటీల ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామన్నారు. పార్టీ ప్రయోజనాలకు భంగం కలిగించేలా ప్రవర్తించినా, క్రమశిక్షణ తప్పినా ఉపేక్షించేది లేదని... అలాంటి వారిపై తక్షణం సస్పెన్షన్ వేటు వేస్తాం" అని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు ప్రతిపక్ష 'గొడ్డలి పార్టీ' చేస్తున్న విష ప్రచారాన్ని ఎక్కడికక్కడ తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రజలకు తాగునీటి సరఫరాకే తమ ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. సుస్థిరాభివృద్ధి, పబ్లిక్ సర్వీస్, సుపరిపాలన అంశాలపైనా సీఎం మాట్లాడారు.

- వివరాలు లోపలి పేజీల్లో..



- ఎన్నికల్లో గెలవాలంటే బలహీనతల్ని గుర్తించి అధిగమించాలి
- పార్టీ, పర్సనల్, ప్రభుత్వం.. మూడు 'పీ'లను అందరూ పాటించాలి
- కష్టపడి పనిచేసే కార్యకర్తలను గుర్తించాలి
- టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్ ముగింపు సభలో తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్
- చంద్రబాబు అక్రమ అరెస్టుకు నేటితో మూడేళ్లు
- 'నిజం గెలిచింది' పేరుతో రాష్ట్రవ్యాప్త కార్యక్రమానికి పిలుపు

కార్యకర్తల పోరాటం, త్యాగాల వల్లే

# అధికారంలోకి వచ్చాం

*కార్యకర్తల నిరంతర పోరాటాలు, అసమాన ప్రాణత్యాగాల పునాదులపైనే మనం ఈరోజు అధికారంలోకి వచ్చామని, ఈ విషయాన్ని నాయకులు ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని టీడీపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు పేర్కొన్నారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన 'లీడర్‌షిప్ కాంక్లేవ్' ముగింపు సభలో ఆయన దిశానిర్దేశం చేశారు. స్వయం పరిశీలనతో మనలోని బలహీనతలను గుర్తించి అధిగమించినప్పుడే రాజకీయాల్లో విజయాలు సాధ్యమవుతాయన్నారు.*

*ఇది 'టీడీపీ 3.0 వెర్షన్' అని ప్రకటించిన లోకేష్... నాయకులంతా ఇగోలను పక్కనబెట్టి '3పీ' (పార్టీ, పర్సనల్, ప్రభుత్వం) సూత్రాన్ని తప్పనిసరిగా పాటించాలని పిలుపునిచ్చారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలను గుర్తించాలని... రాష్ట్ర అభివృద్ధికి, పార్టీ బలోపేతానికి నాయకులు పునరంకితం కావాలని కోరారు. డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి తేడా తెలియని వ్యక్తి జగన్ రెడ్డి అని ఎద్దేవా చేశారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు మూడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా 'నిజం గెలిచింది' పేరుతో బుధవారం రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించాలని కేడర్‌ను కోరారు.*

5



### టీడీపీ గూటికి విజయనగరం జడ్పీ చైర్మన్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు

*విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు టీడీపీ గూటికి చేరారు. మంగళవారం రాత్రి సీఎం క్యాంపు కార్యాలయంలో ఆయనకు, కుమార్తె సిరి సహస్రకు ముఖ్యమంత్రి చంద్రబాబు పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.*

3

## 'పొలిటికల్ పులకేశి' జగన్

- మెగా డీఎస్సీపై విష ప్రచారాన్నే నమ్ముకున్న గొడ్డలి పార్టీ
- జగన్నాటకాలను జనం గమనిస్తున్నారు
- కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్



6



కానిస్టేబుల్ అభ్యర్థులు

## ఆందోళనలకు దిగొద్దు

- ఎవరి హయాంలో పోలీసు ఉద్యోగాలో వచ్చాయో గుర్తించండి
- హోం మంత్రి అనిత

ఉత్తరాంధ్ర గడ్డపై

## నేడు బీసీల పండుగ

- నర్సీపట్నంలో 'జయహో బీసీ' సభ
- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లకు కృతజ్ఞత చాటుదాం
- బీసీలు భారీగా తరలిరావాలి
- ఎంపీ చింతకాయల విజయ్ పిలుపు



6

చైతన్యరథం

# అభివృద్ధిలో నియోజకవర్గాలు రేసులోకి రావాలి

- రాష్ట్ర జీఎస్‌డీపీ లక్ష్యం రూ.20.35 లక్షల కోట్లు
- డేటా సెంటర్లపై కుట్రలను తిప్పికొట్టాలి
- పోలవరం ద్వారా రోజుకు 2 టీఎంసీల నీటి తరలింపు
- మూడేళ్లలో రూ.35వేల కోట్లతో 36 ప్రాజెక్టులు పూర్తి
- 'వన్ ఫ్యామిలీ.. వన్ ఎంటర్‌ప్రెన్యూర్' దిశగా అడుగులు
- టీడీపీ 'లీడర్‌షిప్ కాంక్లేవ్'లో సుస్థిరాభివృద్ధిపై సీఎం చంద్రబాబు కీలకోపన్యాసం



మంగళగిరి (చైతన్యరథం): రాష్ట్ర స్థూల ఆర్థికాభివృద్ధి (జీఎస్‌డీపీ) లక్ష్యాలకు అనుగుణంగా నియోజకవర్గాల స్థాయిలో అభివృద్ధి అనుసంధానం కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. విజయవాడ సెంట్రల్, పాలకొల్లు, మండపేట, చిలకలూరిపేట, నెల్లూరు సిటీ, తణుకు నియోజకవర్గాలు జీఎస్‌డీపీలో ముందంజలో ఉన్నాయని, మిగిలిన నియోజకవర్గాలు కూడా అదే బాటలో పయనించాలని పిలుపునిచ్చారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో రెండో రోజైన మంగళవారం జరిగిన 'లీడర్‌షిప్ కాంక్లేవ్'లో "సుస్థిర అభివృద్ధి" అంశంపై సీఎం సుదీర్ఘంగా మాట్లాడారు.

## డేటా సెంటర్లపై కుట్రలను తిప్పికొట్టండి

2026-27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర జీఎస్‌డీపీ రూ.20.35 లక్షల కోట్లుగా ఉందని సీఎం వెల్లడించారు. "మన రాష్ట్రానికి గూగుల్ వంటి దిగ్గజ సంస్థలు వస్తుంటే దేశంలోని ఇతర రాష్ట్రాలు అసూయపడుతున్నాయి. కానీ ఇక్కడి కొందరు వ్యక్తులు కుట్రలు చేస్తూ ఆ ప్రాజెక్టులను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. డేటా సెంటర్లకు 5 టీఎంసీల నీరు అవసరమనేది పెద్ద సమస్యే కాదు. పోలవరం ఎడమ కాలువ ద్వారా రోజుకు దాదాపు 2 టీఎంసీల నీటిని తరలించే సామర్థ్యం మనకుంది. డేటా సెంటర్ల ద్వారా లక్షలాది మంది యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు లభిస్తాయి" అని స్పష్టం చేశారు.

## మూడేళ్లలో 36 జల ప్రాజెక్టులు పూర్తి

రాష్ట్రంలో నీటిపారుదల రంగానికి ఉన్న ప్రాధాన్యతను వివరిస్తూ.. మూడేళ్లలో రూ.35వేల కోట్లతో 36 ప్రాజెక్టులను పూర్తి చేస్తామని సీఎం ప్రకటించారు. పుష్కరాల కంటే ముందే పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని పునరుద్ఘాటించారు. "ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ గోదావరి నుంచి 1,000 టీఎంసీల నీరు సముద్రంలో కలిసింది. అందులో కనీసం 300 టీఎంసీలు వాడుకున్నా రాష్ట్ర రూపురేఖలు మారిపోతాయి. వంశధార, గోదావరి, కృష్ణా, తుంగభద్ర, కావేరి, పెన్నా నదులను అనుసంధానిస్తే అన్ని రిజర్వాయర్లను నింపుకోవచ్చు. రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో 1250 నుంచి 1400 టీఎంసీలు నిల్వ చేసుకుంటే ఆంధ్రప్రదేశ్ చరిత్రనే మార్చేయవచ్చు" అని ధీమా వ్యక్తం చేశారు. భూగర్భ జలాలు పెరిగితే విద్యుత్ సబ్సిడీ వ్యయం, ట్రాన్స్‌మిషన్ ఖర్చులు తగ్గుతాయని గుర్తుచేశారు.

## వన్ ఫ్యామిలీ.. వన్ ఎంటర్‌ప్రెన్యూర్

రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ప్రాంతంలోనూ సక్సెస్ స్టోరీలు క్రియేట్ చేయాలని సీఎం పిలుపునిచ్చారు. "డబ్బులు లేవని కూర్చుంటే అభివృద్ధి సాధ్యం కాదు, ఆలోచిస్తే పరిష్కారం లభిస్తుంది. కుప్పం సమీపంలో జాతీయ రహదారికి దగ్గరగా పారిశ్రామిక ప్రాంతాన్ని సృష్టించి రూ.30వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాం. 'వన్ ఫ్యామిలీ.. వన్ ఎంటర్‌ప్రెన్యూర్' (ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త) విధానాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నాం" అని తెలిపారు.

ప్రజల్లో అభివృద్ధిపై సానుకూల దృక్పథం పెరిగేలా ప్రజాప్రతినిధులు ముందుకు సాగాలని, విమర్శలను కూడా దీటుగా తిప్పికొడుతూ ప్రభుత్వ మద్దతు కూడగట్టాలని సూచించారు. 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'తో వేగంగా ప్రాజెక్టులను ఏర్పాటుచేసి దేశంలోనే నెం.1 డెవలపర్‌గా రాష్ట్రాన్ని నిలబెట్టడమే తన లక్ష్యమని సీఎం చంద్రబాబు చెప్పారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయాలి



- అన్ని స్థానాల్లో విజయమే ధ్యేయంగా కూటమి నేతలు శ్రమించాలి
- మేయర్లు, మున్సిపల్ చైర్మన్ల ఎంపిక ప్రత్యక్ష పద్ధతిలోనే
- పార్టీకి చెడ్డపేరు తెస్తే సస్పెన్షన్ వేటు తప్పదు
- మంచి గుర్తింపు, ఆమోదం ఉన్నవారికే టికెట్లు
- కమిటీల ద్వారా ఎంపిక ప్రక్రియ
- విశాఖ నార్త్ మినహా అన్ని నియోజకవర్గాలకు ఇన్‌చార్జిల నియామకం పూర్తి
- టీడీపీ 'లీడర్‌షిప్ కాంక్లేవ్' ముగింపు సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

మంగళగిరి (చైతన్యరథం): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో విజయం సాధించడమే లక్ష్యంగా పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు సన్నాహాలు ప్రారంభించాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. మేయర్లు, మున్సిపల్ చైర్మన్లను ప్రత్యక్ష ఎన్నికల ద్వారానే ఎన్నుకోవాలని నిర్ణయించామని, ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా అత్యంత పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయడానికే ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన 'లీడర్‌షిప్ కాంక్లేవ్' ముగింపు సమావేశంలో సీఎం స్థానిక సమరానికి సిద్ధం కావాల్సిన తీరుపై నేతలకు దిశానిర్దేశం చేశారు. స్థానిక ఎన్నికల నిర్వహణ, రిజర్వేషన్ల ప్రక్రియపై ప్రతిపక్షాలు దింపుడుకల్లం ఆశలతో కోర్టులను ఆశ్రయిస్తున్నాయని సీఎం మండిపడ్డారు. ఎంతమంది కుట్రలు చేసినా కూటమి విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని ధీమా వ్యక్తంచేశారు. "విశాఖపట్నం నార్త్ నియోజకవర్గం మినహా రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్థానాలకు ఇన్‌చార్జుల నియామకం పూర్తయింది. నాయకులందరూ వ్యక్తిగత రాగద్వేషాలకు అతీతంగా క్షేత్ర స్థాయిలో ఐక్యంగా పని చేయాలి" అని సూచించారు.

## అభ్యర్థుల ఎంపికలో కఠిన నిబంధనలు


పార్టీకి, ప్రభుత్వానికి నష్టం కలగకుండా క్లీన్ ఇమేజ్ ఉన్న బెస్ట్ అభ్యర్థులనే బరిలోకి దింపాలని సీఎం స్పష్టం చేశారు. "ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపికను ప్రత్యేక కమిటీల ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తాం. కూటమి భాగస్వామ్య పక్షాలతో సరైన సమన్వయం సాధిస్తూ బ్యాలెన్సింగ్ పాటించాలి. గెలుపు గుర్రాలకే ప్రాధాన్యత ఉంటుంది. పార్టీ ప్రయోజనాలకు భంగం కలిగించేలా ప్రవర్తించినా, క్రమశిక్షణ తప్పినా ఉపేక్షించేది లేదు.. అలాంటి వారిపై తక్షణం సస్పెన్షన్ వేటు వేస్తాం" అని హెచ్చరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి, పూర్తి స్ఫూర్తితో కలిసికట్టుగా పనిచేసి స్థానిక సంస్థల సమరంలో చారిత్రాత్మక విజయం సాధించాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.



## నేడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో

# ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన

- 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ
- రైతులతో ముఖాముఖి... గ్రామసభలో పాల్గొననున్న సీఎం
- 22(ఎ) నిషేధిత జాబితా నుంచి గ్రౌండ్ రెంట్ స్థలాల విముక్తికి కీలక అడుగు
- 1,416 కుటుంబాలకు లబ్ధి కలిగించే ప్రతిపాదనలు సిద్ధం



అమరావతి (చైతన్యరథం): ప్రజల మధ్యే పాలన సాగిస్తూ ప్రతి నెలా వివిధ ప్రజా కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా పాల్గొంటున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పర్యటించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా భూ హక్కులకు భరోసా కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా పి.గన్నవరం నియోజకవర్గంలో జరిగే గ్రామసభలో సీఎం పాల్గొని పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేయనున్నారు. పర్యటనలో భాగంగా రైతులతో ముఖాముఖి నిర్వహించడంతోపాటు గ్రామసభలో పాల్గొని భూ హక్కుల పరిరక్షణ, రెవెన్యూ సంస్కరణలను ప్రజలకు వివరించనున్నారు. అనంతరం బుడుంగపేటలో నిర్వహించే కేడర్ సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు.

### ప్రజల మధ్యే పాలన...

పాలన అంటే సచివాలయంలో కూర్చోవడం మాత్రమే కాదని, ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే నిజమైన పాలన అనే విధానంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతినెలా ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ప్రతినెలా ఒకటో తేదీన 'పేదల సేవలో', మూడో శనివారం 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర', నాలుగో శనివారం 'సంజీవని', ప్రతినెలా 9వ తేదీన 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజల కష్టసుఖాలు తెలుసుకుంటున్నారు.

### ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్

ఉదయం 9.45 గంటలకు... ఉండవల్లి నివాసం నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పర్యటనకు ముఖ్యమంత్రి బయల్దేరతారు. ఉదయం 10.30 గంటలకు అంబాజీపేట మండలం ఇరుసుమండ చేరుకుంటారు. అక్కడ ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశమవుతారు. ఉదయం 10.45 గంటలకు ఇరుసుమండ నుంచి రోడ్డు మార్గంలో మాచవరం గ్రామంలోని జయంతి నగర్‌కు బయల్దేరతారు. ఉదయం 10.55 నుంచి 11.35 గంటల వరకు మాచవరం గ్రామంలోని జయంతి నగర్‌లో ఏర్పాటు చేసిన రైతులతో ముఖాముఖి కార్యక్రమానికి చేరుకుంటారు. రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అభిప్రాయాలు తెలుసుకుంటారు. వ్యవసాయం, సాగునీరు, భూ హక్కులు, భూ రికార్డులు తదితర అంశాలపై రైతులతో సంభాషిస్తారు.

ఉదయం 11.35 గంటలకు జయంతి నగర్ నుంచి బయలుదేరి పందువారిపేట గ్రామంలోని గ్రామసభ వేదికకు చేరుకుంటారు. ఉదయం 11.40 నుంచి మధ్యాహ్నం 1.55గంటల వరకు... ప్రతిష్ఠాత్మక 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. ఈ సందర్భంగా అర్హులైన రైతులు, లబ్ధిదారులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తారు. భూ హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, రీ-సర్వే సమస్యల పరిష్కారం, రెవెన్యూ సంస్కరణలు, అత్యాధునిక సాంకేతికతతో భూ రికార్డుల భద్రత వంటి అంశాలను ప్రజలకు వివరిస్తారు. మధ్యాహ్నం 3.15 గంటలకు బుడుంగపేటలో ఏర్పాటుచేసిన కేడర్ సమావేశ వేదికకు చేరుకుంటారు. మధ్యాహ్నం 3.15 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు కేడర్ సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొని పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తారు. సాయంత్రం 4.50 గంటలకు ఇరుసుమండ నుంచి బయల్దేరి సాయంత్రం 5.40 గంటలకు ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు.

### 'మీ భూమి-మీ హక్కు'... కేవలం రెవెన్యూ కార్యక్రమం కాదు

'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమాన్ని ప్రభుత్వం కేవలం పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ కార్యక్రమంగా చూడటం లేదు. రైతు గౌరవాన్ని, ప్రతి పౌరుడి ఆస్తి హక్కును కాపాడే ప్రజా ఉద్యమంగా అమలు చేస్తోంది. గత ప్రభుత్వంలో రీ-సర్వే ప్రక్రియలో తలెత్తిన సమస్యలను పరిష్కరించి, భూ రికార్డులను సరిచేసి, ప్రతి భూ యజమానికి స్పష్టమైన హక్కు కల్పించేందుకు ప్రభుత్వం రీ-సర్వే 2.0 కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా భూ రికార్డుల ప్రక్షాళనతో పాటు నిర్దిష్ట కాలపరిమితిలో ప్రతి అర్హుడికీ కొత్త పట్టాదారు పాస్‌పుస్తకం అందించేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది.

### పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ లక్ష్యం

భూ హక్కులకు శాశ్వత భరోసా కల్పించేందుకు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నిర్దిష్ట కార్యాచరణతో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ చేపట్టింది. ఈ ఏడాది జనవరి నుంచి రాష్ట్రవ్యాప్తంగా 8,234 గ్రామాల్లో 36 లక్షలకు పైగా పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ చేపట్టింది. ఈ నెలలో మరో 783 గ్రామాల్లో దాదాపు 4 లక్షల పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీకి సిద్ధం చేసింది. వచ్చే మార్చి నాటికి రాష్ట్రవ్యాప్తంగా మిగిలిన 8,582 గ్రామాల్లో 56 లక్షలకు పైగా పట్టాదారు పాస్ పుస్తకాలను అందించి కార్యక్రమాన్ని పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోంది.

### గ్రౌండ్ రెంట్ భూముల సమస్యకు పరిష్కారం

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో దశాబ్దాలుగా కొనసాగుతున్న గ్రౌండ్ రెంట్ స్థలాల సమస్య పరిష్కారానికి కీలక అడుగు పడనుంది. అమలాపురం, అంబాజీపేట, ముమ్మిడివరం, రామచంద్రపురం ప్రాంతాల్లోని కొన్ని నివాస గ్రౌండ్ రెంట్ స్థలాలు పాత రెవెన్యూ వర్గీకరణ కారణంగా రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22-(ఎ) (1)(ఎ) కింద నిషేధిత ఆస్తుల జాబితాలో కొనసాగుతున్నాయి. వాస్తవానికి ఈ స్థలాలు దీర్ఘకాలంగా నివాసాలుగా ఉన్నాయి. అనేకచోట్ల శాశ్వత నిర్మాణాలు ఉన్నాయి. 1984 నుంచే గ్రౌండ్ రెంట్ వ్యవస్థ నిలిచిపోయినప్పటికీ పాత రెవెన్యూ రికార్డుల్లోని వర్గీకరణ కారణంగా ఆయా కుటుంబాలు ఆస్తి లావాదేవీలలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

### 1,416 కుటుంబాలకు లబ్ధి... 56.37 ఎకరాలకు విముక్తి

క్షేత్రస్థాయి విచారణలు, పాత రెవెన్యూ రికార్డులు, సర్వే వివరాలు, గత రిజిస్ట్రేషన్ లావాదేవీలను పరిశీలించిన అనంతరం నివాస గ్రౌండ్ రెంట్ స్థలాలను గ్రామకంఠం భూములతో సమానంగా పరిగణించి 22(ఎ) నిషేధిత జాబితా నుంచి ప్రత్యేక కేటగిరీగా తొలగించే ప్రతిపాదన పరిశీలనలో ఉంది.

### ఈ నిర్ణయం అమలైతే....

- 1,416 మంది నివాసితులకు ప్రయోజనం
- 56.37 ఎకరాల భూమికి ఆంక్షల నుంచి విముక్తి
- 1,281 సర్వే నంబర్లకు సంబంధించి సమస్య పరిష్కారం
- అంబాజీపేట, అమలాపురం, ముమ్మిడివరం, రామచంద్రపురం ప్రాంతాల కుటుంబాలకు లబ్ధి కలగనుంది. మాచవరం గ్రామంలోని జయంతినగర్‌కు ప్రత్యేక చారిత్రక నేపథ్యం ఉండగా అక్కడ గుర్తించిన 32 మంది అర్హులైన నివాసితులకు కూడా ఈ చర్య ద్వారా ప్రయోజనం కలగనుంది.

### రాష్ట్రవ్యాప్తంగా భూ సమస్యలకు పరిష్కారం

రాష్ట్రవ్యాప్తంగా దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలకు ప్రభుత్వం ప్రాధాన్యక్రమంలో పరిష్కారం చూపుతోంది. గత నెలలో ఏలూరు జిల్లాలో కలిదిండి మండలం గురవాయిపాలెం, ముదినేపల్లి మండలం వైవాక, మండవల్లి మండలం ఉనికిలిలో నిషేధిత జాబితాలో ఉన్న భూములకు 22(ఎ) నుంచి విముక్తి కల్పించారు. అదే విధంగా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ దీర్ఘకాలంగా వివాదాల్లో ఉన్న భూముల సమస్యలను పరిష్కరిస్తూ వేలాది కుటుంబాలకు ప్రభుత్వం ఉపశమనం కల్పిస్తోంది.

### నీరు జీవం... భూమి జీవితం

వ్యవసాయానికి సాగునీరు ఎంత ముఖ్యమో రైతు జీవితానికి భూమిపై స్పష్టమైన హక్కు కూడా అంతే ముఖ్యమనే భావనతో ప్రభుత్వం పనిచేస్తోంది. పంటకు నీటి భరోసా... ఆస్తికి హక్కు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం. కోనసీమలో గురురం ముఖ్యమంత్రి పర్యటనలో రైతులతో ముఖాముఖి, గ్రామసభలో పాల్గొనడం, పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీతో పాటు భూ సమస్యలకు పరిష్కారం దిశగా కీలక చర్యలు తీసుకోనున్నారు. ప్రజల మధ్య పాలన... భూమిపై హక్కుకు రాజముద్ర... సమస్యలకు శాశ్వత పరిష్కారం అనే లక్ష్యంతో చంద్రబాబు పర్యటన సాగనుంది.



## విజయనగరం జడ్పీ చైర్మన్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు టీడీపీలో చేరిక

**కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు**

అమరావతి (చైతన్యరథం): విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు టీడీపీలో చేరారు. మంగళవారం రాత్రి సీఎం క్యాంపు కార్యాలయంలో చంద్రబాబునాయుడు సమక్షంలో ఆయన పార్టీ కండువా కప్పుకున్నారు.

ఈ సందర్భంగా శ్రీనివాసరావును ముఖ్యమంత్రి చంద్రబాబు టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. శ్రీనివాసరావుతో పాటు ఆయన కుమార్తె సిరి సహస్ర తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆమెకు కూడా సీఎం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మంత్రులు వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్, మాజీ మంత్రులు కళా వెంకట్రావు, కోండ్రు మురళి, సుజయ్‌కృష్ణ రంగారావు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, నేతలు పాల్గొన్నారు.



# ప్రజలకు పరిపాలనను మరింత చేరువచేయాలి

- ఉచిత ఇసుక విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలి
- సరిహద్దుల్లో అక్రమ రవాణాకు అడ్డుకట్ట
- మద్యం దుకాణాల పునరుద్ధరణ
- ఎమ్మార్పీ కంటే ఒక్క రూపాయి ఎక్కువైనా కఠిన చర్యలు
- 175 నియోజకవర్గాల్లో రూ.20,400 కోట్లతో 616 అభివృద్ధి పనుల మంజూరు
- వాట్సప్ గవర్నెన్స్, క్యూఆర్ కోడ్ పాస్ పుస్తకాలతో పారదర్శక పౌర సేవలు
- 2027 మార్చి నాటికి సమగ్ర ల్యాండ్ రికార్డుల ప్రక్షాళన.. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం
- పబ్లిక్ సర్వీస్, సుపరిపాలన అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు




మంగళగిరి (చైతన్యరథం): రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తూ, పౌర సేవలను నేరుగా ప్రజల ముంగిటకే తీసుకెళ్లడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టంచేశారు. నాయకులు, ప్రజాప్రతి నిధులు నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలపై మానవత్వంతో స్పందించాలని పిలుపునిచ్చారు. 'లీడర్‌షిప్ కాంక్లేవ్'లో "ప్రభుత్వ, పాలనా సేవల అంశం"పై ఆయన ప్రజాప్రతినిధులు, నాయకులకు దిశానిర్దేశం చేశారు.

**ఎమ్మార్పీకే మద్యం..**
**ఉచిత ఇసుక పక్కదారి పట్టొద్దు**

సంవత్సరానికి రూ.1,000 కోట్ల ఆదాయాన్ని సైతం వదులుకుని ప్రజల కోసం ఉచిత ఇసుక విధానాన్ని తీసుకువచ్చామని సీఎం చెప్పారు. రీచ్‌ల వద్ద పరిస్థితిపై నిరంతర నిఘా ఉంచామని, ఉచిత ఇసుక పక్క రాష్ట్రాలకు వెళ్లకుండా కఠినంగా అడ్డుకోవాలని సూచించారు. "గత ప్రభుత్వంలో నకిలీ మద్యం, జే బ్రాండ్ల వల్ల దాదాపు 30వేల మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం మద్యం రంగాన్ని ప్రక్షాళన చేసి పారదర్శకంగా మార్చాం. త్వరలోనే టెండర్ల గడువు ముగుస్తున్న నేపథ్యంలో ఉన్న దుకాణాలనే రెన్యువల్ చేస్తాం. అయితే ఎమ్మార్పీ కంటే ఒక్క రూపాయి అదనంగా అమ్మినా సహించేది లేదు. నియోజకవర్గాల్లో ఏ చిన్న అవకతవకలు జరిగినా ఎమ్మెల్యేలదే బాధ్యత" అని హెచ్చరించారు.

**డిజిటల్ విప్లవం.. వాట్సాప్ గవర్నెన్స్**

పాలనలో సాంకేతికతను విస్తృతంగా ఉపయోగిస్తున్నామని, వాట్సప్ గవర్నెన్స్ ద్వారా సేవలన్నీ ఆన్‌లైన్‌లోనే అందిస్తున్నామని సీఎం తెలిపారు. భూ యజమానుల భద్రత కోసం క్యూఆర్ కోడ్, బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నామని వెల్లడించారు. 2027 మార్చి నాటికి రాష్ట్రంలో ల్యాండ్ రికార్డుల ప్రక్షాళన పూర్తవుతుందని... దాంతో మెజారిటీ భూ వివాదాలకు శాశ్వత ముగింపు పడుతుందని చెప్పారు. అలాగే 'సంజీవని' ప్రాజెక్టు ద్వారా ప్రతి పౌరుడికి డిజిటల్ హెల్త్ రికార్డులు రూపొందిస్తున్నామని, గత మూడేళ్లుగా విద్యుత్ ఛార్జీలు పెంచలేదని, అంతా రూఫ్ టాప్ సోలార్‌వైపు మొగ్గు చూపాలని కోరారు.

**175 నియోజకవర్గాలకు**
**రూ.20,400 కోట్ల పనులు**

గత కాంక్లేవ్‌లో ఎమ్మెల్యేలు లేవనెత్తిన స్థానిక సమస్యలను సమీక్షించిన ప్రభుత్వం రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో రూ.20,400 కోట్ల విలువైన 616 పనులు మంజూరు చేసిందని సీఎం ప్రకటించారు. "నియోజకవర్గాల్లో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను సుమోటోగా తీసుకుని పరిష్కరించండి. దీనివల్ల ప్రజలకు మేలు జరగడమే కాకుండా మీకు మంచి బ్రాండ్ వస్తుంది. నివాసముంటూ అభ్యంతరాలు లేని స్థలాల్లో పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి క్రమబద్ధీకరణ చేస్తాం" అని హామీ ఇచ్చారు.

**జెన్‌జీ ఆలోచనలకు అనుగుణంగా ప్రణాళికలు**

ప్రజాప్రతినిధి ఎన్నిసార్లు వీలైతే అన్నిసార్లు ప్రజలకు చేరువ కావాలని, కనీసం వాయిస్ మెసేజ్ ద్వారా అయినా వారితో కనెక్ట్ అవ్వాలని సీఎం సూచించారు. ఆర్టీజీఎస్ ద్వారా ఫిర్యాదులను క్షేత్రస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పక్కాగా పరిష్కరించాలన్నారు. 'రాబోయే పదేళ్లలో వచ్చే సవాళ్లు, మార్పులను ఇప్పటినుంచే అంచనా వేయాలి. జెన్‌జీ యువత రియల్ టైమ్ నిర్ణయాలతో వేగంగా ఆలోచిస్తోంది, వారి ఆలోచనలను పరిగణలోకి తీసుకుని నిర్ణయాలు తీసుకోవాలి. సోషల్ మీడియాలో ఫేక్ ప్రచారంతో కొందరు చేస్తున్న కుట్రలను సరైన ఫ్యాక్ట్స్ (నిజాల)తో తిప్పికొట్టాలి' అని ప్రజాప్రతినిధులకు పిలుపునిచ్చారు.

---

## అభివృద్ధిని చాటండి...

# విపక్ష దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి

- ఫేక్ ప్రచారమే ప్రధాన అజెండాగా 'గొడ్డలి పార్టీ' రాజకీయం
- టీమ్ స్పిరిట్‌తో ప్రత్యర్థుల విమర్శలను తిప్పికొట్టాలి
- డీఎస్సీపై కుట్రపూరిత ప్రచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించొద్దు
- మై టీడీపీ యాప్, సోషల్ మీడియా వేదికగా ప్రజల్లోకి నిజాలు తీసుకెళ్లండి
- సీఎం చంద్రబాబు

మంగళగిరి (చైతన్యరథం): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు ప్రతిపక్ష 'గొడ్డలి పార్టీ' చేస్తున్న విష ప్రచారాన్ని ఎక్కడికక్కడ తిప్పికొట్టాలని ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పార్టీ శ్రేణులకు, ప్రజాప్రతినిధులకు పిలుపునిచ్చారు. ఫేక్ ప్రచారం, బురద జల్లే రాజకీయాన్నే నమ్ముకుని విపక్షాలు వ్యవహరిస్తున్నాయని, అలాంటి దుష్ప్రచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదని స్పష్టం చేశారు. 'లీడర్‌షిప్ కాంక్లేవ్'లో 'ప్రజల్లో పాజిటివ్ ప్రచారం-దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడం' అంశంపై ఆయన సుదీర్ఘంగా మాట్లాడారు. ఫేక్ రాజకీయాన్ని పటాపంచలు చేయాలని, రాజకీయాల్లో ప్రజలకు వాస్తవాలను వివరించడంతో పాటు ప్రత్యర్థుల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడం కూడా అంతే ముఖ్యమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. "గత ప్రభుత్వంలో జరిగిన లిక్కర్ స్కాం, వివేకా హత్య, ఏపీపీఎస్సీ అక్రమాలపై నోరు మెదపని గొడ్డలి పార్టీ, ఇప్పుడు డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాలపై కుట్రపూరితంగా దుష్ప్రచారం చేస్తోంది. చివరికి కుప్పం వెళ్లి టీచర్లను బెదిరించే స్థాయికి ఆ పార్టీ మీడియా దారుణాలకు ఒడిగట్టింది. ఇలాంటి తప్పుడు ప్రచారాలను బాధ్యతగా ప్రతి ఒక్కరూ ఎండగట్టాలి. పార్టీకి, కూటమి నేతలకు వ్యతిరేకంగా ఎవరు విమర్శలు చేసినా టీమ్ స్పిరిట్‌తో కౌంటర్ ఇవ్వాలి" అని దిశానిర్దేశం చేశారు.

**సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లండి**

ప్రభుత్వం అందిస్తున్న సేవలు, సీఎం రిలీఫ్ ఫండ్ సహా అమలవుతున్న భారీ సంక్షేమాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రంలో పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన ప్రాంతాలకు సోషల్ మీడియా వేదికగా విస్తృత ప్రచారం కల్పించాలని చెప్పారు. వివిధ వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న వినూత్న కార్యక్రమాలను డిజిటల్ మాధ్యమాల ద్వారా ప్రమోట్ చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**మాధ్యమాలు మారాలి.. ఆలోచనలు పెరగాలి**


రాబోయే కాలంలో సోషల్ మీడియా అత్యంత కీలక పాత్ర పోషించబోతోందని, సాంకేతికతను జోడించి రాజకీయం చేయకపోతే వేగం అందుకోలేమని సీఎం వ్యాఖ్యానించారు. "ఇంకా పాత పద్ధతుల్లోనే రాజకీయం చేస్తామంటే కుదరదు. ప్రతి ఒక్కరూ 'మై టీడీపీ' యాప్‌ను పూర్తిస్థాయిలో వినియోగించు కోవాలి. అధునాతన డిజిటల్ వేదికలను ఉపయోగించుకుని నియోజకవర్గ స్థాయిలో వాస్తవాలను వేగంగా ప్రజల ముంగిటకు చేర్చాలి" అని స్పష్టం చేశారు.

---

## ఎల్‌నినో సంక్షోభం... తాగునీటికే తొలి ప్రాధాన్యం

- రాష్ట్రంలో 54శాతం లోటు వర్షపాతం
- ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు గణనీయంగా తగ్గుముఖం
- సాగునీటి ఒత్తిడి ప్రాంతాల్లో క్రాప్ డైవర్సిఫికేషన్
- 'పీఎండీఎస్' విధానం తక్షణ అవసరం
- రైతులకు ఎకరాకు రూ.వెయ్యితో 32 రకాల విత్తనాల సరఫరాకు ప్రభుత్వం సిద్ధం
- ప్రతిపక్షాల కట్టుకథలను క్షేత్రస్థాయిలో ఎండగట్టాలి: చంద్రబాబు

మంగళగిరి (చైతన్యరథం): రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రజలకు తాగునీటి సరఫరాకే తమ ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో తాగునీటితో పాటు పశువుల దాహార్తి తీర్చడానికి, పరిశ్రమల అవసరాలకు లోటు లేకుండా పక్కా కార్యాచరణ అమలు చేస్తున్నామని వెల్లడించారు. 'లీడర్‌షిప్ కాంక్లేవ్' లో మంత్రులు అచ్చెన్నాయుడు, అనితలతో పాటు సీఎం చంద్రబాబు ఎల్‌నినో ప్రభావం, వ్యవసాయ పరిస్థితులపై ప్రజాప్రతినిధులతో సుదీర్ఘంగా సమీక్షించి దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 54శాతం లోటు వర్షపాతం నమోదైందని, భూగర్భ జలాలు కూడా గణనీయంగా తగ్గుతున్నాయని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. "గత ఏడాది రిజర్వాయర్లలో 737 టీఎంసీల నీరు ఉండగా, ఈసారి 530 టీఎంసీలకు




పరిమితమైంది. నెల్లూరు (177%), తిరుపతి (158%), కోనసీమ (103%) జిల్లాల్లో సాధారణం కంటే ఎక్కువగా పంటలు వేస్తే.. మార్కాపురం (21%), పోలవరం (20%), ప్రకాశం (12%) జిల్లాల్లో సాగు బాగా తగ్గింది. నీటి సంక్షోభం దృష్ట్యా పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా 36 టీఎంసీల గోదావరి నీటిని ప్రకాశం బ్యారేజీకి తరలించి కృష్ణా డెల్టాలో పంటలను కాపాడుకున్నాం. ఈ సీజన్‌లో ఇంకా 71 టీఎంసీల నీరు అవసరం ఉంది" అని వివరించారు. రాయలసీమ జిల్లాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని... కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 14,900 ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు నష్టపోయారని సీఎం తెలిపారు. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో క్రాప్ డైవర్సిఫికేషన్ (పంట మార్పిడి) అవసరమని సూచించారు. "ప్రతి ఎకరాలో సాగు సాధ్యమయ్యేలా 32 రకాల విత్తనాలతో కూడిన పీఎండీఎస్ విధానాన్ని ప్రోత్సహిస్తున్నాం. ఎకరాకు రూ.1,000 వ్యయంతో ప్రభుత్వం విత్తనాలు సరఫరా చేయడానికి సిద్ధంగా ఉంది. 25 లక్షల ఎకరాల్లో ఈ విధానం అవలంబించేలా ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో రైతుల్లో అవగాహన కల్పించాలి" అని పిలుపునిచ్చారు. 'రైతన్నా మీకోసం' ద్వారా ప్రజాప్రతినిధులు రైతులతో సమన్వయం చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలో రూ.35 వేల కోట్ల వ్యయంతో రాబోయే మూడేళ్లలో 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు నీరిస్తామని సీఎం చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. "గత పాలకులు పోలవరం డయాఫ్రమ్‌వాల్‌ను దెబ్బతీసి, సాగునీటి రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. అప్పట్లో భారీగా ఖర్చు చేసిన చరిత్ర మనదే. ఇప్పుడు ఏమీ చేయని వారు లేనిపోని దుష్ప్రచారాలు చేస్తుంటే ఊరుకోవద్దు. ప్రతిపక్షాల డ్రామాలు, కట్టుకథలను ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయికి వెళ్లి సమర్థవంతంగా తిప్పికొట్టాలి" అని సీఎం స్పష్టం చేశారు.

# కార్యకర్తల పోరాటం, త్యాగాల వల్లే
# అధికారంలోకి వచ్చాం

- ఎన్నికల్లో గెలవాలంటే బలహీనతల్ని గుర్తించి అధిగమించాలి
- పార్టీ, పర్సనల్, ప్రభుత్వం.. మూడు 'పీ'లను అందరూ పాటించాలి
- కష్టపడి పనిచేసే కార్యకర్తలను గుర్తించాలి
- డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి తేడా తెలియని వ్యక్తి జగన్
- కలిసికట్టుగా రాష్ట్రాన్ని, పార్టీని నడిపిద్దాం
- టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్ ముగింపు సభలో తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్
- చంద్రబాబు అక్రమ అరెస్టుకు నేటితో మూడేళ్లు
- 'నిజం గెలిచింది' పేరుతో రాష్ట్రవ్యాప్త కార్యక్రమానికి పిలుపు




మంగళగిరి (చైతన్యరథం): కార్యకర్తల పోరాటం, త్యాగాల వల్లే అధికారంలోకి వచ్చామని, ఎన్నికల్లో గెలవాలంటే బలహీనతల్ని గుర్తించి అధిగమించాలని టీడీపీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన లీడర్‌షిప్ కాంక్లేవ్ ముగింపు సభలో మంత్రి మాట్లాడుతూ... 'మనందరం నాయకులుగా ఇక్కడ కూర్చొన్నామంటే అందుకు కారణం కార్యకర్తల త్యాగం. ఒక తోట చంద్రయ్య, నందం సుబ్బయ్య, మంజుల వంటి కార్యకర్తలపై ఆనాడు దాడులకు పాల్పడ్డారు. కొంతమందిని హతమార్చారు. వారి పోరాటం వల్లే మనం అధికారంలోకి వచ్చాం. దీనిని అందరూ గుర్తుపెట్టుకోవాలి. ఇది రొటీన్ కాంక్లేవ్ కాదు. నాయకులకు శిక్షణ ఇచ్చేందుకే ఈ కాంక్లేవ్ పెట్టాం. కార్యకర్తలకు, ప్రజలకు ఎలా దగ్గర కావాలి, పార్టీ బలోపేతం కోసం ఏం చేయాలనే అంశాలపై చర్చించేందుకు ప్రతి మూడు నెలలకోసారి కాంక్లేవ్ నిర్వహిస్తాం.' అన్నారు.

## ఎన్నికల్లో గెలవాలంటే బలహీనతల్ని గుర్తించి అధిగమించాలి

2019లో మంగళగిరిలో 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయాను. ఆనాడు అనేక మంది విమర్శించారు. 2024 ఎన్నికల్లో 91వేల మెజార్టీతో గెలుపొందాను. నాయకులకు వారి బలహీనతలేంటో చెప్పగలగాలి. నాయకులు పుట్టరు, నాయకులు తయారవుతారు. నేను నాయకుడిగా ఎదిగానంటే ఆ క్రెడిట్ చంద్రబాబుది కాదు.. సైకోది. రాష్ట్రస్థాయిలో మిమ్మల్ని నాయకులుగా గుర్తించే ఈ సమావేశానికి ఆహ్వానించాం. మన బలహీనతల్ని గుర్తించి, అధిగమించడానికే ఈ కాంక్లేవ్. ఎన్నికల్లో తిరిగి గెలవాలంటే మన బలహీనతల్ని గుర్తించి అధిగమించాలి. ఇందుకు ఎంతో మంది నాయకులు మనకు మోడల్స్‌గా ఉన్నారు. గోరంట్ల బుచ్చయ్యచౌదరి, రామానాయుడు, అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడు వంటి నాయకులు మనకు మోడల్స్‌గా ఉన్నారు. ఒక్కొక్కరిదీ ఒక్కో స్టైల్. వారి నుంచి మనం నేర్చుకోవాలి. దేశంలో కూడా మనకు మోడల్స్ ఉన్నారు. సీఆర్ పాటిల్ మనకు ఆదర్శం.

## పార్టీ, పర్సనల్, ప్రభుత్వం.. మూడు 'పీ'లను సీరియస్‌గా తీసుకోవాలి

మూడు 'పీ'లను నేను ప్రతిపాదిస్తున్నాను. వీటిని అందరూ పాటించాలి. పార్టీ, పర్సనల్, ప్రభుత్వం. వీటిని సీరియస్‌గా తీసుకోవాలి. పర్సనల్‌గా ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండాలి. బాధ్యతగా ఉండాలి. నాయకులుగా మనం ముందు వినగలగాలి. దీనిని నేను ప్రధాని మోదీ నుంచి నేర్చుకున్నాను. ఒక ప్రధానిగా ఉండి ఆయన నా నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటారు. మీరు కూడా ఫీడ్‌బ్యాక్ తీసుకుని మనల్ని మనం మార్చుకోవాలి. మానవత్వం, అణకువతో ప్రజలతో సంబంధాలు మెరుగుపర్చుకోవాలి. ఎదిగే కొద్దీ ఒదిగి ఉండాలి. ప్రజలు సింప్లిసిటీ కోరుకుంటున్నారు. గ్రామాలకు వెళ్లినప్పుడు అందరినీ కలవాలి. మనమే వంద మందిని వెంటేసుకుని వెళ్లకూడదు. వ్యక్తిగత క్రమశిక్షణ చాలా అవసరం. ప్రజలు మన ఇళ్లల్లో జరిగే విషయాలను కూడా గమనిస్తారు. నీతులు మనం చెప్పడమే కాదు.. పాటించాలి.

## కష్టపడి పనిచేసే కార్యకర్తలను గుర్తించాలి

రెండో పీ... పార్టీ. కష్టపడి పనిచేసే కార్యకర్తలను గుర్తించాల్సిన బాధ్యత మనపై ఉంది. మన సైన్యం సరిగా ఉంటేనే యుద్ధంలో గెలుస్తాం. పార్టీకి దూరంగా ఉన్నవారిని, అలకబూనిన వారిని గుర్తించి దగ్గరికి తీసుకోవాలి. ఎన్నికల్లో ప్రభావితం చేయగలిగిన వారిని గుర్తించాలి. కార్యకర్తలకు చేయగలిగే పనులు చేయాలి. నియోజకవర్గంలో ఏ చిన్న సమస్య అయినా సీరియస్‌గా తీసుకోవాలి. గూగుల్ కోసం తెలంగాణ, మహారాష్ట్ర పోటీపడుతున్నాయి. అదే గూగుల్ మన వైజాగ్‌కు వస్తే దుష్ప్రచారం చేస్తున్నారు. అందరం కలిసికట్టుగా తిప్పికొట్టాలి.

## డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి తేడా తెలియని వ్యక్తి జగన్

డీఎస్సీ విషయంలో మనం ఏ తప్పూ చేయలేదు. జగన్ ఏనాడూ బాబాయి హత్య, ఏపీపీఎస్సీ, దస్తగిరి, లిక్కర్ స్కామ్ గురించి మాట్లాడలేదు. డీఎస్సీ గురించి మాట్లాడుతున్నారు. మనకు చిత్తశుద్ధి ఉంది కాబట్టే డీఎస్సీపై అందరం మాట్లాడుతున్నాం. 16వేల టీచర్ పోస్టులు భర్తీ చేశాం. డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి తేడా తెలియని వ్యక్తి జగన్ రెడ్డి. వైసీపీ హయాంలో ఇచ్చింది సున్నా. ఐదేళ్లలో మనం 30వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తాం. డీఎస్సీ విషయంలో సుప్రీంకోర్టు కూడా కొట్టేసింది. వైసీపీ అబద్ధాలు చెప్పినంత ఈజీగా మనం నిజాలు చెప్పలేకపోతున్నాం. వాస్తవాలను ప్రజలకు వివరించాలి. వైసీపీ దుష్ప్రచారాలను తిప్పికొట్టాలి. కాకినాడలో పోలీస్ రిక్రూట్‌మెంట్ గురించి ఆందోళన జరిగింది. వైసీపీ హయాంలో ఇచ్చింది సున్నా. మనం 6వేల కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేశాం. ఈ ఏడాది 3వేలు భర్తీ చేస్తున్నాం. ఈ ఐదేళ్లలో 10వేల పోస్టులు భర్తీ చేస్తాం. అయినా మనల్ని ఛాలెంజ్ చేస్తున్నారు. వీటన్నింటినీ తిప్పికొట్టాలి. 2024 టీమ్ అద్భుతంగా పనిచేసిందని చంద్రబాబు మెచ్చుకునే విధంగా మన పనితీరు ఉండాలి. పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలను సీరియస్‌గా తీసుకోవాలి. నెలకోసారి జిల్లా ప్రజాప్రతినిధులు కలిసి కూర్చొని మాట్లాడుకోవాలి. ఏదైనా సమస్య ఉంటే కలిసికట్టుగా చేయాలి. మన మధ్య ఐక్యత అవసరం. ఏవైనా సమస్యలుంటే అధిష్ఠానం దృష్టికి తీసుకురావాలి.

## ప్రభుత్వ కొనసాగింపు అనేది చాలా ముఖ్యం

మూడో పీ... ప్రభుత్వం. నేతలు పోస్ట్ ఆఫీస్‌లా మారకూడదు. లీడర్‌లా వ్యవహరించాలి. నేతలు తమ నియోజకవర్గాల్లోని పాఠశాలలు, ఆసుపత్రులు, వసతిగృహాలకు వెళ్లి తనిఖీ చేయాలి. చేసిన పనులు చెప్పుకోవాలి. డీఆర్సీ సమావేశాన్ని ప్రజా సమస్యల పరిష్కారం కోసం వినియోగించుకోవాలి. ఈ మూడు 'పీ'లను అందరూ పాటించాలి. హ్యూమన్ కనెక్షన్, ఎమోషన్ అనేది చాలా కీలకం. ప్రజలతో ప్రత్యక్ష అనుబంధం ఏర్పరచుకోవాలి. ప్రభుత్వ కొనసాగింపు అనేది చాలా అవసరం. మళ్లీ గెలవాలంటే మూడు 'పీ'లను పాటించాలి.

## ఇది తెలుగుదేశం పార్టీ 3.0 వెర్షన్

ఇది తెలుగుదేశం పార్టీ 3.ఓ వెర్షన్. ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు అందరం కలిసి చర్చిద్దాం. పార్టీ ఒక్కసారి నిర్ణయం తీసుకున్న తర్వాత అందరూ తు.చ. తప్పకుండా పాటించాలి. నేను ఏనాడూ లక్ష్మణరేఖ దాటలేదు. ఒక్కసారి నిర్ణయం తీసుకున్న తర్వాత పార్టీ లైన్‌కు అందరూ కట్టుబడి ఉండాలి. ఈగోలు, అహంకారం వద్దు. సింప్లిసిటీ పాటించాలి. నో ఈగో, ఓన్లీ సర్వీస్. ప్రజలకు సేవ చేద్దాం. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అనే అన్న ఎన్టీఆర్ నినాదం నేటికీ వర్తిస్తుంది.

## చంద్రబాబు అక్రమ అరెస్టుకు రేపటితో మూడేళ్లు

పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడుని అరెస్టు చేసి రేపటితో మూడేళ్లు. చంద్రబాబుని అర్ధరాత్రి అక్రమంగా అరెస్టు చేసి రోడ్డు మార్గంలో కోర్టుకు తీసుకెళ్లారు. 53 రోజుల పాటు అక్రమంగా జైల్లో బంధించారు. చంద్రబాబుకి కోర్టు, ఈడీ క్లీన్ చిట్ ఇచ్చింది. గురువారం 'నిజం గెలిచింది' పేరుతో పార్టీ కార్యాలయాలు, ఇళ్లు, బూత్ లెవల్‌లో 53 దీపాలు వెలిగిద్దాం. చంద్రబాబు అక్రమ అరెస్టును బ్లాక్ డేగా పాటిద్దాం. చంద్రబాబు ఏ తప్పూ చేయలేదు కాబట్టే క్లీన్‌చిట్ వచ్చింది. హిట్ అండ్ రన్ చేసి చిన్నోడు, సొంత బాబాయిని లేపేస్తే పిల్లోడని జగన్ అన్నారు. సొంత పీఏ పట్టుబడితే ఎదురుదాడి చేస్తున్నారు. 'నిజం గెలిచింది' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతున్నాను. నేను నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యానంటే అందుకు కారణం మీ అందరి సహకారం వల్లే. కలిసికట్టుగా రాష్ట్రాన్ని, పార్టీని నడిపిద్దామని ఈ సందర్భంగా నేతలకు మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు.






చైతన్యరథం

# 'పొలిటికల్ పులకేశి' జగన్

- మెగా డీఎస్సీపై విష ప్రచారాన్నే నమ్ముకున్న గొడ్డలి పార్టీ
- జగన్నాటకాలను జనం గమనిస్తున్నారు
- కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

అమరావతి (చైతన్యరథం): విష ప్రచారాన్నే నమ్ముకున్న గొడ్డలి పార్టీ మెగా డీఎస్సీపై పదేపదే అబద్ధాలు చెబుతూ నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్ రాష్ట్రాభివృద్ధి అయితే, గొడ్డలి పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి విజన్ మాత్రం కుంభకోణాలు, విధ్వంసమేనని ఎద్దేవా చేశారు. జగన్మోహన్ రెడ్డి ఆడుతున్న నాటకాలను రాష్ట్ర ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, అబద్ధాలు, విష ప్రచారాలను నమ్ముకుని రాజకీయ పబ్బం గడుపుకోవటం ఆయనకు అలవాటుగా మారిందని విమర్శించారు.

గత వైసీపీ పాలనలో ఇసుకను బంగారంలా అమ్ముకుంటూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను పూర్తిగా రద్దు చేశారని మంత్రి ఆరోపించారు. పరిశ్రమలు రాక, పనులు లేక కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. హైకోర్టు ఏర్పాటు చేసిన సిట్ నివేదిక ప్రకారం ఏకంగా 62 మంది భవన నిర్మాణ కార్మికులతో ఏపీపీఎస్సీ గ్రూప్-1 జవాబు పత్రాలు దిద్దించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. సాధారణంగా లెక్చరర్లు దిద్దాల్సిన అత్యున్నత పరీక్షా పత్రాలను కార్మికులతో దిద్దించిన జగన్ ఒక 'పొలిటికల్ పులకేశి' అని ఎద్దేవా చేశారు. భావితరాలకు విద్యను అందించే గురువులను గతంలో మద్యం షాపుల ముందు కాపలా పెట్టించిన చరిత్ర కలిగిన ఈ వ్యక్తి, తాను టెన్త్, ఇంటర్, డిగ్రీ ఫస్ట్ క్లాస్ అని గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు.

కనీసం ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియని



స్థితిలో ఉన్న జగన్మోహన్ రెడ్డి, నేడు మెగా డీఎస్సీపై నిస్సిగ్గుగా అవాకులు చెవాకులు పేలుతున్నారని వాసంశెట్టి సుభాష్ మండిపడ్డారు. నిరుద్యోగ యువత కలలను సాకారం చేస్తూ కూటమి ప్రభుత్వం 16,347 ఉపాధ్యాయ పోస్టులను పారదర్శకంగా భర్తీ చేస్తే, ఓర్వలేక కోర్టుల్లో పిటిషన్లు వేయించి అడ్డుకోవాలని చూశారని గుర్తుచేశారు. సీబీఐ విచారణ కావాలంటూ వెళ్లిన వైసీపీకి న్యాయస్థానాల్లో గట్టి మొట్టికాయలు పడ్డాయన్నారు.

కష్టపడి ఉద్యోగాలు సాధించుకుని విధుల్లో చేరిన ఉపాధ్యాయులను సాక్షి మీడియా, కిరాయి గూండాల ముసుగులో భయభ్రాంతులకు గురిచేస్తూ బెదిరింపులకు దిగడం హేయమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ రక్షణలో సేవలందించిన ఒక ఆర్మీ జవానుకు టీచర్ పోస్టు వస్తే దానిపైనా విషం కక్కడం వైసీపీ రాక్షస మనస్తత్వానికి నిదర్శనమన్నారు. జగన్ విపరీత ఆలోచనలను భరించలేకే ఆంధ్రప్రదేశ్ ప్రజలు గత ఎన్నికల్లో 11 సీట్లకు పరిమితం చేస్తూ బుద్ధి చెప్పారని, ఇప్పటికైనా ఆయన తన వితండ వాదనలు మానుకుని, మంచి గురువుల వద్ద పాఠాలు నేర్చుకుంటూ మానసిక స్థితిని చక్కదిద్దుకోవాలని మంత్రి హితవు పలికారు.

## కానిస్టేబుల్ అభ్యర్థులు ఆందోళనలకు దిగొద్దు

- ఎవరి హయాంలో పోలీసు ఉద్యోగాలు వచ్చాయో గుర్తించండి
- హోంమంత్రి వంగలపూడి అనిత హితవు

అమరావతి (చైతన్యరథం): పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులు ఎవరూ ప్రలోభాలకు లోనై ఆందోళనలకు దిగొద్దని హోంమంత్రి వంగలపూడి అనిత కోరారు. మంగళవారం మీడియాతో ఆమె మాట్లాడుతూ శాంతి భద్రతలను పరిరక్షించే బాధ్యతాయుతమైన పోలీసు ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వ్యవహరించాలని..ఆందోళనలతో భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. కాకినాడలో సోమవారం పోలీసు ఉద్యోగాల నోటిఫికేషన్ కోసం అభ్యర్థులు ఆందోళనకు దిగటాన్ని హోం మంత్రి ప్రస్తావిస్తూ గతంలో ఏ ప్రభుత్వ హయాంలో పోలీసు ఉద్యోగాలు లభించాయో అభ్యర్థులు ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ ద్వారా ఉద్యోగాల భర్తీకి కట్టుబడి ఉందని.. అందులో భాగంగా సుమారు 11 వేల పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

2014-19 మధ్య శాంతి భద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిన కూటమి ప్రభుత్వం 9,793 పోలీసు పోస్టులను భర్తీ చేసిందని అనిత గుర్తుచేశారు. అయితే.. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్ ఇచ్చినా.. ఒక్క కానిస్టేబుల్ పోస్టు కూడా భర్తీ చేయకుండా సుమారు 6 వేల పోస్టులను గాలికొదిలేశారని విమర్శించారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ 6 వేల పోస్టుల భర్తీకి ఉన్న ఇబ్బందులను అధిగమించి ప్రక్రియను క్లియర్ చేశామని తెలిపారు. పోలీసు



కానిస్టేబుల్ అభ్యర్థులకు స్టైపండ్‌ను రూ.12 వేలకు పెంచిన ఘనత కూడా కూటమి ప్రభుత్వానిదేనని హోంమంత్రి పేర్కొన్నారు. ఉద్యోగాల భర్తీ విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని.. అభ్యర్థులు ఎలాంటి ప్రభావాలకు, ప్రలోభాలకు గురికాకుండా తమ లక్ష్యంపై దృష్టి పెట్టాలని అనిత సూచించారు.

## ఉత్తరాంధ్ర గడ్డపై నేడు ఘనంగా బీసీల పండుగ

- నర్సీపట్నంలో 'జయహో బీసీ' సభ
- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు కృతజ్ఞత చాటుదాం
- బీసీలు భారీగా తరలిరావాలి
- ఎంపీ చింతకాయల విజయ్ పిలుపు

అమరావతి (చైతన్యరథం): ఉత్తరాంధ్ర గడ్డపై బీసీల పండుగను అత్యంత ఘనంగా నిర్వహిస్తామని రాజ్యసభ సభ్యుడు చింతకాయల విజయ్ ఉద్ఘాటించారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో బుధవారం జరిగే 'జయహో బీసీ' సభకు రాష్ట్రవ్యాప్తంగా బీసీలు తరలిరావాలని పిలుపు ఇచ్చారు. ఎన్నికల ముందు బీసీలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం



నెరవేరుస్తున్న నేపథ్యంలో కృతజ్ఞతగా భారీ సభను నిర్వహిస్తున్నామన్నారు. నర్సీపట్నంలోని ఎన్టీఆర్ స్టేడియం వద్ద మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 7 గంటల వరకు సభ జరుగుతుందన్నారు. బీసీల రక్షణ కోసం చట్టం తెస్తామని నాడు యువగళంలో యువనేత లోకేష్ ఇచ్చిన హామీ నెరవేరుతోంది. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల హామీని సీఎం చంద్రబాబు నిలబెట్టుకున్నారు. వైసీపీ హయాంలో జగన్ రెడ్డి తన మనుషులతో కోర్టులో కేసు వేయించి బీసీ రిజర్వేషన్లలో 10 శాతం కోత కోయించారు. బీసీలు రాజకీయంగా ఎదగకూడదనే ఉద్దేశంతో జగన్ వ్యవహరించారు. నేడు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లతో బీసీలను విధాన నిర్ణయాల్లో భాగస్వాములను చేస్తున్నాం. చంద్రబాబు, లోకేష్‌కు బీసీల తరపున కృతజ్ఞతలు తెలపాలి. 'జయహో బీసీ' వేదికగా బీసీల ఐక్యతను చాటాలి. ప్రతి బీసీ సోదరుడు, సోదరి నర్సీపట్నం సభకు తరలిరావాలని విజయ్ పిలుపు ఇచ్చారు.

## గొడ్డలి పార్టీ గోబెల్స్ ప్రచారం

- నిరాధార ఆరోపణలతో మెగా డీఎస్సీ విజేతలను అవమానిస్తున్న వైసీపీ
- తప్పుడు ప్రచారానికి క్షమాపణలు చెప్పాలి
- దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

అమరావతి (చైతన్యరథం): ఎన్నో సంవత్సరాలుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగ అవకాశం కల్పిస్తే, దానిపై కూడా వైసీపీ దుష్ప్రచారం చేయడం బాధాకరమని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మండిపడ్డారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం కేవలం 150 రోజుల్లోనే 16,300కు పైగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేలా డీఎస్సీ నిర్వహించి, పారదర్శకంగా నియామకాలు చేపట్టిందన్నారు. తల్లిదండ్రుల తర్వాత గురువు దైవంతో సమానం. ఉపాధ్యాయుల గౌరవాన్ని కాపాడుతూ విద్యారంగాన్ని బలోపేతం చేయడం కూటమి ప్రభుత్వ లక్ష్యం. జగన్ ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వలేదు. ఇప్పుడు వేలాది ఉద్యోగాలు ఇస్తుంటే రాళ్లు వేయడం సరికాదు. మా నియోజకవర్గంలో కూడా సుమారు 600 మందికి ఉచిత కోచింగ్ ఇవ్వగా, 38 మంది ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారు. ఇందులో ఎలాంటి సిఫారసులు, అక్రమాలు లేవు.

మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో విద్యావ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలు తెస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ నియామకాలు, ఫర్నిచర్, మౌలిక వసతుల కల్పన, నాణ్యమైన భోజనం, పేరెంట్-టీచర్ సమావేశాలు వంటి అనేక చర్యలు చేపడుతున్నాం. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి కూరగాయల తోటలు పెంచుతున్నారు. ప్రభుత్వ



పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతోందంటే విద్యాశాఖ మంత్రి లోకేష్ సంస్కరణలు, ప్రత్యేక శ్రద్ధకు నిదర్శనం. రామకృష్ణ అనే వ్యక్తిపై కూడా గొడ్డలి పార్టీ నాయకులు తప్పుడు ఆరోపణలు చేశారు. తనపై చేసిన ఆరోపణలకు ఆధారాలు ఉంటే బయటపెట్టాలని ఆయన సవాల్ చేస్తున్నా వైసీపీ సమాధానం చెప్పడం లేదు. ఆధారాలు ఉంటే బయటపెట్టాలి, లేకపోతే తప్పుడు ప్రచారానికి క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే చింతమనేని డిమాండ్ చేశారు.

**అభివృద్ధి, సంక్షేమంతో ముందుకు**

కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం, విద్య, ఉపాధి వంటి అన్ని రంగాల్లో ముందుకు వెళ్తుంటే వైసీపీ మాత్రం ఆరోపణలు, దుష్ప్రచారానికే పరిమితమవుతోంది. ప్రజలు గత పాలనను, అప్పటి పరిస్థితులను మర్చిపోలేదు. 11 సీట్లతో ప్రజలు ఇచ్చిన తీర్పు, ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకపోవడం వెనుక ఉన్న కారణాలను జగన్ ఇప్పటికైనా అర్థం చేసుకోవాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవాలపై మాట్లాడే ముందు తన హయాంలో ఏం జరిగిందో సమాధానం చెప్పాలి. ఇతరులపై ఆరోపణలు చేసే ముందు తనపై ఉన్న కేసులు, ఆరోపణలపై ప్రజలకు సమాధానం చెప్పాలి. ఇకనైనా దుష్ప్రచారం మానుకుని ప్రజలకు ఉపయోగపడే నిర్మాణాత్మక రాజకీయాలు చేయాలని జగన్ రెడ్డికి చింతమనేని హితవు పలికారు.

# చంద్రబాబు నాయకత్వం దేశానికే ఆదర్శం

- విపత్తులను అవకాశాలుగా మలిచే దార్శనికుడు
- ఎల్‌నినోపై ముందస్తు కార్యాచరణే అందుకు నిదర్శనం
- నీటి కొరతను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు
- ఎల్‌నినో ప్రభావంపై ప్రజల్లో అవగాహన కల్పించాలి
- లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో హోంమంత్రి వంగలపూడి అనిత




మంగళగిరి(చైతన్యరథం): విపత్తులను ముందుగానే అంచనా వేసి వాటిని అవకాశాలుగా మలచడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వ ప్రత్యేకత అని హోంమంత్రి వంగలపూడి అనిత కొనియాడారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో రెండోరోజు మంగళవారం లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ఎల్‌నినో అంశంపై మాట్లాడా రు. కరోనా, ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావం, ఆర్థిక అనిశ్చితులు వంటి సంక్షోభాలను ముందుగానే అంచనా వేసి సమర్థవంతమైన చర్యలతో ప్రజలకు భరోసా కల్పించడంలో చంద్రబాబు నాయక త్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. సంక్షోభం వచ్చిన తర్వాత స్పందించడం సాధారణం. కానీ సంక్షోభాన్ని ముందుగానే గుర్తిం చడం, కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం, అధికార యం త్రాంగాన్ని అప్రమత్తం చేయడం, ప్రజలకు అవగాహన కల్పించ డం, పరిష్కారం లభించే వరకు నిరంతరం పర్యవేక్షించడం నిజమైన నాయకత్వ లక్షణం. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాన్ని ముందుగానే గుర్తించి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడంలో చంద్రబాబు ముందు చూపుతో వ్యవహరించారు. జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ఎల్‌నినోపై అధికారిక ప్రకటన చేయకముందే పరిస్థితిని అంచనా వేసి అధికారులతో సమావేశాలు నిర్వహించడం ఆయన ముందు చూపునకు నిదర్శనమని పేర్కొన్నారు.

### ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు జిల్లాల వారీగా కార్యాచరణ

ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గడంతో పాటు భూగర్భ జలాలు, సాగునీరు, తాగునీటిపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంటుంది. దీనిని ముందుగానే గుర్తించి జిల్లాల వారీగా పరిస్థితు లను విశ్లేషించి కార్యాచరణ రూపొందించాం. వర్షపాతం సాధార ణ స్థాయి కంటే గణనీయంగా తగ్గినప్పటికీ, జలాశయాల్లో నీటి లభ్యత, సాగు–తాగునీటి అవసరాలను ముందుగానే అంచనా వేసి చర్యలు చేపట్టడం ద్వారా సంక్షోభాన్ని సమర్థంగా ఎదుర్కొం టున్నాం. వర్షపాతం, జలాశయాల్లోకి వచ్చే ఇన్‌ఫ్లో, విడుదల చేసే ఔట్ ఫ్లో, భూగర్భ జలాల పరిస్థితులను టెక్నాలజీ ఆధారంగా నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. అవసరానికి అనుగుణంగా నీటి నిర్వహణపై ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోంది. రాష్ట్రస్థాయిలో నిర్ణయాలు తీసుకోవడంతో ఆగిపోకుండా జిల్లా, మండల, గ్రామస్థాయి వరకు కార్యాచరణను తీసుకెళ్లడం చంద్రబాబు పాలనా విధానంలో ప్రత్యేకత. ప్రతి గ్రామానికి సాగునీరు, తాగు నీరు అందేలా అధికారులకు స్పష్టమైన బాధ్యతలు అప్పగించి వాటి అమలును నిరంతరం సమీక్షిస్తున్నామని తెలిపారు.

### నీటి సంరక్షణకు అధిక ప్రాధాన్యం

వర్షాభావ పరిస్థితులను ఎదుర్కోవడంలో నీటి సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. చెరువుల పూడికతీత, చెరువుల అభివృద్ధి, కాలువల నిర్వహణ, ఆనకట్టలు, గేట్ల మరమ్మతులు వంటి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టే చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి జిల్లాలో స్థానిక పరి స్థితులకు అనుగుణంగా నీటి వనరులను అభివృద్ధి చేయడంతో పాటు, వర్షపు నీటిని సాధ్యమైనంత ఎక్కువగా నిల్వ చేసుకునేలా చర్యలు చేపడుతున్నాం.

గతంలో కరోనా మహమ్మారి సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యతను విస్మరించి పారాసెటమాల్ వేసుకుంటే, బ్లీచింగ్ పౌడర్ జల్లితే సరిపోతుం దంటూ అప్పటి ప్రభుత్వం వైరస్ తీవ్రతను తక్కువ చేసి చూసింది. ఆ నిర్లక్ష్య వైఖరి కారణంగా ప్రజలు తీవ్రంగా నష్టపో యారు. దీనికి భిన్నంగా ఎల్‌నినో ప్రభావం ఎంత తీవ్రంగా ఉండ వచ్చో ముందుగానే అంచనా వేసి నీటి కొరతను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోంది. సంక్షోభ పరిస్థితుల్లో కూడా సాగు, తాగునీటికి ఇబ్బంది లేకుండా వెలిగొండ, పోల వరం ఎడమ కాలువ వంటి కీలక ప్రాజెక్టులను పూర్తి చేసి రాయ లసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు నీటిని అందుబాటులోకి తీసుకువచ్చాం. ఎల్‌నినో ప్రభావంపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు.

# స్థానిక ఎన్నికలకు సమరశంఖం పూరించాలి

- అడ్డుకునేందుకు గొడ్డలి పార్టీ కుట్రలు చేస్తోంది
- కోర్టులలో కేసులు ఉన్నా శ్రేణులు సిద్ధం కావాలి
- పురపాలక మంత్రి పొంగూరు నారాయణ
- టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ప్రసంగం



మంగళగిరి(చైతన్యరథం): పార్టీ శ్రేణులు స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలని పురపాలక మంత్రి పొంగూరు నారాయణ పిలుపునిచ్చారు. టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో స్థానిక ఎన్నికలకు సన్నాహంపై ఆయన క్యాడర్‌కు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో మేయర్, మున్సిపల్ చైర్‌పర్సన్ పదవులకు ప్రత్యక్ష ఎన్నికలు, బీసీలకు 33.13% రిజర్వేషన్ ఖరారు చేశాం..డిప్యూటీ మేయర్, వైస్ చైర్‌పర్సన్ పదవుల సంఖ్య తగ్గించి ఒకే పదవి ఉండేలా చట్ట సవరణ చేశామని వివరించారు. కేంద్రం నుంచి వచ్చే ఆర్థిక సంఘం నిధుల కోసం నవంబరు 10 లోపు మున్సిపల్ ఎన్నికలు పూర్తి చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. 16వ ఆర్థిక సంఘం ద్వారా స్థానిక సంస్థలకు రెట్టింపుగా రూ.12,185 కోట్ల నిధులు రాను న్నాయి. ఎన్నికల ప్రక్రియను అడ్డుకునేందుకు గొడ్డలి పార్టీ కోర్టు కేసులతో కుట్రలు చేస్తోంది..కోర్టు కేసులు ఉన్నా పార్టీ శ్రేణులు ఎన్నికలకు సన్నద్ధం కావాలని కేడర్‌కు పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో 23 శాతం వార్డులు పెరిగా యి. మొత్తం వార్డుల సంఖ్య 4,943కు చేరాయి. రాష్ట్రంలో 17 కార్పొరేషన్లు, 92 మున్సిపాలిటీలు, 14 నగర పంచాయతీలు ఉన్నాయి. 59 మున్సిపాలిటీల్లో డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తయి ఓటర్ల జాబితా ప్రచురించాం. మరో 41 మున్సిపాలిటీల్లో సెప్టెంబరు 14 నాటికి డీలిమిటేషన్, సెప్టెంబర్ 23 నాటికి ఓటర్ల జాబితా విడుదల చేయనున్నాం. కోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన 8 మున్సిపాలిటీల్లో బుధవారం నుంచే ఎన్నికల కసరత్తు ప్రారంభం కానుందని తెలిపారు.

### గత ప్రభుత్వంలో నిధుల మళ్లింపుతో నష్టం

గత ప్రభుత్వంలో నిధుల దారిమళ్లింపుతో మున్సిపాలిటీలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం 23 మున్సిపాలిటీల్లో ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల రాష్ట్రం రూ.615 కోట్ల కేంద్ర నిధులను నష్టపోయింది. రాజ్యాంగబద్ధంగా స్థానిక సంస్థలకు రావాల్సిన దాదాపు రూ.3,500 కోట్ల ఆదాయాన్ని గత ప్రభుత్వం అడ్డగోలుగా దారిమళ్లించింది. కౌన్సిళ్ల హక్కుల ను కాలరాసి స్థానికంగా పనులు చేసుకోకుండా మున్సిపాలిటీల ఆర్థిక వ్యవస్థను వైసీపీ నిర్వీర్యం చేసింది. 2019లో తాగునీటి ప్రాజెక్టు కోసం మంజూరైన రూ.5,350 కోట్ల ఏషియన్ బ్యాంక్ నిధులను స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకుండా వదిలేసింది. అమృత్ 2.0 పథకంలో రూ.9,504 కోట్లు, స్వచ్ఛ భారత్ నిధుల కు రాష్ట్ర వాటా ఇవ్వకపోవడంతో పనులన్నీ నిలిచిపోయాయి. స్థానికసంస్థలకు స్వయం ప్రతిపత్తి లేకుండా చేసి పట్టణాల అభి వృద్ధిని ఐదేళ్ల పాటు పూర్తిగా గాలికొదిలేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక మున్సిపల్ నిధుల కోసం ఏప్రిల్ 1 నుంచి 'గ్రీన్ ఛానల్' అమలు చేస్తున్నాం. రాష్ట్రంలో ప్రస్తుతం రూ. 25,328 కోట్లతో శరవేగంగా తాగునీరు, రోడ్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. త్వరలోనే మరో రూ.6,711 కోట్లతో ట్రెంచ్ 3, 4 ద్వారా కొత్త ప్రాజెక్టులు ప్రారంభం కానున్నాయి. మున్సిపాలి టీలలో మొత్తం రూ.43,677 కోట్ల భారీ వ్యయంతో పట్టణ మౌలికవసతుల కల్పనకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు వివరించారు.

# సోషల్‌మీడియాను సమర్థవంతంగా ఉపయోగించాలి

- నియోజకవర్గ ప్రత్యేకతలను ప్రమోట్ చేసుకోవాలి
- లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ



మంగళగిరి(చైతన్యరథం): ప్రజాప్రతినిధులు సోషల్ మీడియా ను సోషల్‌మీడియాను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ సూచించారు. టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో మాట్లాడుతూ ప్రతి ఎమ్మెల్యే, ఎంపీ తమ నియోజకవర్గంలో ఉన్న ప్రధాన ప్రతిపక్ష నాయకులు, ముఖ్యంగా గత ప్రభుత్వంలో కీల కంగా ఉన్న వైసీపీ నాయకుల పనితీరుపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. వారు గత ప్రభుత్వంలో ఏం చేశారు? నియోజకవర్గానికి ఏం చేశారు? ప్రస్తుతం ఏం చేస్తున్నారు? అనే అంశాలను వాస్తవాలు, రికార్డులు, ప్రజలకు సంబంధించిన అంశాల ఆధారంగా ప్రజల ముందుకు తీసుకురావాలి. ఈ అంశాలపై స్థానిక మీడియా, పాడ్‌కాస్ట్‌లు, ఇంటర్వ్యూలు, సోషల్ మీడియా వేదికలను సమర్థ వంతంగా ఉపయోగించాలి. ప్రతి నియోజకవర్గానికి ప్రత్యేకంగా లోకల్ పొలిటికల్ కమ్యూనికేషన్ స్ట్రాటజీ రూపొందించాలి. ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ నియోజకవర్గానికి సంబంధించిన అంశాలను నిరంతరం సోషల్‌మీడియా లో ప్రచారం చేస్తే ప్రజల్లో రాజకీయ అవగాహన పెరుగుతుంది. ప్రతి నియోజకవర్గం లోని నేచర్, అడ్వెంచర్, టెంపుల్, హ్యాండ్లూమ్స్, స్థానిక కళలు, సంస్కృతి వంటి ప్రత్యేకతలను గుర్తించాలి. ఎమ్మెల్యేలు, ఎంపీలు వాటిని సొంత బ్రాండ్‌గా సోషల్‌మీడియాలో ప్రమోట్ చేసి జెన్‌జీ నుంచి అన్ని వర్గాల ప్రజలను కనెక్ట్ చేయాలని సూచించారు.



# అండగా నిలిచే నాయకుడు చంద్రబాబు

**కార్యకర్తల సంక్షేమానికి బాధ్యతగా పనిచేస్తున్నారు**

**ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రశంసలు**

మంగళగిరి(చైతన్యరథం): ప్రజల కోసం, కార్యకర్తల కోసం అండగా నిలిచే నాయకుడు చంద్రబాబు అని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాల యంలో లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ప్రజలకు ప్రభుత్వ సేవలు–పాలనా విధానం అంశంపై ఆయన ప్రసంగించారు. సీఎం రిలీఫ్ ఫండ్‌కు అతీతంగా పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు ఆర్థిక సాయం అందజేస్తున్నారని ప్రశంసించారు. కష్టకాలంలో కార్యకర్త ల కుటుంబాలకు భరోసాగా నిలిచిన పార్టీ తెలుగుదేశం.

ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సమయంలో రాజేంద్రప్రసాద్ కుటుంబానికి అండగా నిలిచిన నాయకుడు చంద్రబాబు. కిడ్నీ సమస్యతో ఇబ్బందిపడుతున్న కార్యకర్త కుటుంబానికి ఆర్థిక చేయూత అందించారు. పార్టీ కార్యకర్తల కష్టాలను తన కష్టాలుగా భావించి ఆదుకునే నాయకత్వం ఉంది. ప్రజల కోసం పనిచేయడమే కాదు.. అవసరంలో ఉన్న వారికి ఆర్థికంగా అండగా నిలుస్తారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తను గుర్తించి గౌరవిస్తారు. కార్యకర్తలకు కష్టం వచ్చినప్పుడు ముందుండి సహాయం చేయ డమే చంద్రబాబు ప్రత్యేకత అని ప్రశంసించారు. కార్యకర్తల కుటుంబాల సంక్షేమమే బాధ్యతగా భావించి పనిచేస్తున్నారని వివరించారు.

### సమస్యలపై నాయకుడికి
# అవగాహన ఉండాలి

- ప్రభుత్వ పాలసీలపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- కేంద్ర సహాయ మంత్రి, ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్
- ప్రజలకు ప్రభుత్వ సేవలు-పాలనా విధానంపై ప్రసంగం



మంగళగిరి(చైతన్యరథం): ప్రజలకు ఏదైనా సమస్య వచ్చిన ప్పుడు పూర్తి అవగాహనతో పరిష్కరించేలా నాయకులు పనిచేయా లని కేంద్ర సహాయ మంత్రి, ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ తెలి పారు. మంగళగిరి టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించడం-పాలనా విధానం అంశంపై పలు సూచన లు చేశారు. గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి స్వీకరించిన సమస్యలను త్వరగా పరిష్క రించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పదేపదే వచ్చే సమస్యలను నోట్ చేసుకుని ముఖ్యమంత్రికి తెలియ జేయాలి. సమస్య పరిష్కారమైనా సరే మళ్లీవాళ్లని కలిసి సమస్య పరిష్కారం అయినందుకువారు సంతృప్తి చెందారా లేదా అనేది తెలుసుకోవాలి. ప్రభుత్వం తీసుకొచ్చిన పాలసీలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని తెలిపారు. గత ప్రభుత్వంలో చేసిన దోపిడీ లు ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలి. మనం చేసిన అభివృద్ధి గురించి స్పష్టంగా వివరించాలి.నాయకులను కలవడానికి ప్రజలు వస్తేవారిని వెయిట్ చేయించకుండా వెంటనే కలిసి నవ్వుతూ పలకరించి వారి సమస్యను తెలు సుకోవాలి.అదే పదిమంది సమస్య ఒకటేఅయితే వెంటనే ఫోన్‌చేసి సమస్యను వారి ముందే పరిష్కరించేలా ఉండాలి.ప్రజలు ఏదైనాసహాయం అడిగినప్పుడు మీకు చేతనైన సహాయం చేయాలి. చేయలేని పక్షంలో వారికి అర్థమయ్యేలా వివరించాలి. ప్రభుత్వం చేసిన కార్యక్రమాల గురించి ఒక కార్యక్రమం ఏర్పా టుచేసి మనంచేసిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలని సూచించారు.

### పార్టీ ఫస్ట్ నినాదంతో
# ముందుకుసాగుదాం

- స్థానిక ఎన్నికలకు కలిసికట్టుగా పనిచేయాలి
- టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ఎమ్మెల్యే ఎండీ నజీర్

మంగళగిరి(చైతన్యరథం): చంద్రబాబు నాయకత్వంలో లోకేష్ స్ఫూర్తితో స్థానిక ఎన్నికల్లో ప్రతిఒక్కరూ కలిసికట్టుగా పనిచేయా లని ఎమ్మెల్యే ఎండీ నజీర్ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రక్రియపై ఈవీఎం, వీవీప్యాట్, ఓటరు కార్డు వంటి అంశాలపై పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో మంగళవారం స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నాహం అంశంపై ఆయన మాట్లాడారు. సీనియర్ నాయకుల అనుభవాలను ఉపయోగించు కుని యువ నాయకత్వం ముందుకు సాగాలి. ప్రతి కార్యకర్తకు స్పష్టమైన బాధ్యతలు ఇచ్చి ఎప్పటికప్పుడు సమీక్షించా లి. స్థానికంగా ఉన్న సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించే వ్యవస్థ ఉండాలి. పరిష్కారం కాని సమస్యలను అవసరమైతే హైకమాండ్ దృష్టికి తీసుకెళ్లాలి. సోషల్ మీడియాను ప్రజలకు సమాచారం చేరవేసే శక్తివంతమైన వేదికగా ఉపయోగించాలి. ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రతి కార్యకర్త సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలి. ప్రతి బూత్‌కు సమర్థవం తమైన బూత్ ఏజెంట్‌ను నియమించాలి. కలిసికట్టుగా పని చేద్దాం..పార్టీ ఫస్ట్ నినాదంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయ పథంలో ముందుకుసాగుదామని పిలుపునిచ్చారు.



## పేదల జీవితాల్లో మార్పు పీ4 లక్ష్యం

- సోషల్‌మీడియాలో విస్తృత ప్రచారం చేయాలి
- ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

మంగళగిరి(చైతన్యరథం): పేదల జీవితాల్లో మార్పు తీసుకు రావడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు పీ4 విధానాన్ని తీసుకొచ్చారని ఎమ్మెల్యే సోమి రెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది పీ4 కార్యక్రమాల కోసం రూ.130కోట్లు ఖర్చు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. పీ4 ద్వారా ముందుగా గిరిజనులకు ప్రాధాన్యత ఇచ్చి వారికి అవసరమైన సహాయం అందించను న్నట్లు తెలిపారు. పేదలకు కేవలం ఆర్థిక సాయం కాకుండా..వారిని స్వయంసమృద్ధి దిశగా తీసుకెళ్లడమే పీ4 లక్ష్యమని తెలి పారు. యువతను పీ4లో భాగస్వాములను చేసి సమాజ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిం చేలా ప్రోత్సహించాలి. సమాజంలో ఉన్న వారు పేదలకు అండగా నిలిచి తమవంతు సహాయం అందించేలా పీ4 స్ఫూర్తినిస్తుంది. పేదలకు ప్రభుత్వం, దాతలు, సమాజం కలిసి అండగా నిలిచే విధానాన్ని ప్రోత్సహిం చాలి. దీని ద్వారా జరిగే మంచి పనులను సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేయాలి. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో కార్య క్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. పేదరికాన్ని తగ్గించి.. పేద కుటుంబాలను అభివృద్ధి పథంలోకి తీసుకురావడమే కార్యక్రమం కీలక లక్ష్యమని తెలిపారు.



# విపత్తుల్లోనే నాయకత్వం విలువ తెలుస్తుంది

- పరిష్కారం చూపే వారే అసలైన నాయకుడు
- ఎల్‌నినోకు ముందస్తుగానే కార్యాచరణ ప్రకటించి చంద్రబాబు రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారు
- లీడర్ షిప్ కాంక్లేవ్‌లో మంత్రి అచ్చెన్నాయుడు

మంగళగిరి(చైతన్యరథం): రాష్ట్రం 27 నెలల క్రితం పూర్తి అగమ్యగోచర పరిస్థితిలో ఉంది. వ్యవస్థలు చిన్నాభిన్నమై పోయా యి. ఆర్థిక వ్యవస్థ భ్రష్టు పట్టింది. అలాంటి సమయంలో సమర్థ వంతమైన నాయకుడిగా ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టారు. కేంద్ర ప్రభుత్వం సహాయంతో ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారు.. నిలిచిపోయిన ప్రాజెక్టులను ఒక పద్ధతి ప్రకారం పూర్తి చేస్తూ రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారు. ఇలాంటి సమయంలోనే ఎల్‌నినో స్పీడ్ బ్రేకర్‌లా వచ్చింది. ప్రకృతి విపత్తులను ఎవరూ ఆపలేరు. ప్రకృతి వైపరీత్యం వచ్చినప్పుడు ప్రజల సమస్యలకు పరిష్కారం చూపించే వారే నిజమైన నాయకులు..అలాంటి నాయ కుడు చంద్రబాబు. రాష్ట్రంలో అనేక భయంకరమైన విపత్తులు వచ్చాయి. రాజమండ్రిలో సూపర్ సైక్లోన్, శ్రీకాకుళంలో తితిలి తుపాను, పశువులకు గడ్డి కూడా ఇవ్వలేని పరిస్థితులు- వీట న్నింటినీ అధిగమించి రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లారు. 30 సంవత్సరాల క్రితమే నీటి సమస్యపై దృష్టి సారించారు. 2014-19 మధ్య ఇరిగేషన్ ప్రాజెక్టులపై రూ.65 వేల కోట్లు ఖర్చు చేశాం. 2019లో టీడీపీ గెలిచి ఉంటే రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టు లు పూర్తయ్యేవి. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 56 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. అన్నమయ్య జిల్లాలో 76 శాతం, ప్రకా శం జిల్లాలో 70 శాతం, చిత్తూరు జిల్లాలో 65 శాతం, విశాఖ పట్నంలో 60 శాతం మైనస్ వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలోని 680 మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదైంది. ఎల్‌నినో ప్రభావాన్ని ముందు గానే అంచనా వేసి గత సంవత్సరంలోనే చెరు వులు నింపడం జరిగింది. రాష్ట్రంలో 8,849 రైతు సేవా కేంద్రా లు ఉన్నాయి. వాటిలో 1,357 కేంద్రాలపై ఎల్‌నినో తీవ్ర ప్రభావం ఉంది. రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రజా ప్రతినిధులు ఆలోచించాలి. రైతులకు వాస్తవ పరిస్థితులను స్పష్టంగా వివరిం చాలి. కొందరు గొడ్డలి పార్టీ నాయకులు రైతులను రెచ్చగొడు తు న్నారు. పట్టిసీమ వల్ల ప్రయోజనం లేదని గొడ్డలి పార్టీ అధ్యక్షుడు ఒకప్పుడు అసెంబ్లీలోనే మాట్లాడారు. ఉచిత పంటల బీమా అని చెప్పి ఐదేళ్లు కనీసం బీమా కూడా కట్టలేదు. కూటమి ప్రభుత్వం లో 46 లక్షల మంది రైతులకు పంటల బీమా అవకాశం కల్పిం చాం. పంటల బీమా కింద ఇప్పటికే రూ.4,800 కోట్లు బీమా చేశాం. రాయలసీమలో హార్టికల్చర్ ప్రాధాన్యత ఇస్తున్నాం. ఎల్‌ని నో ఎదుర్కోవడానికి ప్రతిఒక్కరూ సహకరించాలని పిలుపు నిచ్చారు.



# భవిష్యత్ భారత్‌కు ఆంధ్రప్రదేశ్ మహాశక్తి

- ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకు ఒక సంకల్పంతో ముందుకువెళుతున్నాం
- నెక్స్ట్ జనరేషన్ విప్లవాన్ని చూడబోతున్నాం
- సీమకు మేలు చేసింది ఎన్టీఆర్, చంద్రబాబే
- లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ఎంపీ బైరెడ్డి శబరి



మంగళగిరి(చైతన్యరథం): ఇది ఒక ట్రైనింగ్ సెషన్ మాత్రమే కాదు.. మన రాష్ట్ర భవిష్యత్తును మన నాయకత్వాన్ని మరింత పదును పెట్టుకునే సమావేశంగా భావించాలి. భవిష్యత్తు భారత దేశానికి ఆంధ్రప్రదేశ్ ఒక మహాశక్తిగా ఎదుగుతుందని ఎంపీ బైరెడ్డి శబరి పేర్కొన్నారు. టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ప్రజాప్రతి నిధులకు ఆమె సందేశం ఇచ్చారు. ఒకప్పుడు మన రాష్ట్రం ఐటీ విప్లవాన్ని చూసింది.. నేడు నెక్స్ట్ జనరేషన్ విప్లవాన్ని చూడబో తుంది. ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకు సమానంగా అభి వృద్ధి చేస్తూ ప్రతి కుటుంబానికి అవకాశం.. ప్రతి రైతుకి అదా యం.. యువతకు ఉద్యోగం అనే మహా సంకల్పంతో ముందుకు వెళుతున్నాం. రూ.1.40 లక్షల కోట్లతో అభివృద్ధి పనులను చేస్తు న్నాం.. 363 ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టాం.. 11 లక్షల ఉద్యోగా లను సృష్టించాం. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో రోజు రోజుకు అభివృద్ధిలో ఉప్పెనలా ముందుకు సాగుతుంది. కాంగ్రెస్, వైసీపీ పాలనలో ఎవరూ కూడా రాయలసీమను అభివృద్ధి దిశగా ముందుకు తీసుకువెళ్లాలని ఎప్పుడూ చూడలేదు. రాయలసీమను ఎంతసేపు ఓటు బ్యాంకుగానే పరిగణించారు. రాయలసీమకు మేలు చేసిందల్లా అనాడు ఎన్టీఆర్. ఆనాడు సీమకు నీళ్లు తీసుకు రావాలని కృష్ణమ్మను రాయలసీమకు తరలించారు. తెలుగుగంగ, హంద్రీనీవా, గాలేరు నగరి ప్రాజెక్టులకు పునాది వేసి ప్రతి ఎకరా కు నీరు ప్రవహించాలని ఆయన కల కన్నారు. ఈ రోజు మన ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ కలలను నెరవేర్చుతున్నారు. రెండు న్నర ఏళ్ల కాలంలో రూ.13 వేల కోట్లు ఖర్చు చేశాం. వైసీపీ వారి ఐదేళ్ల కాలంలో ఖర్చు చేసింది కేవలం రూ.2 వేల కోట్లు మాత్రమే. గొడ్డలి పార్టీ పాలనలో ప్రచార ఆర్భాటాలే తప్ప.. ఏమి లేదు.. ఈ రోజు మంత్రి నారా లోకేష్ గారి చొరవతో రాయల సీమకు ఎన్నో పరిశ్రమలు వస్తూ.. పరిశ్రమల హబ్‌గా ఎదుగు తుంది. కూటమి ప్రభుత్వం మరో 20 ఏళ్ళ అధికారంలో ఉంటే రాష్ట్రం అభివృద్ధి దిశగా దూసుకుపోతుంది అనడంలో ఎటువంటి సందేహం లేదని తెలిపారు.

# నియోజకవర్గ మీడియా కోఆర్డినేటర్ ఉండాలి

- గడపగడపకు పార్టీ సమాచారం చేరవేత అత్యంత కీలకం
- లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో మంత్రి నిమ్మల రామానాయుడు
- రాజకీయ ప్రచారం-ప్రజా సంబంధాలపై ప్రసంగం

మంగళగిరి(చైతన్యరథం): ప్రెస్‌నోట్స్, వీడియోల సమన్వయా నికి నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక మీడియా కోఆర్డినేటర్ ఉండాలని మంత్రి నిమ్మల రామానాయుడు సూచించారు. టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో రాజకీయ ప్రచారం-ప్రజా సంబంధాలు అంశంపై పలు సూచనలు చేశారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్ స్టాగ్రామ్‌తో పాటు లోకల్ యూట్యూబర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లతో డిజిటల్ ప్రచారం చేయాలని తెలిపారు. ఎమ్మెల్యే నియోజకవర్గం లో లేనప్పుడు కూడా అభివృద్ధి పనులు, లబ్ధిదారుల అనుభవాల ను రికార్డ్ చేసేందుకు ప్రత్యేక ఫొటో, వీడియో బృందం అవసరం. ప్రతి బూత్‌లో చివరి గడప వరకు పార్టీ సమాచారాన్ని చేరవేసేం దుకు కమ్యూనికేషన్ వాలంటీర్ల వ్యవస్థ అత్యంత కీలకం. ఎమ్మెల్యే నాయకత్వంలో ఈ 4 విభాగాలతో కూడిన ప్రత్యేక బృందాన్ని ప్రతి నియోజకవర్గంలో తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి. డిజిటల్ ప్రచారంతో పాటు ప్రజలను నేరుగా ముఖాముఖి కలిసినప్పుడే నాయకత్వంపై నమ్మకం, అభిమానం రెట్టింపవుతాయి. ప్రజలతో మమేకం కావడానికి ఇంటింటి ప్రచారం, కమ్యూనిటీ మీటింగ్స్, పాదయాత్ర, రచ్చబండ, రౌండ్ టేబుల్ సమావేశాలు ప్రధాన మార్గాలుగా నిలుస్తాయి. పార్టీ కేడర్‌లో పట్టుదల, తిరుగులేని స్ఫూర్తిని నింపేందుకు నారా లోకేష్ పాదయాత్ర అందరికీ ఆద ర్శం. గ్రామ, వార్డు స్థాయిల్లో రచ్చబండల ద్వారా స్థానిక ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలోనే అక్కడికక్కడే పరిష్కరించుకోవచ్చు. సోషల్ మీడియా ప్రచారం ఎంత అవసరమో, సమాజంలోని మేధావులు, పెద్దల ద్వారా జరిగే 'నోటి మాట' ప్రచారం పార్టీకి అంతే కీలకమని తెలిపారు.



# అభివృద్ధి పనుల పూర్తికి గడువు పెట్టుకోవాలి

- అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాలి
- ప్రభుత్వంపై అబద్ధపు ప్రచారాన్ని తిప్పికొట్టాలి
- ప్రతీ నియోజకవర్గంలో పెండింగ్ సమస్యలపై
- ప్రత్యేక డ్యాష్‌బోర్డు ఏర్పాటు చేయాలి
- రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్



మంగళగిరి(చైతన్యరథం): పనులను ముందే ప్లాన్ చేసుకుని స్పష్టమైన గడువుతో పూర్తి చేసేలా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాలని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ సూచించారు. టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించడం, పాలనా విధానం అంశంపై ఆయన ప్రసం గించారు. ప్రభుత్వ పథకాలు, నిర్ణయాలపై నిజమైన సమాచారా న్ని ప్రజలకు చేరవేస్తూ అబద్ధపు ప్రచారాలను నాయకులు తిప్పి కొట్టాలని సూచించారు. ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజల నుంచి వస్తున్న అర్జీల్లో 70 శాతం సమస్యలు భూములకు సంబం ధించి నవే. భూ రికార్డులు, పట్టాదారు పాస్‌బుక్కులు, సర్వే సమస్యలను నిర్ణీత గడువులోగా పారదర్శకంగా పరిష్కరించాలని సూచించారు. సర్వే, రెవెన్యూ శాఖలను అనుసంధానిస్తూ బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ద్వారా భూ రికార్డులకు పూర్తి భద్రత కల్పించాం. పాత పాస్ పుస్తకాల్లో అవసరం లేని వ్యక్తుల ఫొటోలను తొలగిస్తూ ఇప్పటి వరకు 36,18,772 పాస్‌పుస్తకాలను మార్చామని తెలిపారు.

### ప్రభుత్వ ఆస్తులు కాపాడుతూనే 22ఏ నుంచి విముక్తి

22ఏ భూముల విషయంలో కేస్ బై కేస్ పరిశీలించి పేదలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. 22ఏ నుంచి ఒక్క సారిగా తొలగించకుండా ప్రభుత్వ ఆస్తులను కాపాడుతూనే అర్హు లైన పేదలకు హక్కులు కల్పిస్తున్నాం. దశాబ్దాలుగా భూముల్లో నివసిస్తున్న పేదల నుంచి ఎలాంటి రుసుము తీసుకోకుండా భూ హక్కులు కల్పిస్తున్నాం. పేదలకు రెండు లేదా మూడు సెంట్ల ఇళ్ల స్థలాలు ఇస్తామని ఇచ్చిన హామీని రాబోయే రోజుల్లో అమలు చేస్తాం. నాలా చట్టంలో సంస్కరణలు తెచ్చాం.. అక్రమ లే అవు ట్లపై ఎమ్మెల్యేలు, అధికారులు కఠినంగా వ్యవహరించాలి. రెవె న్యూ సదస్సుల్లో వచ్చిన ప్రతి కేసుకు సంబంధించి ఆలస్యానికి గల కారణాలను ప్రజలకు బహిరంగంగా చెబుతున్నాం. ఈ పహాని ద్వారా 12.57 లక్షల ఎకరాల నవీకరణ, 16.26 లక్షల ఎకరాల్లో రీ-సర్వే పూర్తి చేశామని వివరించారు.

### సమస్యల పరిష్కారం వరకూ తోడుగా ఉండాలి

ఎమ్మెల్యే కార్యాలయాలు కేవలం వినతులు స్వీకరించడానికే కాక సమస్య పరిష్కారం అయ్యే వరకు ప్రజలకు తోడుగా ఉండా లి. డేటా ద్వారా సమస్య ఎక్కడ ఉందో తెలిస్తే ప్రజలతో ప్రత్య క్షంగా మాట్లాడితేనే ఆ సమస్యకు మూల కారణం తెలుస్తుంది. ప్రతీ నియోజకవర్గంలో పెండింగ్ సమస్యలు, బాధ్యుల వివరాల తో ప్రత్యేక డ్యాష్‌బోర్డు ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరిగే పనిలేకుండా అన్ని సంక్షేమ పథకాల వివరాలు మై గవర్నమెంట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఉన్నాయి. జనన, మరణ, కుల, ఆదాయ ధ్రువపత్రాలు వాట్సాప్ ద్వారానే పొందేలా చర్యలు తీసుకున్నాం. దళారీ వ్యవస్థకు చెక్ పెట్టాం. నాయకత్వం అంటే కేవలం పదవి కాదు.. ప్రజల కోసం ఎంత కష్టపడుతున్నామన్నదే అసలైన నాయకత్వం. రోజుకు 18 గంటలు కష్టపడే చంద్రబాబు శ్రమలో కనీసం 50 శాతం కష్టపడితే రాష్ట్ర అభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరని తెలిపారు.

44వ రోజూ విజయవంతంగా?

## ‘ఇంటింటికీ తెలుగుదేశం’

- 1.15 లక్షల ఇళ్లకు పార్టీ నాయకులు, కార్యకర్తలు
- మొత్తంగా 1.07 కోట్ల ఇళ్ల సందర్శన టీడీపీ శ్రేణులు
- ప్రజలకు-ప్రభుత్వానికి వారధిలా కార్యక్రమం

అమరావతి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ‘ఇంటింటికీ తెలుగుదేశం-2026’ కార్యక్రమం 44వ రోజు మంగళవారం కూడా విజయవంతంగా కొనసాగింది. మరో 1.15 లక్షల ఇళ్లను టీడీపీ శ్రేణులు సందర్శించారు. ఇప్పటివరకు 1.07 కోట్ల ఇళ్లకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు చేరుకున్నారు. ప్రతి కుటుంబాన్ని నేరుగా కలుసుకుంటూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు, అభివృద్ధి కార్యక్రమాలను పార్టీ శ్రేణులు వివరిస్తున్నారు. అదే సమయంలో ప్రజల నుంచి వస్తున్న స్పందనను తెలుసుకోవడంతో పాటు, వారి సమస్యలు, స్థానిక అవసరాలు, అభిప్రాయాలను నేరుగా సేకరిస్తున్నారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా ‘ఇంటింటికీ తెలుగుదేశం -2026’ కార్యక్రమం ప్రజలకు-ప్రభుత్వానికి మధ్య బలమైన వారధిగా నిలుస్తోంది. ప్రతి గడపకు ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలు చేరుకోవాలనే లక్ష్యంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరంతరం ఇంటింటి పర్యటనలను కొనసాగిస్తున్నారు.

# రక్తపు రుచి మరిగిన పులిలా జగన్ తీరు

- గతంలో ఒకసారి అబద్ధాలు, తప్పుడు హామీలతో అధికారం
- అదే వ్యూహంతో నేడు అసత్య ప్రచారాలు
- అందుకే మెగా డీఎస్సీపై విషం చిమ్మే కుట్రలు
- హారిజాంటల్ రోస్టర్ విధానాన్ని 2023లో తీసుకొచ్చిందే జగన్ ప్రభుత్వం, నేడు దానిపైనే విమర్శలు
- పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్

అమరావతి (చైతన్యరథం): తప్పుడు విధానాలు, అబద్ధపు ప్రచారాలు, అమలుకాని హామీలతో గతంలో అధికారాన్ని చేజిక్కించుకున్న వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. ఇప్పుడు మళ్లీ అదే అలవాట్లతో ప్రజలను వంచించాలని చూస్తున్నారని పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రక్తపు రుచి మరిగిన పులి పదే పదే అదే ప్రాంతంలో మాటువేసి దాడి చేయాలని చూసినట్లుగా జగన్ వ్యవహారం ఉందని విమర్శించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జర్మనీలో హిట్లర్, ఇటలీలో ముస్సోలిని అధికారంలోకి రావడానికి జోసెఫ్ గోబెల్స్ లాంటి వాళ్లతో పచ్చి, అధికార మీడియా ద్వారా ప్రత్యర్థులపై అసత్య కథనాలను పదే పదే ప్రచారం చేయించారన్నారు. చరిత్రలో సమాధి అయిపోయిన ఆ అబద్ధపు ప్రచారాల పరంపరను జగన్ మోహన్‌రెడ్డి ఏపీ రాజకీయాల్లో పునరావృతం చేస్తున్నారు. 14వ శతాబ్దంలో మహమ్మద్ బిన్ తుగ్లక్ తండ్రి మరణ వార్తను వాడుకుని అధికారాన్ని హస్తగతం చేసుకున్నాడని చరిత్రకారుడు ఇబ్న్ బతూతా రాశారు. అదే రీతిలో జగన్ కూడా నాడు తండ్రి మరణాన్ని అడ్డం పెట్టుకుని సంతకాల సేకరణతో సానుభూతి రాజకీయాలకు తెరతీశారు. నాడు తుగ్లక్ మాదిరిగానే జగన్ కూడా మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని అయోమయంలోకి నెట్టారు. గతంలో బ్రిటిష్ వారి తరహాలోనే జగన్ కూడా రకరకాల కుట్రలతో వ్యవస్థలను, రాష్ట్రాన్ని మోసం చేశారని మండిపడ్డారు. ఇలాంటి ప్రమాదకరమైన రాజకీయ పోకడలను, మోసపూరిత విధానాలను ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎప్పటికీ క్షమించరని, జగన్ ఎన్ని కుతంత్రాలు పన్నినా రాష్ట్ర ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఎమ్మెల్యే మురళీమోహన్ హెచ్చరించారు.

### ఓర్వలేక అసత్య ప్రచారాలు

ఐదేళ్ల తన పాలనలో ఒక్క డీఎస్సీ కూడా వేయకుండా, ఒక్క టీచర్ ఉద్యోగం కూడా ఇవ్వలేని జగన్ మోహన్ రెడ్డి.. కూటమి ప్రభుత్వం పారదర్శకంగా 16,347 టీచర్ పోస్టులను భర్తీ చేస్తే ఓర్వలేక దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మెగా డీఎస్సీ చేపట్టి యువత కలలను సాకారం చేస్తే, జీర్ణించుకోలేక నిరాధార ఆరోపణలు గుప్పిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి కనీస తేడా తెలియని జగన్.. వర్టికల్, హారిజాంటల్ రోస్టర్‌ల గురించి మాట్లాడటం హాస్యాస్పదం. 2023లో వైసీపీ ప్రభుత్వ హయాంలోనే అధికారులు హారిజాంటల్ రోస్టర్ విధానాన్ని తీసుకొచ్చారు. ఆ నిబంధనల ప్రకారమే గతంలో గ్రామ/వార్డు సచివాలయాల్లో స్పోర్ట్స్ కోటా భర్తీ చేశారు. సొంత పాలనలోని నిబంధనలే తెలియకుండా ఇప్పుడు మాట్లాడటం ఆయన అజ్ఞానానికి నిదర్శనం. 2012 నుంచి 2024 వరకు గత ప్రభుత్వాల హయాంలో ఇంటర్-స్కూల్, ఇంటర్-జోనల్ స్థాయి సర్టిఫికెట్లతో ఉద్యోగాలు ఇచ్చిన మాట వాస్తవం కాదా? కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టాక సరికొత్త స్పోర్ట్స్ పాలసీని తెచ్చి, కోటాను 3% కి పెంచడమే కాకుండా.. జీవో నెం. 4 ద్వారా ఇంటర్-కాలేజ్ స్థాయి సర్టిఫికెట్లను ఉద్యోగాల భర్తీ నుంచి మినహాయించి నిజమైన క్రీడాకారులకు ప్రాధాన్యం కల్పించింది. చిత్తూరు జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ (సోషల్ స్టడీస్) మొత్తం 118 ఖాళీలు ఉండగా, బీసీ-డీ కేటగిరీకి 7 పోస్టులున్నాయి. మొదటి 5 పోస్టులు మెరిట్ ప్రకారం భర్తీ చేయగా 114వ ర్యాంకు వద్ద కటాఫ్ ముగిసింది. 125వ ర్యాంకు వచ్చిన ఏకాంబరం అనే అభ్యర్థికి పోస్టు ఎలా వస్తుంది? మిగిలిన రెండు పోస్టులు నిబంధనల ప్రకారం హారిజాంటల్ రోస్టర్‌లో పీహెచ్, ఎక్స్-సర్వీస్‌మెన్, స్పోర్ట్స్ కోటా అర్హులకు వెళ్లడం సహజం. ఎస్టీటీ ఓపెన్ కేటగిరీలో చివరగా ఎంపికైన అభ్యర్థి కటాఫ్ ర్యాంకు 631 కాగా, 644వ ర్యాంకు వచ్చిన



విజయలక్ష్మికి నిబంధనలను ఉల్లంఘించి ఉద్యోగం ఎలా కేటాయిస్తారు? మెగా డీఎస్సీ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా, నిబంధనల ప్రకారమే జరిగింది. అసత్య ప్రచారంతో నిరుద్యోగుల జీవితాలతో రాజకీయం చేస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని జగన్‌ను ఎమ్మెల్యే మురళీమోహన్ హెచ్చరించారు.

### గ్రూప్ 1లో భారీ కుంభకోణం

పాలసీలు ఎన్ని తెచ్చినా ప్రభుత్వ వ్యవస్థను, యంత్రాంగాన్ని నడిపే బ్యూరోక్రసీ సరిగ్గా లేకపోతే వ్యవస్థ కుప్పకూలిపోతుంది. అలాంటి కీలకమైన గ్రూప్-1 నియామకాలను బజారుకీడ్చిన చరిత్ర వైఎస్ జగన్ మోహన్ రెడ్డిదని మురళీమోహన్ మండిపడ్డారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అత్యున్నత గ్రూప్-1 పరీక్షా పత్రాల మూల్యాంకనాన్ని ఏకంగా ప్రైవేట్ రిసార్టుల్లో పెట్టి నడిపించారు. అర్హత లేని వ్యక్తులతో మూల్యాంకనం చేయించిన ఘనత జగన్ ప్రభుత్వానిది. అంతలా వ్యవస్థలను భ్రష్టుపట్టించిన జగన్‌కు పరీక్షల నిర్వహణపై మాట్లాడే అర్హత ఎక్కడిది? వైఎస్సార్సీపీ జెండాతో, పార్టీ పేరుతో రోడ్డెక్కితే ప్రజలు చీపుర్లతో కొడతారనే భయంతో ‘జెన్-జీ’ ముసుగులు వేసుకుని రోడ్లపైకి వచ్చి ఆందోళనల పేరిట పోలీసులపై దాడులకు తెగబడ్డారు. మా నియోజకవర్గంలోనే విధి నిర్వహణలో ఉన్న ఏఎస్ఐ జ్యోతిని కిందపడేసి, తోసి, కొట్టి దాష్టీకం ప్రదర్శించారు. బెదిరింపులు, దాష్టీకాలు, దౌర్జన్యాలతో ప్రజలను భయపెట్టి మళ్లీ అధికారాన్ని చేజిక్కించుకోవాలని చూస్తే ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం చూస్తూ ఊరుకోరని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఇప్పటికైనా కుటిల బుద్ధులు, నేరపూరిత రాజకీయాలు మానుకోకపోతే రాష్ట్ర రాజకీయాల్లో చోటు లేకుండా ప్రజలే వైఎస్సార్సీపీని శాశ్వతంగా తరిమికొడతారని హెచ్చరించారు.

### మంత్రి లోకేష్ రాజీనామా అడిగే నైతిక హక్కు లేదు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎంతో ప్రతిష్టాత్మకంగా 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తే, ఎక్కడో ఒకటి రెండు అంశాలను పట్టుకుని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని వైఎస్సార్సీపీ నాయకులు డిమాండ్ చేయడం సిగ్గుచేటని ఎమ్మెల్యే మురళీమోహన్ మండిపడ్డారు. గ్రూప్-1 పరీక్ష పేపర్ల మూల్యాంకనాన్ని రిసార్టులలో పెట్టి బజారుకీడ్చింది.. సచివాలయ పోస్టుల నియామకాల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరించింది.. ఐదేళ్లపాటు ఒక్క డీఎస్సీ కూడా వేయకుండా లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్నది.. ఆఖరికి వాలంటీర్లను కూడా ప్రభుత్వ ఉద్యోగులుగా చిత్రీకరించి యువతను మోసగించింది జగన్. ఐదేళ్ల పాలనలో వ్యవస్థలను సర్వనాశనం చేసిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని రాజకీయాల్లో ఉండడానికే అనర్హుడిగా ప్రకటించి, రాజకీయాల నుంచే శాశ్వతంగా బహిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వానికి పూర్తి చిత్తశుద్ధి, పాలనా సమర్థత ఉన్నాయి. నిరుద్యోగ యువతకు ఇచ్చిన ప్రతి మాటనూ నిలబెట్టుకుంటున్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గదర్శకత్వంలో, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రంలో ఇకపై ప్రతి ఏటా తప్పనిసరిగా డీఎస్సీ నిర్వహిస్తాం. నిరంతరం ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తూ విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తాం. రాష్ట్ర అభివృద్ధి, విద్యా వ్యవస్థ ప్రక్షాళన కోసం ప్రభుత్వం చేపడుతున్న ఈ బృహత్తర కార్యాన్ని జగన్ వంటి వారి బెదిరింపులు ఏమాత్రం అడ్డుకోలేవని ఎమ్మెల్యే మురళీమోహన్ హెచ్చరించారు.

## ఒక్క టీచర్ పోస్టుకూడా ఇవ్వని..

# జగన్‌కేం తెలుసు డీఎస్సీ విలువ?

- మెగా డీఎస్సీ విజేతల శ్రమను అవమానించేలా విషప్రచారం
- అబద్ధాల్లో గోల్డ్‌మెడల్ ఉంటే అది వైసీపీకే
- కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

అమరావతి (చైతన్యరథం): ఐదేళ్ల పాలనలో ఒక్క టీచర్ ఉద్యోగం కూడా ఇవ్వలేని జగన్ రెడ్డికి డీఎస్సీ విలువ ఎలా తెలుస్తుందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ధ్వజమెత్తారు. అందుకే కష్టపడి టీచర్ ఉద్యోగం తెచ్చుకున్న అభ్యర్థుల శ్రమను అవమానించేలా విషం చిమ్ముతున్నారన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ మెగా డీఎస్సీపై వైసీపీ నాయకులు చేస్తున్న నిరాధారమైన, ఫేక్ ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ఎప్పుడూ అసత్య ప్రచారాలు చేయడమే అలవాటుగా మార్చుకున్న వైసీపీకి నిరుద్యోగుల భవిష్యత్తుపై మాట్లాడే అర్హత లేదని స్పష్టం చేశారు. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలో ఒక్క డీఎస్సీ ఇవ్వలేదు, ఒక్క పరిశ్రమా తీసుకురాలేదు, అభివృద్ధి అనేది ఎక్కడా కనిపించలేదు. ఉద్యోగాలు లేక యువత పడ్డ అవస్థలు ప్రజలందరికీ ఇంకా గుర్తుందని ప్రశాంతిరెడ్డి అన్నారు.

### ఏడాది తరువాత దుష్ప్రచారం..

ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీపైనే సీఎం చంద్రబాబు తొలి సంతకం చేశారు. ప్రభుత్వం ఏర్పాటైన 148 రోజుల్లోనే ఎంతో పారదర్శకంగా, నిబంధనల ప్రకారం పరీక్షలు నిర్వహించి 16,347 మందికి టీచర్ ఉద్యోగాలు కల్పించాం. కోవూరు నియోజకవర్గంలో ఉద్యోగాలు సాధించిన ప్రతి ఒక్కరి ఇంటికీ స్వయంగా వెళ్లి చూశాను. ఎంతోమంది భార్యాబిడ్డలకు, కుటుంబాలకు దూరంగా ఉండి, ఎన్నో త్యాగాలు చేసి రాత్రింబవళ్లు కష్టపడి ఈ ఉద్యోగాలు సాధించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ఇచ్చిన మాటకు కట్టుబడి వేగంగా డీఎస్సీ పూర్తి చేయడంతో ఆ కుటుంబాల్లో పండుగ వాతావరణం నెలకొంది. తమ హయాంలో ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వలేని వైసీపీ నేతలకు డీఎస్సీ విలువేం తెలుస్తుంది? నియామకాలు సజావుగా పూర్తయిన ఏడాది తర్వాత, ఎవరో ఒక ప్రైవేట్ కాలేజీ వ్యక్తి ఇచ్చిన కాగితాన్ని పట్టుకుని, అవాస్తవాలతో మెగా డీఎస్సీపై బురదజల్లాలని చూడటం సిగ్గుచేటు. వాస్తవాలు ఏంటో రాష్ట్ర ప్రజలందరికీ స్పష్టంగా తెలుసు. యువత సాధించిన విజయాలను కించపరిచేలా వైసీపీ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు ఎవరూ నమ్మరు. నిరుద్యోగుల ఆశలతో రాజకీయం చేయడం మానుకోవాలని ప్రశాంతిరెడ్డి హితవు పలికారు.

### అబద్ధాల్లో ఒలింపిక్ గోల్డ్ మెడల్ వైసీపీదే..

కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం రాష్ట్ర ప్రజలందరి కళ్లముందే స్పష్టంగా కనిపిస్తోందని ప్రశాంతి రెడ్డి అన్నారు. మెగా డీఎస్సీ ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు రావడాన్ని చూసి ఓర్వలేకనే వైసీపీ అసత్య ప్రచారాలకు ఒడిగడుతోందని ఆమె మండిపడ్డారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలను సైతం నిరంతరం ప్రజల కోసమే పనిచేసేలా నడిపిస్తున్నారు. గ్రామీణ ప్రాంత రోడ్లను నేడు యుద్ధప్రాతిపదికన అభివృద్ధి చేస్తున్నాం. గత పాలకులు కీలక



సమస్యలను కూడా పట్టించుకోలేదని గ్రామాల్లోకి వెళ్లినప్పుడు ప్రజలే స్వయంగా చెబుతున్నారు. మా నియోజకవర్గంలో గత 30 ఏళ్లుగా నిరుపయోగంగా పడి ఉన్న 'కిసాన్ సెజ్'ను నేడు సీఎం చంద్రబాబు సహకారంతో తిరిగి పరుగులు పెట్టిస్తున్నాం. అనేక పరిశ్రమలు ఇక్కడికి వస్తున్నాయి. రాబోయే రోజుల్లో స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. గత ప్రభుత్వంలో యువతకు ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వాలనే ఆలోచన చేయని వారు, నేడు జెన్-జీ యువత గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉంది. నేడు యువత స్వార్థం కోసం కాకుండా సమాజ అభివృద్ధి, రోడ్లు, మౌలిక సదుపాయాలు బాగుపడాలని కోరుకుంటున్నారు. రాబోయే తరాల బంగారు భవిష్యత్తు కోసం చంద్రబాబు చేస్తున్న కృషిని యువత నిండు మనసుతో స్వాగతిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 'విజన్ 2020'తో ఐటీ విప్లవాన్ని తెచ్చి లక్షలాది కుటుంబాల్లో వెలుగులు నింపిన ఘనత చంద్రబాబుది. ఇప్పుడు 'విజన్ 2047' ద్వారా ప్రతి ఇంట్లో ఒక ఎంటర్‌ప్రెన్యూర్ (పారిశ్రామికవేత్త) తయారు కావాలనే సంకల్పంతో ముందుకు వెళ్తున్నారు. అబద్ధాలు ప్రచారం చేయడంలో పోటీలు పెడితే వైసీపీ నాయకులకు ఒలింపిక్ గోల్డ్ మెడల్స్ వస్తాయి. చేతిలో ఎలాంటి ఆధారాలు లేకపోయినా.. ప్లైట్స్ వేసి, కాగితాలు చూపిస్తూ ఫేక్ ప్రచారాలు చేయడమే ఆ పార్టీ నైజం. ఆధారాలు లేని అసత్యాలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తే రాబోయే రోజుల్లో ఆ ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందని, ఇలాంటి ఫేక్ ప్రచారాలను ప్రజలు ఎవరూ నమ్మబోరని ఆమె స్పష్టం చేశారు.

### నాడు వైన్ షాపులకు కాపలా..
### నేడు అంతర్జాతీయ శిక్షణ

ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని కాలరాసిన చరిత్ర వైసీపీది అయితే, వారిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదని ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఉపాధ్యాయ వృత్తిని కించపరుస్తూ, టీచర్లను మద్యం దుకాణాల వద్ద కాపలాదారులుగా నిలబెట్టిన దుర్మార్గమైన రోజులను ఎవరూ మర్చిపోలేదు. కానీ నేడు మన యువనేత, విద్యాశాఖ మంత్రి లోకేష్ చొరవతో అదే ఉపాధ్యాయులకు అత్యాధునిక బోధనా పద్ధతులు నేర్పించేందుకు విదేశాలకు పంపి అంతర్జాతీయ స్థాయి శిక్షణ ఇప్పిస్తున్నారు. ఉపాధ్యాయుల పట్ల గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి ఉన్న తేడాను సమాజం గమనిస్తోంది. వైసీపీకి ఉపాధ్యాయులన్నా, విద్యా వ్యవస్థ అన్నా కనీస మర్యాద, గౌరవం, విలువ లేవు. గురువులను అవమానించడమే పనిగా పెట్టుకున్న వారు నేడు విద్యా వ్యవస్థ గురించి మాట్లాడటం సిగ్గుచేటు. ప్రజల్లో బలం, విశ్వసనీయత కోల్పోయినప్పుడే రాజకీయంగా మనుగడ కోసం అబద్ధాలను, ఫేక్ ప్రచారాలను ఆశ్రయిస్తారు. వైసీపీ మొదటినుంచీ ఫేక్ పార్టీగానే మిగిలిపోయింది. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఇటువంటి తప్పుడు కథనాలు సృష్టిస్తున్నారు. రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలన్నా, ఉపాధ్యాయుల గౌరవం నిలబడాలన్నా అది కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఆమె స్పష్టం చేశారు.

# డీఎస్సీపై కోర్టుకు వెళ్లే దమ్ముందా జగన్?

- కోడిగుడ్డుపై ఈకలు పీకుతున్నట్లుగా గొడ్డలి పార్టీ తీరు
- పేటీఎం బృందాలతో అసత్య ప్రచారాలు, ఆధారాలుంటే కోర్టుకెళ్లండి
- పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

అమరావతి (చైతన్యరథం): ఎలాంటి అక్రమాలకు తావులేకుండా నిర్వహించిన మెగా డీఎస్సీపై గొడ్డలి పార్టీ కోడి గుడ్డు మీద ఈకలు పీకడం లాంటి కార్యక్రమం పెట్టుకుందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మండిపడ్డారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశం లో ఆమె మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో నిరుద్యోగులకు, యువతకు వైసీపీ ఏ మాత్రం మేలు చేయలేదని విమర్శించారు. యువగళం పాదయాత్రలో యువతకు ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే మంత్రి నారా లోకేష్ 16 వేల డీఎస్సీ ఉద్యోగాలు భర్తీ చేసి చూపించారు. ఐదేళ్లలో జగన్ రెడ్డి చేయని పనిని 150 రోజుల్లో చేసి చూపించారు. ఇంకా డీఎస్సీ నోటిఫికేషన్లు ఇస్తామని దమ్ము, ధైర్యంగా ప్రకటించిన లోకేష్‌ని అభాసుపాలు చేసేందుకు జగన్ రెడ్డి ప్రయత్నిస్తున్నారు. కల్పిత కథనాలతో గందరగోళం సృష్టిస్తున్న పేటీఎం ఆర్టిస్టుల తప్పుడు ప్రచారాన్ని ప్రజలు గమనించాలి. అభివృద్ధి, సంక్షేమాన్ని సక్రమంగా అమలు చేయకుండా, మూడు రాజధానుల పేరుతో డ్రామా ఆడి ఐదేళ్ల పాలనలో ప్రజలను జగన్ మోసం చేశారు. నేడు డీఎస్సీలో



ఎలాంటి అవకతవకలు జరగలేదని ఐఏఎస్ అధికారులు బయటికొచ్చి చెబుతున్నా.. కావాలనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే శిరీష తప్పుబట్టారు.

### అత్యంత పారదర్శకంగా..

ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వని జగన్ రెడ్డికి.. నేడు రికార్డు సమయంలో ఉద్యోగాలు ఇచ్చిన మంత్రి లోకేష్‌పై విమర్శలు చేసే అర్హత లేదు. ప్రతి విషయాన్ని గెజిట్‌లో పెట్టాం, జీఓలు ఇచ్చాం. నిష్పక్షపాతంగా డీఎస్సీ నిర్వహించాం. అర్ధరాత్రి లేపి అడిగినా సమాధానం చెప్పే విధంగా అన్ని వివరాలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాం. జగన్‌లా అర్ధరాత్రి జీఓలతో ప్రజలను మోసం చేయలేదు. స్పోర్ట్స్ కోటాపై గొడ్డలి పార్టీ ఆధారాలు లేని ఆరోపణలు చేస్తోంది. స్పోర్ట్స్ కోటాలో 3 శాతం రిజర్వేషన్‌తో 431 పోస్టులు ఉంటే, 3,600 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అందులో 382 మందిని రాష్ట్రస్థాయి కమిటీ నిబంధనల ప్రకారమే ఎంపిక చేసింది. ఎవరు ఎప్పుడు అడిగినా సమాధానం చెప్పడానికి మేము సిద్ధంగా ఉన్నాం. మీరు అడిగే ప్రతి ప్రశ్నకు మా వద్ద సమాధానం ఉందని శిరీష చెప్పారు.

### పదేపదే అవే అబద్ధాలు

వైసీపీ నాయకులకు దమ్ముంటే కోర్టుకు వెళ్లి మీ వద్ద ఉన్న ఆధారాలను చూపించండి. కోర్టులే వాస్తవాలను తేల్చుతాయి. మీ వాదనలో వాస్తవం లేదని కోర్టులు చివాట్లు పెట్టినా.. జగన్ రెడ్డి బుద్ధి మారడం లేదు. పదేపదే అవే అబద్ధాలు వల్లెవేస్తూ యువతను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. చెస్ మాదిరిగా బ్రిడ్జ్ కూడా ఒక రకమైన గేమ్. ఉల్లగడ్డకు, ఉల్లిగడ్డకు తేడా తెలియని జగన్ రెడ్డి డీఎస్సీ గురించి మాట్లాడితే ప్రజలు నమ్ముతారా? ఇచ్చిన మాట ప్రకారం మంత్రి లోకేష్ ఉద్యోగాలు కల్పించడంతో యువత హర్షం వ్యక్తం చేస్తున్నారు. అర్హత సాధించలేని యువత మరోసారి డీఎస్సీలో ఉద్యోగం సాధించేందుకు సిద్ధమవుతున్నారు.

ఎక్కువ మార్కులు వచ్చిన వారికి కాకుండా తక్కువ మార్కులు వచ్చిన వారికి ఉద్యోగాలు ఎలా వచ్చాయని వైసీపీ నేతలు అవగాహన లేకుండా ప్రశ్నిస్తున్నారు. కేవలం మార్కుల ఆధారంగానే ఎంపికలు జరగవు. కేటగిరీ, రోస్టర్, హారిజంటల్ రిజర్వేషన్, మహిళలు, దివ్యాంగులు, క్రీడాకారులు, మాజీ సైనికులు వంటి నిబంధనల ప్రకారం ఉద్యోగ నియామకాలు జరుగుతాయి. వీటన్నింటిపై ఇప్పటికే సమాధానం కూడా చెప్పామని శిరీష స్పష్టం చేశారు.

### ఐదేళ్ల పాలనలో యువతకు దగా

ఐదేళ్లు ఏమీ చేయని వైసీపీ ప్రభుత్వానికి భిన్నంగా.. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, అభివృద్ధి పనులను వేగంగా చేపడుతోంది. వెలిగొండ, పోలవరం ద్వారా నీటిని అందించాం. ప్రజల్లో కూటమి ప్రభుత్వానికి మంచి పేరు వస్తుండటంతో దాన్ని డైవర్ట్ చేసేందుకే ఏమీ లేని దాంట్లో ఏదో జరిగిపోయిందన్నట్లుగా డీఎస్సీపై గొడ్డలి పార్టీ బురద జల్లుతోంది. జగన్ హయాంలో ఏపీపీఎస్సీ గ్రూప్1 పరీక్షల్లో జరిగిన భారీ కుంభకోణాన్ని హైకోర్టు ఏర్పాటు చేసిన సిట్ ఇప్పటికే బయటపెట్టింది. దానికి వైసీపీ నేతలు సమాధానాలు చెప్పాలి. మేం యువతకు అండగా నిలిచాం. మీరు యువతను మోసం చేశారు. యువతకు ఉద్యోగాలు కల్పించే కంపెనీలను పక్క రాష్ట్రాలకు తరిమేసిన చరిత్ర జగన్ రెడ్డిది. అమర్‌రాజా కంపెనీ వేలాది మందికి ఉద్యోగాలు కల్పిస్తుంటే.. ఆ పరిశ్రమను తెలంగాణకు వెళ్లే పరిస్థితి తీసుకొచ్చారు. కరోనా సమయంలో ఉపాధ్యాయులను మద్యం షాపుల ముందు కాపలా పెట్టారు. నేడు మీరు ఉపాధ్యాయుల గురించి మాట్లాడితే.. దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉంది. యువతకు ఐదేళ్లలో ఏం చేశారో చెప్పే దమ్ము జగన్ రెడ్డికి ఉందాని ఎమ్మెల్యే శిరీష ప్రశ్నించారు.

# స్కాముల్లో పోటీ పెడితే జగన్ టీమ్‌కు ఫస్ట్ ప్రైజ్!

- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి ఎద్దేవా
- ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టు భర్తీ చేయని జగన్‌కు డీఎస్సీపై మాట్లాడే హక్కుందా?
- 16 వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చిన ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు వైసీపీకి లేదు
- జగన్ హయాంలో గ్రూప్-1 పరీక్ష పెద్ద కుంభకోణం
- అది మరిచి నేడు మెగా డీఎస్సీపై అనవసర రాద్ధాంతం

అమరావతి (చైతన్యరథం): ఉపాధ్యాయ వృత్తి గౌరవంపై వైసీపీ గొడ్డలి వేటు వేస్తోందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మండిపడ్డారు. మెగా డీఎస్సీపై అనవసర రాద్ధాంతం చేస్తున్న వైసీపీపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్రకార్యాలయంలో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మెగా డీఎస్సీ నిర్వహణ అనేది కూటమి ప్రభుత్వానికి, ప్రత్యేకంగా మంత్రి నారా లోకేష్‌కు ఒక ప్రతిష్టాత్మకమైన బ్రాండ్ అని సోమిరెడ్డి స్పష్టం చేశారు. ఎంతో పారదర్శకంగా 16 వేలకు పైగా ఉపాధ్యాయ అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించి వారి కుటుంబాల్లో వెలుగులు నింపాం. అందులో సుమారు 300 పోస్టులు స్పోర్ట్స్ కోటా కింద ఉన్నాయి. వేలాది మందికి ఉద్యోగాలు వచ్చాయనే విషయాన్ని పక్కనపెట్టి, కేవలం స్పోర్ట్స్ కోటా అంశాన్ని పట్టుకుని..వాస్తవానికి అందులో కూడా ఎలాంటి అక్రమాలు జరగకపోయినా వైసీపీ నానా యాగీ చేస్తోంది. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, శాప్ వైస్ చైర్మన్ సహా ఉన్నతాధికారులు రెండుసార్లు మీడియా ముందుకు వచ్చి ప్రతి ఆరోపణకు స్పష్టమైన ఆధారాలతో వివరణ ఇచ్చారు. అయినా మారకుండా వైసీపీ రాజకీయ బురదజల్లే యత్నం చేస్తోంది. రాబోయే డిసెంబరులో మరో డీఎస్సీ, వచ్చే సంవత్సరంలో ఇంకో డీఎస్సీ నిర్వహిస్తాం. ఉద్యోగాల భర్తీని నిరంతర ప్రక్రియగా చేపడుతుంటే జగన్ రెడ్డి బ్యాచ్ జీర్ణించుకోలేకపోతున్నారని సోమిరెడ్డి విమర్శించారు.



### కోర్టుల్లో మొట్టికాయలు

జగన్‌మోహన్ రెడ్డి బృందానికి క్రీడల్లో కాకుండా స్కాముల్లో పోటీలు పెడితే దేశంలోనే ఫస్ట్ ప్లేస్ వస్తుంది. తండ్రి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జరిగిన భారీ కుంభకోణం కేసులో కుమారుడు మొదటి ముద్దాయిగా ఉన్న చరిత్ర వీరిదే. 2019కి ముందు టీచర్ ఖాళీలపై పెద్ద ఎత్తున రాద్ధాంతం చేసిన జగన్, తన ఐదేళ్ల పాలనలో ఒక్క ఉపాధ్యాయ పోస్టును కూడా ఎందుకు భర్తీ చేయలేదో సమాధానం చెప్పాలి. ఐదేళ్లు ఉద్యోగాలు ఇవ్వకుండా, ఇప్పుడు కూటమి ప్రభుత్వం వేలాది కుటుంబాలకు ఆనందాన్ని ఇస్తుంటే వైసీపీ కడుపుమంటతో రగిలిపోతోంది. స్వయంగా కష్టపడి, వివాహమై పిల్లలు ఉన్నా కూడా ఎనిమిదేళ్ల శ్రమతో మెరిట్‌లో ఉద్యోగాలు సాధించిన మహిళలు ఈరోజు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాంటి వారి మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడటం అత్యంత బాధాకరం.

వైసీపీ పాలనలో జరిగిన గ్రూప్-1 పరీక్షల నిర్వహణను ప్రజలు ఇంకా మర్చిపోలేదు. ప్రైవేట్ రిసార్టుల్లో పేపర్ల మూల్యాంకనం చేయడం, ఓఎంఆర్ షీట్లలో వైట్నర్ వాడటం వంటి అక్రమాలతో గ్రూప్-1 వ్యవస్థనే భ్రష్టు పట్టించారు. తమ హయాంలో జరిగిన అక్రమాలకు జవాబు చెప్పకుండా, ఇప్పుడు పారదర్శకంగా జరిగిన మెగా డీఎస్సీపై నిందలు వేయడం విడ్డూరంగా ఉంది. స్పోర్ట్స్ కోటాపై వైసీపీ ఎమ్మెల్సీ కోర్టుకు వెళ్తే, బాధిత అభ్యర్థులు నేరుగా రాకుండా మీరెందుకు వచ్చారని న్యాయస్థానం లేవనెత్తిన ప్రశ్నలకు జగన్ రెడ్డి సమాధానం చెప్పాలని సోమిరెడ్డి నిలదీశారు.

### యువతకు బాసటగా కూటమి ప్రభుత్వం

నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అన్ని రకాలుగా గాడిలో పడుతోంది. డేటా సెంటర్లు, క్వాంటం వ్యాలీ వంటి ప్రాజెక్టులు వస్తున్నాయి. ఆగిపోయిన పోలవరం లెఫ్ట్ కెనాల్, వెలిగొండ ఫేజ్-1, నల్లమలసాగర్ వంటి ఇరిగేషన్ ప్రాజెక్టులు తిరిగి వేగవంతమయ్యాయి. పట్టిసీమను గతంలో 'ఒట్టిసీమ' అని ఎగతాళి చేసిన వారు, ఈరోజు దాని ద్వారా రైతులకు జరుగుతున్న మేలును చూసి తలదించుకుంటున్నారు. 45 ఏళ్ల నా రాజకీయ జీవితంలో సొంత పార్టీ నాయకులను, మంత్రులను కూడా కలవని జగన్ లాంటి పాలకుడిని చూడలేదు. రాష్ట్రం అభివృద్ధి చెందకపోయినా పర్వాలేదు, ప్రభుత్వం దెబ్బతినాలనే నెగిటివ్ ధోరణితో వైసీపీ పనిచేస్తోంది. కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు, చేతల ప్రభుత్వమని, డీఎస్సీని నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తూ యువతకు బాసటగా ఉంటామని ఎమ్మెల్యే సోమిరెడ్డి స్పష్టం చేశారు.

---

### సోషల్ మీడియాలో
## ప్రభుత్వ కార్యక్రమాలు

- ఎప్పటికప్పుడు ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టి తీరాలి
- చేసే మంచి పనులు ప్రజలకు చేరవేయాలి
- రాజ్యసభ సభ్యుడు చింతకాయల విజయ్



మంగళగిరి(చైతన్యరథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో లీడర్ షిప్ ట్రెనింగ్ కాంక్లేవ్‌లో రాజకీయ ప్రచారం, ప్రజా సంబంధాలు అంశంపై రాజ్యసభ సభ్యుడు చింతకాయల విజయ్ ప్రసంగించారు. తెలుగుదేశం పార్టీ నిర్వహించే డోర్ టు డోర్ వెళ్లినప్పుడు 360 డిగ్రీస్ కమాండ్ సెంటర్ ఏర్పాటు చేసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించేటప్పుడు మన కమ్యూనికేషన్ అనేది కట్ అవుతున్న ప్పుడు ప్రతి ఇంటికి సమాచారం చేరవేసే విధంగా ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్ అనేది ఉండాలి. ఇక్కడ మై టీడీపీ యాప్ అనేది చాలా ఉపయోగపడుతుంది. ఎందుకంటే మనకి ఏదో ఎన్నికలు వచ్చినప్పుడు కమాండ్ కంట్రోల్ అంటూ ఏర్పాటు చేసుకుని ఎన్నికలు అయిపోయిన వెంటనే దానిని తీసేస్తున్నాం. అలా కాకుండా మనం ఏర్పాటు చేసుకునే 360 డిగ్రీస్ కమాండ్ కంట్రోల్ అనేది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ఎంతో ఉప యోగకరంగా ఉంటుంది. ఈ రోజు రాష్ట్రంలో సోషల్ మీడియా అత్యధికంగా ఇన్‌స్టాగ్రామ్‌ను వినియోగిస్తున్నారు. ప్రభుత్వం చేస్తు న్న ప్రతి కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు ఇన్‌స్టాగ్రామ్‌లో కచ్చితంగా పెట్టి తీరాలి. ఇలా చేయటం ద్వారా ప్రభుత్వం చేస్తున్న మంచి నేరుగా ప్రజల చెంతకు చేరుతుందని వివరించారు.

---

### విజేతల కష్టాన్ని అవమానించేలా..
# డీఎస్సీపై గొడ్డలిపార్టీ దుష్ప్రచారం

- అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తే నిరాధార ఆరోపణలు
- 150 రోజుల్లోనే 16 వేల ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీ చరిత్రాత్మకం
- నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

అమరావతి (చైతన్యరథం): డీఎస్సీ గురించి గొడ్డలి పార్టీ నాయకులు మాట్లాడటం అత్యంత విడ్డూరంగా, హాస్యాస్పదంగా ఉందని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య విమర్శించారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి రాష్ట్ర ప్రజలకు డీఎస్సీ అంటే చంద్రబాబు నాయుడు, చంద్రబాబు నాయుడు అంటే డీఎస్సీ అనే విషయం బాగా తెలుసన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో గతంలో నిర్వహించిన డీఎస్సీల ద్వారా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో వేలాది మంది ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడి భద్రమైన జీవితాలు సాగిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ఫైలుపై సీఎం చంద్రబాబు తొలి సంతకం చేశారని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ఆచరణలో పెట్టి రికార్డు సమయంలో ఉద్యోగాల భర్తీ పూర్తి చేశారని తెలిపారు. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన దాదాపు 150 రోజుల్లోనే 16 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేయడం చరిత్రాత్మకమని తంగిరాల సౌమ్య అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో, మంత్రి నారా లోకేష్ సారథ్యంలో మొత్తం నియామక ప్రక్రియ అత్యంత పారదర్శకంగా సాగిందని స్పష్టం చేశారు. నోటిఫికేషన్ నుంచి నియామకాల వరకు అతి తక్కువ సమయంలో ప్రక్రియ పూర్తి చేసి ప్రభుత్వం కొత్త చరిత్ర సృష్టించిందని పేర్కొన్నారు.



### విజేతల కష్టాన్ని అవమానించేలా..

డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు స్వయంగా బయటకు వచ్చి తమ ఆనందాన్ని, కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేస్తున్నారని ఆమె తెలిపారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వందలాది మంది ఉపాధ్యాయులు ప్రభుత్వానికి మద్దతుగా స్పందించడం ఇందుకు నిదర్శనమన్నారు. ప్రజాప్రతినిధులుగా తాము అనేక కుటుంబాలను సందర్శించే సందర్భంలో డీఎస్సీ ఫలితాలతో వారి జీవితాల్లో వచ్చిన మార్పును ప్రత్యక్షంగా చూశామని చెప్పారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అక్కాచెల్లెళ్లు డీఎస్సీలో ఉద్యోగాలు సాధించి ప్రస్తుతం ఉపాధ్యాయులుగా సేవలందిస్తున్నారని సౌమ్య వివరించారు. గతంలో కనీసం వాలంటీర్ ఉద్యోగానికి కూడా అర్హులు కాదంటూ నిర్లక్ష్యానికి గురైన వారే, నేడు డీఎస్సీలో విజయం సాధించి ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడటం ఆనందకరమని అన్నారు. గతంలో వాలంటీర్‌గా పనిచేసిన ఓ యువతి కూడా డీఎస్సీలో ఉద్యోగం సాధించి తన జీవితాన్ని సరికొత్త దిశలో నడిపిస్తోందని పేర్కొన్నారు. డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన వారిలో అత్యధికులు పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారని తంగిరాల సౌమ్య అన్నారు. వారి కష్టాన్ని, విజయాన్ని అవమానించేలా వైసీపీ చేస్తున్న అసత్య ప్రచారాన్ని ప్రజలు తప్పకుండా తిప్పికొడతారని హెచ్చరించారు. వైసీపీ హయాంలో పరీక్షల నిర్వహణ, నియామకాల విషయంలో చోటుచేసుకున్న పరిణామాలను ప్రజలు మరచిపోలేదని ఆమె విమర్శించారు.

అయితే కూటమి ప్రభుత్వ హయాంలో డీఎస్సీ ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించామని స్పష్టం చేశారు. డీఎస్సీని ఇప్పుడు "దగా డీఎస్సీ" అంటూ విమర్శించడం ఉద్యోగాలు పొందిన వేలాది మంది యువతను అవమానించడమేనని సౌమ్య మండిపడ్డారు. ఈ అబద్ధ ప్రచారానికి ప్రజలే కాకుండా, రానున్న రోజుల్లో ఉద్యోగులు, నిరుద్యోగ యువత కూడా తగిన సమాధానం చెబుతారని అన్నారు. ఇప్పటికే ప్రజలు వైసీపీని 11 సీట్లకే కుదించారని, ఆ పార్టీ వైఖరి మార్చుకోకుండా ఇదే విధంగా వ్యవహరిస్తే భవిష్యత్తులో ఆ కొద్ది సీట్లు కూడా మిగలకుండా ప్రజలు బుద్ధి చెబుతారని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య స్పష్టం చేశారు.

## నాడు నిరుద్యోగులకు తీరని ద్రోహం..

# నేడు డీఎస్సీపై జగన్ దిగజారుడు రాజకీయం

- మెగా డీఎస్సీపై వైసీపీ దుష్ప్రచారం విజేతల కష్టాన్ని అవమానించడమే...
- ఒక్క డీఎస్సీ నిర్వహించని జగన్‌కి మాట్లాడే అర్హత లేదు
- ఐదేళ్ల పాలనలో చేసిందేమీ లేక విషం చిమ్ముతున్నారు
- హైకోర్టు మొట్టికాయలు వేసినా మారని జగన్, వైసీపీ తీరు
- విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

అమరావతి (చైతన్యరథం): మెగా డీఎస్సీపై బురద రాజకీయాలు, విషప్రచారాలు చేయడం డీఎస్సీ విజేతల కష్టాన్ని, వారి తెలివితేటలను అవమానించడమేనని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. మంగళగిరిలోని తెలుగుదేశంపార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ తన రాజకీయ ప్రచారం కోసం దిగజారుడు రాజకీయాలు చేస్తోందన్నారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మెగా డీఎస్సీపై విష ప్రచారం చేస్తోంది. వైసీపీ స్వార్థ రాజకీయాల కోసం 16,400మంది అభ్యర్థుల భవిష్యత్తుతో జగన్ నీచ రాజకీయాలు చేస్తున్నాడు. పచ్చకామెర్లు ఉన్నవాడికి లోకమంతా పచ్చగా కనిపిస్తున్నట్లు జగన్ పాలనలో ఏపీపీఎస్సీ గ్రూప్ 1లో అక్రమాలు చేసినట్లు కూటమి ప్రభుత్వంపైనా ఆ బురద జిమ్మాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ఏపీపీఎస్సీపై అర్హులకు ఉద్యోగాలు రాలేదని హై కోర్టుకు వెళితే ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు సహా పలువురు అధికారులు జైలుకు వెళ్లారు. చైర్మన్ గౌతం సవాంగ్ పై వేటు పడింది. హైకోర్టు నియమించిన సిట్ విచారణలో అత్యంత భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. జగన్ రెడ్డి జేబులు నింపడం కోసం ఆర్డీఓ పోస్టులను రూ.30లక్షల నుండి రూ.60లక్షల వరకు వసూళ్లు చేశారు. డీఎస్పీ పోస్టులను రూ.60లక్షల నుండి కోటి రూపాయలు వరకు అమ్ముకున్నారు. వీటి నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు జగన్ బ్యాచ్ రకరకాల వేషాలు వస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు మెగా డీఎస్సీపై తొలిసంతకం చేసి నిరుద్యోగుల భవిష్యత్తుకు భరోసా కల్పిస్తే.. అభూత కల్పనలతో జగన్, ఆయన ముఠా విష ప్రచారం చేస్తోందని ఎమ్మెల్యే బొండా మండిపడ్డారు.

### ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించని జగన్

2019 ఎన్నికల సమయంలో ప్రతియేటా జాబ్ క్యాలెండర్ ఇస్తానని, మెగా డీఎస్సీ నిర్వహిస్తానని ఇచ్చిన హామీని జగన్ రెడ్డి తుంగలో తొక్కారు. ఒక్క జాబ్ క్యాలెండర్ ఇవ్వలేదు. ఒక్క డీఎస్సీ నిర్వహించలేదు. జగన్ పాలనలో నిర్వహించిన ఒక్క ఏపీపీఎస్సీ గ్రూప్ 1 పరీక్షతో అనేకమంది అధికారులు జైలుపాలు అయ్యారు. మెగా డీఎస్సీ అత్యంత పారదర్శకంగా నిర్వహించామని, దానిపై బహిరంగ చర్చకు సిద్ధం అని మా నాయకుడు నారా లోకేష్ సవాల్ విసిరితే గొడ్డలిపార్టీ నుంచి నేటికీ స్పందన లేదు. వైసీపీ సోషల్ మీడియా, మీడియా, పత్రికల్లో అసత్య కథనాలు, వార్తలతో ప్రజలను ప్రక్కదారి పట్టించాలని చూడడం దుర్మార్గం. వి.చక్రపాణిరెడ్డి అనే మాజీ సైనికుడు కష్టపడి ఉద్యోగం తెచ్చుకుంటే సాక్షి ఛానల్ రిపోర్టర్ వెళ్లి దౌర్జన్యం చేసి, అతని మీద నిందలు వేసి ఇబ్బందులు పెట్టాడు. ఆయన మెగా డీఎస్సీలో కష్టపడి ఉద్యోగం తెచ్చుకుంటే బ్లూ మీడియా నిరంతరం అసత్య ప్రచారాలు చేస్తూ మానసికంగా దెబ్బతీస్తున్నారని ఎమ్మెల్యే బొండా దుయ్యబట్టారు.

### బహిరంగ చర్చకు మీరు వస్తారా జగన్?

కష్టపడి డీఎస్సీలో ఉద్యోగం తెచ్చుకున్నవారిపై వైసీపీ వాళ్లు చేస్తున్న అసత్య ప్రచారాల డేటా మా దగ్గర ఉంది. ప్రతి అభ్యర్థి ఇంటికి మేము మీడియా సాక్షిగా వస్తాం. దమ్ముంటే జగన్మోహన్ రెడ్డి, వైసీపీ వాళ్లు ఈ సవాల్‌ను స్వీకరించాలి. తప్పుడు ఫోటోలు, పేర్లతో ప్రచారం చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి ఉపాధ్యాయులను బ్రాందీ షాపుల వద్ద కాపలా పెట్టాడు. వారికి సకాలంలో జీతాలు ఇవ్వలేదు. బాత్రూమ్ ఫోటోలు తీయించాడు. యాప్‌ల పేరుతో వేధించాడు. పదో తరగతి పేపర్లు దొంగతనం చేసిన స్థాయి జగన్మోహన్ రెడ్డిది.....స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీలో చదువుకున్న స్థాయి మా నాయకుడు నారా లోకేష్‌ది. బ్రిడ్జ్ గేమ్ అంటే పేకాట అని హీనంగా మాట్లాడే హీనమైన చరిత్ర జగన్మోహన్ రెడ్డిది. మెగాడీఎస్సీలో బ్రిడ్జ్ ఆటకు సంబంధించి ఒక్కరికి అయినా మేం పోస్టింగులు ఇచ్చినట్లు నిరూపించగలరా? కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన గైడ్ లైన్స్ ప్రకారం బ్రిడ్జ్ ఆటను స్పోర్ట్స్ కోటాలో పెడితే....దానిని కూడా దుష్ప్రచారాలకు వాడుకుంటున్నారు. ఎర్రిపల్లి శ్రావణ్ కుమార్ 51వ ర్యాంకుతో స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం తెచ్చుకున్నాడు. అదేవిధంగా సముదం పృథ్వీరాజ్ 157వ ర్యాంకు. ఏరిగినబోయిన శ్రీనివాసులు 86వ ర్యాంకు. టి విజయలక్ష్మీ 644వ ర్యాంకు. ఇలాంటివాళ్లు చాలామంది కష్టపడి ఉద్యోగం తెచ్చుకున్నారు. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు తెచ్చుకున్నవారికి సర్టిఫికెట్లు శాప్ లేదా ఏపీ ప్రభుత్వం ఇవ్వలేదు. ప్రతి క్రీడకు సంబంధించిన అసోసియేషన్లు ఉన్నాయి. వాటిద్వారా వారి ప్రతిభను చాటి సర్టిఫికెట్లు తెచ్చుకుంటే...వాటిని కూడా వైసీపీ నీచంగా అవమానించడం దుర్మార్గమని ఎమ్మెల్యే బొండా ధ్వజమెత్తారు.



### ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడాతెలియని దద్దమ్మ జగన్

ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడాతెలియని జగన్మోహన్ రెడ్డికి డీఎస్సీ అభ్యర్థుల కష్టాలు ఎలా తెలుస్తాయి? ప్రజలకు అబద్దాలు చెప్పి మోసాలు చేయాలని చూసిన జగన్మోహన్ రెడ్డి వైనాట్ 175 అని బీరాలు పలికి 151 నుండి 11కు వచ్చాడు. రానున్న ఎన్నికల్లో జగన్ పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవాలి. అత్యంత పారదర్శకంగా మెగా డీఎస్సీని సాంకేతికత ఆధారంగా నిర్వహిస్తే....దానిని కూడా జగన్ తప్పుపట్టడం దుర్మార్గం. ఎన్.సీ.ఈ.ఆర్.టి. నిపుణుల ప్రత్యేక భద్రత గదిలో 42వేల ప్రశ్నలను తయారుచేసి, సిస్టమ్ లకు పాస్ వర్డ్‌లను ప్రతిరోజు మారుస్తూ కట్టుదిట్టంగా మెగా డీఎస్సీ నిర్వహిస్తే వైసీపీ నేతలు మాత్రం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో ప్రశ్నలు తయారుచేయించాం అని నీచంగా మాట్లాడుతున్నారు. అసెంబ్లీలో మెగాడీఎస్సీ విధానంపై లోకేష్ వివరంగా సభకు వివరించారు. ఇంత పారదర్శకంగా మేము వివరిస్తుంటే వైసీపీ ఉద్దేశపూర్వకంగా విషప్రచారం చేస్తోంది.

### 14 డీఎస్సీలు నిర్వహించిన చరిత్ర చంద్రబాబుది

14 డీఎస్సీల ద్వారా 1.96లక్షల మందికి టీచర్ ఉద్యోగాలు ఇచ్చిన ఘన చరిత్ర చంద్రబాబుది. ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించిన దుర్మార్గుడు జగన్మోహన్ రెడ్డి. డీఎస్సీ విషయంలో జగన్మోహన్ రెడ్డికి చెప్పుకునేందుకు ఏమీ లేక మెగా డీఎస్సీపై విషప్రచారం చేస్తున్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం చాలా నష్టపోయింది.... జగన్‌ను ఈ రాష్ట్రం మరోసారి నమ్మే పరిస్థితి లేదు. మెగా డీఎస్సీపై వైసీపీ వేసిన అడ్డగోలు కేసుల విషయంలో ఏపీ హైకోర్టు కూడా మొట్టికాయలు వేసినా జగన్మోహన్‌రెడ్డికి కనీసం సిగ్గులేదు. ప్రజాకోర్టులో, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ విష ప్రచారాల ఫలితాలను వైసీపీ అనుభవించబోతుంది. డీఎస్సీ అభ్యర్థుల కష్టాన్ని అవహేళన చేయడం మానుకోవాలి. రానున్న కాలంలో వాళ్లే తగిన బుద్ధి చెబుతారు అని బొండా ఉమామహేశ్వరరావు హెచ్చరించారు.

# డీఎస్సీపై వైసీపీది 100 శాతం దుష్ప్రచారమే

- యువత సహనాన్ని పరీక్షిస్తున్నారు
- గొడ్డలి పార్టీకి ప్రజలే బుద్ధి చెబుతారు
- పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్

అమరావతి (చైతన్యరథం): మెగా డీఎస్సీపై వైసీపీది పూర్తిగా దుష్ప్రచారమేనని పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ విమర్శించారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గొడ్డలి పార్టీ అధ్యక్షుడు జగన్ రెడ్డికి పార్టీ ఆవిర్భావం నుంచే అసలు అంశాల నుంచి ప్రజల దృష్టి మళ్లించే డైవర్షన్ పాలిటిక్స్ చేయడమే అలవాటు మారిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వెలిగొండ ప్రాజెక్టుతో పాటు, పోలవరం ఎడమ కాలువకు నీటిని విడుదల చేయడంతో రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో తమ ఓటు బ్యాంకుకు నష్టం జరుగుతుందనే భయం వైసీపీని వెంటాడుతోందన్నారు. అందుకే ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై నిరంతరం దుష్ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అత్యంత పారదర్శకంగా నిర్వహించిన మెగా డీఎస్సీ ద్వారా



ఉద్యోగాలు పొందిన మూడు ప్రాంతాలకు చెందిన యువత ఇప్పటికే రోడ్లపైకి వచ్చి తమ ఆవేదనను వ్యక్తం చేస్తూ వైసీపీని హెచ్చరించినప్పటికీ, ప్రతిరోజూ ఏదో ఒక రూపంలో బురదజల్లే కార్యక్రమాన్ని కొనసాగించడం దురదృష్టకరమని బోడే ప్రసాద్ అన్నారు. 2018–19 డీఎస్సీలో ఒకటి లేదా రెండు మార్కుల తేడాతో ఉద్యోగాన్ని కోల్పోయి, జగన్ హయాంలో డీఎస్సీకి నోచుకోక, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నిర్వహించిన డీఎస్సీలో మెరిట్ ఆధారంగా ఉద్యోగాలు సాధించామని, తమ సహనాన్ని పరీక్షించవద్దని యువత హెచ్చరిస్తున్నారనారని ఎమ్మెల్యే బోడే అన్నారు.

### సొంత పత్రికలో అబద్ధాల వల్లెవేత

ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి మధ్య తేడా తెలియని జగన్ రెడ్డి, ఆయన హయాంలో పరీక్షల నిర్వహణలో అనేక అక్రమాలకు పాల్పడి యువత జీవితాలతో ఆడుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా డీఎస్సీని నిర్వహించి వేలాది మంది యువత జీవితాల్లో వెలుగులు నింపిందని పేర్కొన్నారు. పెనమలూరు నియోజకవర్గంలో డీఎస్సీలో ఎంపికైన ఇద్దరు అక్కాచెల్లెళ్లను స్వయంగా కలిసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వారికి సొంత ఇల్లు కూడా లేక అద్దె ఇళ్లలో జీవిస్తున్నారని, వారి పరిస్థితిని చూసి తాను ఎంతో చలించిపోయానన్నారు. 2019లో కేవలం ఒక్క మార్కు తేడాతో ఉద్యోగాన్ని కోల్పోయిన వారు మళ్లీ కష్టపడి చదివి, ఆరేళ్ల తరువాత నిర్వహించిన డీఎస్సీలో మెరిట్ ఆధారంగా ఉద్యోగాలు సాధించారని చెప్పారు. అలాంటి అభ్యర్థుల మెరిట్‌ను కూడా ప్రశ్నిస్తూ, వారు అక్రమంగా ఎంపికైనట్లుగా ప్రచారం చేయడం అత్యంత బాధాకరమని బోడే ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన యువత ఎన్నో ఏళ్ల కష్టానికి ప్రతిఫలంగా ఉద్యోగాలు సాధిస్తే, వారి విజయాలను అవమానించేలా గొడ్డలి పార్టీ వ్యవహరిస్తోందని విమర్శించారు. సొంత పత్రిక సాక్షిని అడ్డుపెట్టుకుని ప్రతిరోజూ అబద్ధపు ప్రచారాన్ని కొనసాగించడం వైసీపీకి అలవాటుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో వైఎస్ వివేకానందరెడ్డి హత్య ఘటన విషయంలో కూడా తప్పుడు ప్రచారం చేశారని, ఇప్పుడు అదే తరహాలో డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన యువతను లక్ష్యంగా చేసుకుని అవమానించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన వేలాది మంది యువత సహనాన్ని పరీక్షించవద్దని హెచ్చరించారు. యువత తిరగబడితే దాని ప్రభావం ఎలా ఉంటుందో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీకి తెలుస్తుందన్నారు. డీఎస్సీపై వైసీపీ చేస్తున్నది నూటికి నూరు శాతం దుష్ప్రచారమేనని ప్రజల్లోకి వెళ్లి వివరిస్తామని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ స్పష్టం చేశారు. ప్రభుత్వం పారదర్శకంగా నిర్వహించిన నియామక ప్రక్రియపై అసత్య ప్రచారం చేస్తున్న వారికి ప్రజలే తగిన సమాధానం చెబుతారన్నారు.

# డీఎస్సీపై కాలకేయుల్లా తయారైన జగన్ బ్యాచ్

- ఉపాధ్యాయులను అవమానించేలా గొడ్డలి పార్టీ కుట్రలు
- మంత్రి లోకేష్‌పై బురద జల్లడమే పనిగా నిత్యం అభాండాలు
- అధికారులు వివరణ ఇచ్చినా, డీఎస్సీ స్పోర్ట్స్ కోటాపై అదే దుష్ప్రచారం
- గతంలో డీఎస్సీ వేస్తానంటూ మాట తప్పి, పోస్టులే లేవన్నది జగన్ కాదా?
- వైసీపీ హయాంలో గ్రామ సచివాలయాల్లో క్రీడా ధ్రువపత్రాలు లేకుండానే అక్రమంగా ఉద్యోగాలు
- తన సీబీఐ కేసుల గురించి మాట్లాడని అవినాష్ రెడ్డి, డీఎస్సీపై మాట్లాడటం విడ్డూరం
- శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు ధ్వజం



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో 16 వేల మందికిపైగా నిరుద్యోగులు కష్టపడి చదివి, పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులుగా ఎంపికైతే, వారి జీవితాలతో జగన్ మోహన్ రెడ్డి, అతడి బ్యాచ్ కాలకేయుల్లా ఆడుకుంటున్నారని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ (శాప్) ఛైర్మన్ అనిమిని రవినాయుడు తీవ్రంగా మండిపడ్డారు. విద్యార్థులకు ఆదర్శంగా నిలవాల్సిన ఉపాధ్యాయులపై రోజూ ఏదో ఒక తప్పుడు అభియోగం మోపి డీఎస్సీ ప్రక్రియపై బురద జల్లడమే పనిగా పెట్టుకున్నారని ఆయన ధ్వజమెత్తారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2019 ఎన్నికలకు ముందు డీఎస్సీతో వేలాది టీచర్ పోస్టులు భర్తీ చేస్తానని నిరుద్యోగులకు హామీ ఇచ్చిన జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత మాటతప్పి అసెంబ్లీ సాక్షిగా పోస్టుల్లేవని చెప్పి వారి గొంతు కోశారు. యువనేత నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీఎంగా బాధ్యతలు చేపట్టగానే మొదటి సంతకం మెగా డీఎస్సీ ఫైల్ పైనే చేశారు. విద్య శాఖ మంత్రిగా నారా లోకేష్ ఇచ్చిన మాట కోసం రేయింబవళ్లు శ్రమించారు. మెగా డీఎస్సీని ఆపేందుకు, నోటిఫికేషన్ రద్దు చేయించేందుకు వైసీపీ ముఠా ఎన్ని కోట్లు కుమ్మరించి కోర్టుల్లో వరుస కేసులు వేయించిందో ప్రజలంతా చూశారు. ఆ న్యాయపరమైన అడ్డంకులన్నింటినీ ఛేదించి, రాత్రింబవళ్లు పనిచేసి 16వేల మందికి పైగా ఉపాధ్యాయులకు లోకేష్ నియామక పత్రాలు అందించారు. ఈ ప్రక్రియ ముగిసి ఏడాది దాటింది. తాము ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వలేకపోయామన్న అక్కసుతో, లోకేష్‌కి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకనే ఏడాది పాటు ఆలోచించి ఇప్పుడు కొత్తగా డీఎస్సీపై అభాండాలు వేస్తున్నారని రవినాయుడు విమర్శించారు. పారదర్శకంగా ఉద్యోగాలు సాధించిన యువత జీవితాలతో ఆటలాడితే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

### డీఎస్సీ స్పోర్ట్స్ కోటాపై వైసీపీ తప్పుడు ప్రచారాలు

మెగా డీఎస్సీ ముగిసిన ఏడాది తర్వాత వైసీపీ నేతలు కొత్త డ్రామాలకు తెరలేపారు. మొదట పేపర్ లీక్ అంటూ లేనిపోని కథలు అల్లారు, నవీన్ పేరును తెరపైకి తెచ్చి భంగపడ్డారు. ఇప్పుడు స్పోర్ట్స్ కోటాపై నిత్యం అబద్దాలు ప్రచారం చేస్తున్నారు. సర్టిఫికెట్లు లేవని ఒకసారి, ఫేక్ సర్టిఫికెట్లని మరోసారి పొంతన లేని ఆరోపణలు చేస్తున్నారు. స్పోర్ట్స్ సర్టిఫికెట్లు శాప్ జారీ చేయదు. సంబంధిత స్పోర్ట్స్ అసోసియేషన్లు, ఫెడరేషన్లు, ఒలింపిక్ అసోసియేషన్, యూనివర్సిటీలు మాత్రమే వాటిని ఇస్తాయి. వాటి ప్రామాణికతను (జెన్యూనిటీ) కూడా ఆయా సంస్థలే నిర్ధారిస్తాయి. శాప్ కేవలం నిబంధనల ప్రకారం ఆ సర్టిఫికెట్ల వివరాలను పరిశీలిస్తుందన్న ప్రాథమిక అవగాహన కూడా లేకుండా మాట్లాడుతున్నారు. ఆసియా క్రీడల్లో గుర్తింపు పొందిన మైండ్ గేమ్ 'బ్రిడ్జ్' గురించి కనీస జ్ఞానం లేక మాజీ మంత్రి పేర్ని నాని 'పేకాట ఆడేవాళ్లకు ఉద్యోగాలిచ్చారు' అని దిగజారి మాట్లాడారు. ఎవరికి ఇచ్చారో నిరూపించమని సవాల్ విసిరితే తోకముడిచి, 'మాకు ముందే చెప్పాలి కదా' అంటూ నిస్సిగ్గుగా యూటర్న్ తీసుకున్నారు. అన్ని ఆరోపణలూ అసత్యాలని తేలిపోయాక చివరికి కులాన్ని తెరపైకి తెచ్చి, ఒక వర్గానికే ఉద్యోగాలు ఇచ్చారని విషం చిమ్మే ప్రయత్నం చేశారు. స్పోర్ట్స్ కోటా కింద కమ్మ సామాజిక వర్గానికి వచ్చింది కేవలం 9 పోస్టులేనని, మిగిలినవన్నీ బీసీ, ఎస్సీ, ఇతర వర్గాలకే దక్కాయని అధికారిక లెక్కలతో సహా వివరణ ఇచ్చినా ఇంకా అభాండాలు వేయడం సిగ్గుచేటు. హైయెస్ట్ అచీవ్‌మెంట్ మెడల్ ఆధారంగానే ఎంపికలు జరిగాయి. టీచింగ్ పోస్టులకు టెట్ తప్పనిసరి అని, పీఈటీ/పీడీలకు నిబంధనల ప్రకారం మినహాయింపు ఉందని నోటిఫికేషన్ లోనే స్పష్టంగా పేర్కొన్నాం. 1:5 నిష్పత్తిలో అభ్యర్థుల జాబితాను ఉంచి, ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేసే పూర్తి అవకాశం కల్పించాం. ఆనాడు ఎవరూ ఫిర్యాదు చేయకుండా, ఏడాది తర్వాత రాజకీయ ఉనికి కోసం ఉపాధ్యాయుల జీవితాలతో ఆడుకోవడం దుర్మార్గమని రవినాయుడు దుయ్యబట్టారు.

### నాడు సర్టిఫికెట్లే లేకుండా సచివాలయాల్లో ఉద్యోగాలు

గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలను కప్పిపుచ్చుకునేందుకు వైసీపీ ముఠాలు కూటమి ప్రభుత్వంపై అర్థరహితమైన, నిరాధార ఆరోపణలు చేస్తున్నాయని రవినాయుడు తీవ్రంగా ఖండించారు. కర్నూలులో ఎవరో ఒక వ్యక్తి టెట్ అర్హత సాధించకపోతే, దానికి మంత్రి లోకేష్‌కి, తమకు ముడిపెట్టి బురదజల్లే ప్రయత్నం చేయడం సిగ్గుచేటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో గ్రామ సచివాలయాల్లో స్పోర్ట్స్ కోటా కింద ఎవరెవరికి ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలని ఏడాది క్రితమే శాప్ సెక్రటరీకి లేఖ రాశాం. దానికి అధికారుల నుంచి వచ్చిన సమాధానం ఏమిటంటే అసలు వాళ్ల దగ్గర అభ్యర్థుల సర్టిఫికెట్లే లేవని, అందుకే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయలేకపోతున్నామని లిఖితపూర్వకంగా ఒప్పుకున్నారు. దీనిపై విచారణ కోరితే కలెక్టర్లకు లేఖలు రాసి, ఇప్పుడు సర్టిఫికెట్ల కోసం వెతుక్కుంటున్నారు. ధ్రువపత్రాలు కూడా లేకుండా అడ్డగోలుగా ఉద్యోగాలు కట్టబెట్టిన ఘనత గత పాలకులదే. కూటమి ప్రభుత్వంలో ఉద్యోగ నియామక ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరుగుతోంది. నిజంగా ఏదైనా తప్పు చేయాలనే ఆలోచన ఉంటే ప్రతి అభ్యర్థి సర్టిఫికెట్‌ను పబ్లిక్ డొమైన్‌లో, ఆన్‌లైన్‌లో ఎందుకు పెడతాం? అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు ప్రజల ముందుంచాం. నిరుద్యోగులు వాస్తవాలను గమనించాలి. స్పోర్ట్స్ కోటా 3 శాతం రిజర్వేషన్ కింద 420కి పైగా పోస్టులు వస్తే, అందులో పూర్తి అర్హతలు ఉన్న 372 మందిని మాత్రమే ఎంపిక చేశాం. ఒకవేళ గత పాలకుల్లా ఎవరికి పడితే వాళ్లకు ఉద్యోగాలు ఇవ్వాలనుకుంటే మిగిలిన పోస్టులనూ భర్తీ చేసేవాళ్లం కదా? అర్హత ఉన్నవారికే న్యాయం జరగాలనే ఉద్దేశంతోనే కచ్చితమైన నిబంధనలు పాటించాం. అందుకే మిగిలిన పోస్టులు పెండింగ్‌లో ఉన్నాయి. గత ప్రభుత్వంలో వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేశారు. ఏపీపీఎస్సీ పరీక్ష పత్రాలను హాయ్‌లాండ్ రిసార్ట్‌కు తరలించి, అక్కడ ప్యూన్లు, ఎలక్ట్రీషియన్లతో మూల్యాంకనం చేయించి, తమకు కావాల్సిన వాళ్లకు ఉద్యోగాలు ఇచ్చుకున్న చరిత్ర వైసీపీది. అది ముమ్మాటికీ అవినీతితో కూడిన నేరపూరిత కుంభకోణం. ప్రస్తుత ప్రభుత్వంలో నిబంధనల ప్రకారం జెన్యూనిటీ ఫారాలు కలిగి ఉండి, పూర్తి అర్హతలు సాధించిన మెరిట్ అభ్యర్థులకు మాత్రమే ఉద్యోగాలు లభించాయి. ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదని రవినాయుడు స్పష్టం చేశారు.

### డీఎస్సీపై అవినాష్ రెడ్డి మాట్లాడటం విడ్డూరం

వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ తనను అరెస్ట్ చేసేందుకు వస్తే తరిమికొట్టించి, అధికారులపైనే అక్రమ కేసులు పెట్టించిన కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి... నేడు డీఎస్సీపై సీబీఐ విచారణ కోరడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. స్వయంగా సీబీఐ అధికారుల మీదే దాడులు చేయించి, రాష్ట్రంలోకి రానివ్వకుండా గెస్ట్ హౌస్‌లకు తాళాలు వేయించిన చరిత్ర అవినాష్ రెడ్డిది. 2010-11 నుంచి జగన్ మోహన్ రెడ్డిపై ఉన్న సీబీఐ కేసుల విచారణ ఏ మాత్రం ముందుకు సాగని విషయాన్ని విస్మరించి.. ఇప్పుడు డీఎస్సీపై సీబీఐ విచారణ అంటూ మాట్లాడటం హాస్యాస్పదమని రవినాయుడు అన్నారు.

### లోకేష్ లక్ష్యంగా కుట్రలు

ఐదేళ్ల వైఎస్సార్సీపీ పాలనలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేని చేతకాని వాళ్లు నేడు మాట్లాడుతున్నారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ నిరుద్యోగుల సంక్షేమం కోసం రేయింబవళ్లు శ్రమించారు. గత పాలకులు కోర్టు కేసులు వేసి అడ్డుకున్నా, వాటన్నింటినీ అధిగమించి కేవలం 148 రోజుల్లోనే నియామక ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేసి చూపించారు. లోకేష్ చారిత్రక 'యువగళం' పాదయాత్రతో ప్రజలు వైఎస్సార్సీపీని ఇంటికి పంపారన్న కసితోనే, ఇప్పుడు ప్రతి దానికి యువగళం పేరును ముడిపెడుతూ చిల్లర ఆరోపణలు చేస్తున్నారు. ఏళ్ల తరబడి కుటుంబాలకు దూరంగా ఉండి, కోచింగులు తీసుకుని కష్టపడి మెరిట్ ద్వారా ఉద్యోగాలు సాధించిన కొత్త ఉపాధ్యాయులపై వైఎస్సార్సీపీ మూకలు కక్షగట్టాయి. బడులలో పాఠాలు చెబుతున్న వారి వద్దకు వెళ్లి మైకులు నోట్లో పెట్టి బెదిరించడం, ఫేక్ టీచర్లుగా చిత్రీకరిస్తామని భయభ్రాంతులకు గురిచేయడం దుర్మార్గం. ఉపాధ్యాయులకు కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ కొండంత అండగా ఉన్నారు. ఎవరైనా పాఠశాలల్లోకి వచ్చి బెదిరిస్తే బెత్తం పట్టి గుణపాఠం చెప్పండి, ప్రభుత్వం మీ వెంటే ఉంటుంది. డీఎస్సీ నియామకాలపై విద్యాశాఖ, శాప్ ఉన్నతాధికారులు పూర్తి ఆధారాలతో వాస్తవాలు వెల్లడిస్తే, వారిపై కూడా వైఎస్సార్సీపీ నేతలు బెదిరింపులకు దిగడం సిగ్గుచేటు. నిజాయితీగా విధులు నిర్వర్తించే ఏ ఒక్క అధికారినీ ఈ ప్రభుత్వం వదులుకోదు, కంటికి రెప్పలా కాపాడుకుంటుంది. వైఎస్సార్సీపీ నేతల ఉడత ఊపులకు, బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదు. కూటమి పాలనలో ప్రతి ఏటా డీఎస్సీని నిర్వహించి నిరుద్యోగులకు బాసటగా నిలుస్తామని రవినాయుడు భరోసా ఇచ్చారు.

## జగన్ బ్యాచ్‌ను బంగాళాఖాతంలో కలుపుతారు

ఉద్యోగాల భర్తీలో నిబంధనల ప్రకారం గ్రీవెన్స్ నిర్వహించి అభ్యంతరాలు స్వీకరించినప్పుడు నోరు మెదపని వైఎస్సార్సీపీ నేతలు, ఇప్పుడు ఫేక్ ఛానళ్లు, రీల్స్ పెట్టుకుని 16,000 మంది పైగా టీచర్ల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నారని రవినాయుడు మండిపడ్డారు. ఒక క్రీడాకారుడిపై మరొకరు ఫిర్యాదు చేసుకునేలా అత్యంత పారదర్శకంగా రెండు పర్యాయాలు గ్రీవెన్స్ నిర్వహించాం. విద్యా భవన్‌లో అధికారికంగా అభ్యంతరాలు స్వీకరిస్తూ అధికారులు ఎప్పటికప్పుడు స్పష్టతనిచ్చారు. అప్పుడు ఆధారాలు చూపించని వీరు, ఇప్పుడు టీచర్ పోస్టులను రద్దు చేయించే కుట్రతో సీబీఐ విచారణల పేరిట చిల్లర రాజకీయాలు చేస్తున్నారు. 2021లో అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్న వైవీ సుబ్బారెడ్డి, ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ఉన్న మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్, ఇతర క్రీడా సంఘాల అధ్యక్షులుగా ఉన్న దొరబాబు, ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి వంటి వైఎస్సార్సీపీ ప్రజాప్రతినిధులే ఆ సర్టిఫికెట్లు జారీ చేశారు. మీ నేతలే సర్టిఫికెట్లు ఇచ్చి, నేడు కూటమి ప్రభుత్వంపై నిందలు వేయడం సిగ్గుచేటు. దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసురుతున్నాం. మేము అందరినీ అనడం లేదు, ఒకరో ఇద్దరో ఉంటారని వైఎస్సార్సీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి సరిపెట్టుకునే ప్రయత్నం చేశారు. నిజంగా ఆ ఒకరిద్దరి వద్ద తప్పుడు ధ్రువపత్రాలు ఉంటే ఆధారాలతో తీసుకురండి, విచారించి చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అది చేతకాక స్కామ్, లీకులు అంటూ అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. అసలైన స్కామ్ అంటే ఏపీపీఎస్సీ పేపర్ల మూల్యాంకనం, గ్రామ సచివాలయాల్లో స్పోర్ట్స్ సర్టిఫికెట్లు కూడా లేకుండా ఉద్యోగాలు ఇవ్వడం. నేడు ప్రతి అభ్యర్థి సర్టిఫికెట్‌ను ఆన్‌లైన్‌లో పబ్లిక్ డొమైన్‌లో పెట్టిన దమ్ము, నిజాయితీ కూటమి ప్రభుత్వానిది. డీఎస్సీ నియామకాలను అడ్డుకునేలా మాట్లాడితే కొత్తగా నియమితులైన 16,000 మంది ఉపాధ్యాయులు, భవిష్యత్తులో ఉద్యోగాలు సాధించే యువత అంతా కలిసి జగన్ మోహన్ రెడ్డి అండ్ బ్యాచ్‌ను బంగాళాఖాతంలో కలపడం ఖాయం. యువతను బలిపశువులను చేసి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూసే వైఎస్సార్సీపీ నరరూప రాక్షసుల మాటలను నిరుద్యోగులు నమ్మవద్దు. అమరావతి నిర్మాణం, పోలవరం పూర్తి చేయడంతో పాటు యువతకు 20 లక్షల ఉద్యోగాలను కల్పించే బృహత్తర బాధ్యతను సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం బాధ్యతగా నెరవేరుస్తుందని రవినాయుడు స్పష్టం చేశారు.

చైతన్యరథం

## ఎమ్మెల్యేలు ప్రజలతో ఇంటరాక్ట్ కావాలి

- సెల్‌ఫోన్లకు ఆడియో సందేశాలు పంపాలి
- పాతకాలం దర్పం ప్రదర్శిస్తే కుదరదు
- ఫోన్ కాల్స్‌కు వెంటనే స్పందించాలి
- లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



మంగళగిరి(చైతన్యరథం): ఎమ్మెల్యేలు ప్రజలతో ఇంటరాక్ట్ కావాలని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సూచించారు. లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో నియోజకవర్గ అభివృద్ధి ప్రజలకు చేరడం-నాయకుడి ఎదుగుదల అంశంపై కీలక ప్రసంగం చేశారు. నెలకు ఒకసారి ఎమ్మెల్యేల సొంత గొంతుతో నియోజకవర్గ ప్రజల సెల్‌ఫోన్లకు ఆడియో సందేశాలు పంపాలి. 30 సెకన్ల వాయిస్ మెసేజ్‌తో ఐదేళ్లలో 60 సార్లు ప్రజలను నేరుగా పలకరించే అద్భుత అవకాశం. నియోజకవర్గంలో లక్ష మందికి ప్రభుత్వం, పార్టీ కార్యక్రమాలు చేరేలా సోషల్ మీడియాలో పెయిడ్ ప్రమోషన్లు చేయాలి. పాతకాలం నాటి దర్పం ప్రదర్శిస్తే కుదరదు.. గెలిపిం చిన ప్రజల మధ్యే వినయంగా తిరగాలి. ఫోన్ కాల్స్‌కు వెంటనే స్పందించాలి.. మిస్డ్ కాల్స్ వచ్చినా వెనక్కి చేసి పలకరిస్తే ప్రజలు సంతోషిస్తారు. వాట్సాప్, ఎస్ఎంఎస్ సందేశాలపై తక్షణమే స్పం దించి ఆఫీస్ ద్వారా ధన్యవాదాలు తెలపాలి. ప్రజా సమస్యలపై సాధ్యమైతే పనులు చేయాలి.. కుదరకపోతే వల్ల కాదని ముందే స్పష్టంగా చెప్పేయాలి. నెల్లూరుకు చెందిన ఓ ప్రభుత్వ పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థి తనకు ఫోన్ చేసి తమ ప్రాంతంలో పార్క్ లేదని కోరాడు. అది చెరువు స్థలమైనప్పటికీ గత 20 ఏళ్లుగా అక్కడ రోడ్లు, కాలువలు, గుళ్లు, మసీదులు, ఇళ్లు నిర్మించారు. అలాంటప్పుడు పిల్లలకు పార్క్ ఎందుకు నిర్మించకూడదన్న ఆలో చన వచ్చింది. దీనిపై అధికారులతో చర్చించి సోషల్ మీడియా ద్వారా ప్రజల్లో చర్చకు పెట్టి త్వరలోనే అక్కడ ఒక చిన్న పార్కును నిర్మించబోతున్నాం. రాబోయే మూడేళ్ల కాలంలో ప్రతి ఎమ్మెల్యే కనీసం 30 సార్లు నేరుగా ప్రజలతో మాట్లాడే కార్యాచరణ చేపట్టా లి. ప్రభుత్వం తరఫున వేరే వ్యక్తుల వాయిస్‌లతో ఆడియోలు వెళ్లే బదులు కీలక సందర్భాలలో ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత గొంతుతోనే ప్రజలకు ఆడియో సందేశాలు వెళ్లేలా చూస్తే ప్రజల్లో కి మరింత బలంగా వెళుతుందని సూచించారు.

## సోషల్ మీడియాను ఉపయోగించుకుందాం

- ప్రతి క్లస్టర్, బూత్ ఇన్‌చార్జి పనిచేసేలా చర్యలు
- రాష్ట్రవ్యాప్తంగా ఇటువంటి వ్యవస్థ ఉండాలి
- కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

మంగళగిరి(చైతన్యరథం): ప్రతి క్లస్టర్‌కి, ప్రతి బూత్ ఇన్‌చార్జికి సోషల్ మీడియాలో పనిచేసే విధంగా చర్యలు తీసుకున్నామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. దీనివల్ల ప్రభు త్వం మీద ఏ చిన్న విమర్శ వచ్చిన కూడా నెల్లూరు జిల్లాలో ఉన్న ప్రతిఒక్క నాయకుడు కూడా తిప్పికొట్టేందుకు సిద్ధంగా ఉంటారు. ఇది కేవలం నెల్లూరు జిల్లా అని మాత్రమే కాకుండా రాష్ట్రవ్యాప్తం గా జిల్లా అధ్యక్షుల దగ్గర నుంచి ఎమ్మెల్యేల వరకు, అలాగే క్లస్టర్ ఇన్‌చార్జులు, బూత్ ఇన్‌చార్జులు ప్రతిఒక్కరూ కూడా తప్పుని తప్పు అని చెప్పే విధంగా సిస్టమ్ ఉండాలని సూచించారు. అప్పుడు కింద కార్యకర్త అయిన సరే ఇది తప్పు అని ప్రశ్నించినప్పుడు మార్పులు మొదలవుతుంది. అదే మాట్లాడకపోతే వేరే పార్టీ వాళ్లు మనల్ని రెచ్చగొడుతూనే ఉంటుంది. కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన తరువాత రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు పరుగులు పెడుతున్నాయి. కేవలం నెల్లూరు జిల్లా కొవూరు నియోజకవర్గంలోనే రూ.750 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయి. ఇంతలా పనిచేస్తూ సోషల్‌మీడియాలో పనిచేస్తున్నా మాటలు పడాల్సి వస్తుంది. గొడ్డలి పార్టీ చేస్తున్న దుష్ప్రచారాలను అందరం కలిసికట్టుగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.



## ఆంధ్రప్రదేశ్‌ను చూసి దేశం గర్విస్తోంది

- చంద్రబాబు, లోకేష్ కష్టంతో పెట్టుబడులు
- ఐదేళ్ల వైసీపీ పాలన ప్రజలకు ఓ పీడకల
- ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు



మంగళగిరి(చైతన్యరథం): గత ఐదేళ్ల వైసీపీ పరిపాలన ఓ పీడకల..2024లో ప్రజలు ఇచ్చిన తీర్పు ఆంధ్రప్రదేశ్ పునర్ని ర్మాణానికి బాటలు వేసింది..ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సీఎం చంద్రబాబు అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు తెలిపారు. టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ప్రజలకు ప్రభుత్వ సేవలు- పాలనా విధానం అంశంపై ప్రసంగిం చారు. రాష్ట్రంలో 175 నియోజకవర్గాలు సమగ్ర అభివృద్ధి చెందా లనేది చంద్రబాబు ఆశయం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి రాష్ట్రంలో రూ.10 లక్షల కోట్ల అప్పులు ఉన్నాయి. అప్పుల ఊబిలో నుంచి లక్ష నలభై వేల కొట్లతో కార్యక్రమాలు చేపట్టి అభివృద్ధి చేశాం. చంద్రబాబు, లోకేష్ కష్టం వల్లే రాష్ట్రంలో దేశవ్యాప్తంగా 25 శాతం పెట్టుబడులు క్యూ కడుతున్నాయి. ప్రభుత్వం వల్ల రైతులకు, యువతకు, జరిగిన అభివృద్ధి ప్రజలకు తెలియజేయాలి. దేశవ్యాప్తంగా ఎక్కడ చూసినా ఈ రోజు ఆంధ్రప్రదేశ్ గురించే మాట్లాడుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 90 గిగా వాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి ఒప్పందం కుదుర్చుకున్నాం. 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎమ్ఈ పార్కులు ఏర్పాటు చేశాం. ప్రతి ఇంటికి ఒక పారిశ్రామి కవేత్తను చేశాం. అమరావతి రాజధాని ఒక సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజె క్టుగా దీనిని అందరికీ ఉపయోగపడేలా ముందుకు తీసుకెళ్లేలా కృషి చేయాలి. పెట్టుబడుల ద్వారా అన్ని జిల్లాలు అభివృద్ధి చెందేలా ముందుకు సాగుతున్నాయి. కేంద్ర సాయంతో లక్ష కోట్ల పెట్టుబడిని రైల్వేలైన్లను తీసుకొచ్చిన ఘనత చంద్రబాబుది. గత ఐదేళ్లు దెబ్బతిన్న రాష్ట్రం కూటమి ప్రభుత్వం అధికారంలో తిరిగి పునర్నిర్మించుకుంటున్నామని తెలిపారు.

## ఉత్తరాంధ్ర అభివృద్ధికి అడుగులు

- రాష్ట్రాభివృద్ధికి ఒక గేట్ వేలా విశాఖ
- ఎమ్మెల్యే కూన రవికుమార్

మంగళగిరి(చైతన్యరథం): ఉత్తరాంధ్ర కలల రెక్కలను నిజం చేస్తున్న నాయకుడు చంద్రబాబు అని ఎమ్మెల్యే కూన రవికుమార్ కొనియాడారు. టీడీపీ లీడర్ షిప్ కాంక్లేవ్‌లో ఆయన మాట్లాడు తూ ఈ రెండేళ్లల్లో రాష్ట్రానికి వచ్చిన 25 శాతం పెట్టుబడుల్లో 15శాతం ఉత్తరాంధ్రకే వచ్చాయని వివరించారు. గత ప్రభుత్వ విధ్వంసం నుంచి నేడు కూటమి పాలనలో వైభోగం వైపు ఉత్తరాంధ్ర అడుగులు వేస్తోంది. భోగా పురం పునాది రాయి వేసింది.. ప్రారంభో త్సవం చేసింది సీఎం చంద్రబాబు. ఉత్తరాంధ్రకు కొత్త ఆర్థిక గేట్ వే భోగా పురం. విశాఖ నేడు డిజిటల్ ఏఐ హబ్‌గా అభివృద్ధి చెందుతోంది. పెట్టుబడులు, పరిశ్రమలు, మౌలికవసతులు, సాగునీటి ప్రాజెక్టులు ఎక్కడ వస్తాయో.. అక్కడే అభివృద్ధి వేగంగా జరుగుతుంది. రాబో యే రెండేళ్లలో 7 నుంచి 8 లక్షల ఉద్యో గాలు ఒక్క ఉత్తరాంధ్రకే రాబోతున్నాయి. ఉత్తరాంధ్రలో ఉన్న పోర్టులు, రహదారులు, రైల్వేలైన్లు, విమానాశ్రం కనెక్టివిటీతో ఆక్వా రంగం అభివృద్ధికి ఉపయోగపడుతుంది. రాష్ట్రాభివృద్ధికి ఒక గేట్ వేలా విశాఖపట్నం నిలుస్తోంది. 15వ ఆర్థిక సంఘం నిధులను పూర్తిగా వాడుకున్న రాష్ట్రం మనది. గత ప్రభుత్వంలో చేసిన అప్పులకు వడ్డీలు చెల్లిస్తూనే...ఆ రుణాభారా న్ని ప్రజలపై పడకుండా చేశారు. ఉచిత ఇసుక విధానం పాలసీ వల్ల భవన నిర్మాణ రంగం వృద్ధిలోకి వచ్చింది. పీపీపీ విధానం అంటే ప్రైవేటీకరణ కాదు.. ప్రభుత్వ నియంత్రణలో ఉంటూనే ప్రజా ప్రయోజనాలను కాపాడుతూ మెడికల్ కాలేజీలు, ఇతర ప్రాజెక్టులను నిర్మిస్తున్నాం. జగన్‌రెడ్డికి పీపీపీ అంటే తేడా తెలియ దు. ఈ పీపీపీల వల్లే 260 ప్రాజెక్టులు వచ్చాయని.. ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.



## ఉత్తరాంధ్ర వైసీపీలో భారీ కుదుపు!

- బొత్స మేనల్లుడు మజ్జి శ్రీను పార్టీకి రాజీనామా
- విజయనగరం జిల్లా పార్టీ అధ్యక్ష పదవికి, భీమిలి సమన్వయకర్త బాధ్యతలకు గుడ్‌బై
- సీఎం చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిక

అమరావతి (చైతన్యరథం): ఉత్తరాంధ్రలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ మేనల్లుడు, వైసీపీలో అత్యంత క్రియాశీలకంగా వ్యవహరించిన మజ్జి శ్రీనివాసరావు పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన తన రాజీనామా లేఖను పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అధికారికంగా పంపించారు. పార్టీ సభ్యత్వంతో పాటు తాను బాధ్యతలు నిర్వర్తిస్తున్న విజయనగరం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్ష పదవికి, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త బాధ్యతలకు కూడా తక్షణమే రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని నమ్మి టీడీపీలో చేరినట్లు మజ్జి శ్రీను తెలిపారు. చంద్రబాబు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు నచ్చి తెలుగుదేశం పార్టీలో చేరానన్నారు. రాష్ట్రం ఇంకా అభివృద్ధి పథంలో పరిగెత్తాలంటే చంద్రబాబు సమర్థ నాయకత్వం కొనసాగాలన్నారు. విజయనగరం జిల్లాలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు, భారీ పరిశ్రమలు తీసుకురావడానికి మంత్రి నారా లోకేష్ అహర్నిశలు కష్టపడుతున్నారన్నారు. తాను ఎటువంటి పదవులు ఆశించి టీడీపీలో చేరలేదని స్పష్టం చేశారు. తనతో పాటు టీడీపీలోకి వచ్చే వాళ్లు ఇంకా చాలా మంది ఉన్నారని చెప్పారు.

ఇలాఉంటే గత సార్వత్రిక ఎన్నికల ఓటమి తర్వాత ఉమ్మడి విజయనగరం, విశాఖ జిల్లాల్లో పార్టీని నడిపిస్తున్న కీలక నేత మజ్జి శ్రీను ఇలా అనూహ్యంగా వైదొలగడం రాజకీయ వర్గాల్లో తీవ్ర సంచలనంగా మారింది. కొన్నాళ్లుగా బొత్స సత్యనారాయణ, చిన్న శ్రీను మధ్య కోల్డ్ వార్ జరుగుతోంది. పార్టీలో మేనల్లుడి ప్రాధాన్యత తగ్గించేలా బొత్స ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో చిన్న శ్రీను వైసీపీకి రాజీనామా చేయడం ఆ పార్టీలో ప్రకంపనలు రేపింది.

వాస్తవానికి గత కొద్దిరోజులుగా బొత్స కుటుంబం వైసీపీని వీడుతోందంటూ పెద్ద ఎత్తున ఊహాగానాలు చెలరేగాయి. సీనియర్ నాయకుడైన బొత్స సత్యనారాయణ పార్టీని వీడతారని అంతా భావించినప్పటికీ.. ఊహించని ట్విస్ట్‌గా ఆయన కంటే ముందే మేనల్లుడు చిన్న శ్రీను పార్టీకి గుడ్‌బై చెప్పటం గమనార్హం. గత ప్రభుత్వ హయాంలో విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్‌గా వ్యవహరించిన చిన్న శ్రీను, జిల్లా రాజకీయాల్లో తిరుగులేని పట్టు సాధించారు. బొత్స తరఫున రాజకీయం అంతా ఆయనే చక్కబెడతారని వినికిడి. కేడర్‌లో గట్టి బలం ఉన్న నేతగా గుర్తింపు పొందారు. అలాంటి బలమైన నాయకుడు ఇప్పుడు బయటకు రావడం జిల్లాలోని ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని, కార్యకర్తలను తీవ్ర అయోమయంలోకి నెట్టింది.




విజయనగరం జిల్లాలో పార్టీ నేతల మధ్య సమన్వయ లోపం, అధిష్టానం వ్యవహారశైలి, స్థానికంగా కొందరు నేతలు కల్పిస్తున్న అంతర్గత విభేదాల వల్లే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు సన్నిహిత వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా అధిష్టానం నుంచి సరైన కార్యాచరణ ప్రణాళిక లేకపోవడం, బొత్స కుటుంబానికి ఉన్న రాజకీయ ప్రాధాన్యతను తగ్గించేలా అంతర్గతంగా జరుగుతున్న పరిణామాలతో విసిగిపోయిన చిన్న శ్రీను.. ఇక పార్టీలో కొనసాగడం సమంజసం కాదని భావించి ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. చిన్న శ్రీను రాజీనామాతో ఉత్తరాంధ్రలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పునాదులు మరింత బలహీనపడ్డాయి. బొత్స చురుకుగా రాజకీయం చేసే పరిస్థితి లేదనేది తెలిసిందే.

మూడు తరాలుగా ఎత్తిన పసుపు జెండా దించని...

# అవిశ్రాంత సేవకుడు డాక్టర్ గురురాజా

## నేడు గ్లోబల్ ఎన్ఆర్ఐ టీడీపీ చీఫ్‌గా ప్రమాణస్వీకారం



**సమాజమే దేవాలయం... ప్రజలే దేవుళ్లు అనే మానవీయ సిద్ధాంతంతో అన్న నందమూరి తారక రామారావు 1982లో స్థాపించిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర రాజకీయాలను సమూలంగా మార్చేసింది. ఆయన పిలుపుతో ఎంతో మంది డాక్టర్లు, లాయర్లు, వ్యాపారవేత్తలు రాజకీయాలవైపు ఆకర్షితులయ్యారు. అలా పసుపు జెండాకు ప్రభావితమై గత నాలుగున్నర దశాబ్దాలుగా పార్టీకి ప్రత్యక్షంగా, పరోక్షంగా సేవలందిస్తూ నేడు గ్లోబల్ ఎన్ఆర్ఐ టీడీపీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించబోతున్నారు. ఆయనే కర్నూలు జిల్లా మారుమూల ప్రాంతమైన కోయిలకుంట్లకు చెందిన డాక్టర్ పిల్లారిశెట్టి గురురాజా.**



(చైతన్యరథం-అమరావతి)
అన్న ఎన్టీఆర్ సిద్ధాంతాలకు ఆకర్షితుడైన గురురాజా కర్నూలు జిల్లాలో చేపట్టిన చైతన్య రథయాత్రల్లో ప్రత్యక్షంగా పాల్గొని సేవలందించారు. 1983 సార్వత్రిక ఎన్నికల్లో డోన్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి, మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి గెలుపు కోసం క్షేత్రస్థాయిలో పనిచేశారు. కేఈ కుటుంబంతో రాజకీయ, వ్యక్తిగత అనుబంధాన్ని కొనసాగిస్తూ పార్టీ పటిష్టతకు తన వంతు కృషి చేశారు. 2005లో నారా చంద్రబాబునాయుడు కర్నూలు పర్యటన సందర్భంగా ఏర్పడిన పరిచయం పార్టీతో అనుబంధాన్ని మరింత దృఢంగా మార్చింది. 2013లో యువ నేత నారా లోకేష్‌తో పరిచయం ఏర్పడినప్పటి నుంచి ఎన్ఆర్ఐ టీడీపీ వ్యవహారాలతో పాటు తెలుగుదేశం పార్టీ సంస్థాగత వ్యవహారాల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ సేవలందిస్తున్నారు.

### విద్యార్థి దశ నుంచే సమస్యలపై పోరాటం

డాక్టర్ గురురాజా పూర్వీకులది చిత్తూరు జిల్లా పుత్తూరు మండలం కనకంపాలెం గ్రామం. ఆయన తండ్రి విద్యా శాఖలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్‌గా సేవలందించారు. గురురాజా కర్నూలు జిల్లా ఆదోనిలో జన్మించారు. తండ్రి ఉద్యోగరీత్యా కోయిలకుంట్లకు మారడంతో గురురాజా పాఠశాల, ఇంటర్మీడియట్ విద్య అక్కడే సాగింది. దీంతో స్థానిక ప్రజలతో ఆయనకు బలమైన అనుబంధం ఏర్పడింది. ఉన్నత విద్య కోసం కర్నూలు మెడికల్ కాలేజీలో చేరిన గురురాజా 1983లో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. 1987 వరకు అదే వైద్య కళాశాలలో ఈఎన్‌టీ (ENT) విభాగంలో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. వైద్య విద్యార్థిగా ఉన్న రోజుల్లోనే 1986లో ఆంధ్రప్రదేశ్ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (JUDA) అధ్యక్షుడిగా పని చేశారు. జూనియర్ వైద్యుల హక్కుల సాధన కోసం పోరాడారు. 1991లో అమెరికా వెళ్లిన గురురాజా న్యూయార్క్‌లోని ప్రఖ్యాత ఫ్లషింగ్ మెడికల్ సెంటర్‌లో గైనకాలజీ విభాగంలో రెసిడెన్సీ పూర్తి చేశారు. ఆ తర్వాత టెక్సాస్ సమీపంలోని ఒడెస్సా పట్టణంలో సొంత హాస్పిటల్ ప్రారంభించి ప్రఖ్యాత వైద్యుడిగా ఖ్యాతి గడించారు. ఆయన సతీమణి డాక్టర్ ఉషారాణి గుంటూరు మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థిని కాగా ఒడెస్సా క్లినిక్‌లోనే ఇంటర్నల్ మెడిసిన్ నిపుణురాలిగా ప్రస్తుతం సేవలందిస్తున్నారు. వీరి కుమారుడు కార్తీక్ వాషింగ్టన్ డీసీలో అమెరికా ఫెడరల్ ప్రభుత్వ న్యాయవాదిగా, కుమార్తె కీర్తి యూటీ డల్లాస్‌లో పబ్లిక్ హెల్త్ పీజీ విద్యార్థిగా కొనసాగుతున్నారు.

### అమెరికాలో ఉన్నా జన్మభూమికి సేవలు

గ్లోబల్ ఎన్నారై టీడీపీ అధ్యక్షుడిగా నియమితులైన డాక్టర్ పిల్లారిశెట్టి గురురాజా అమెరికాలోని ఒడెస్సాలో నివాసం ఉంటున్నారు. సౌమ్యులు, వివాదరహితుడు, స్నేహశీలి, మంచి మనసున్న మనిషిగా పేరొందిన ఆయన ప్రవాసాంధ్రుల కోసం సరికొత్త కార్యాచరణను సిద్ధం చేసుకుని ముందుకు సాగనున్నారు. అమెరికాలో ఎంతటి ఉన్నత స్థితిలో ఉన్నా గురురాజా స్వస్థలమైన కోయిలకుంట్లను విస్మరించలేదు. 'గురురాజా మిత్రమండలి' స్థాపించి గత 12 ఏళ్లుగా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, పేదలకు ఉచిత వైద్య సహాయం, ఆర్థిక తోడ్పాటు నందిస్తున్నారు. కోయిలకుంట్ల పరిసరాల్లో ఉచిత కుట్టుమిషన్ శిక్షణా కేంద్రాలు నెలకొల్పి మహిళలకు ఉపాధి కల్పించారు. స్వచ్ఛంద సేవా కార్యక్రమాల ద్వారా ఎందరో పేదలకు అండగా నిలుస్తున్నారు. ఇదే తరహాలో విదేశాల్లో స్థిరపడిన తెలుగువారు తమ స్వగ్రామాల్లోని బడులు, ఆసుపత్రులు, యువతకు ఉపాధి శిక్షణ కేంద్రాల అభివృద్ధి కోసం క్రమపద్ధతిలో విరాళాలు, తోడ్పాటు అందించేలా ప్రోత్సహించాలన్నదే తన ఆలోచన అని చెబుతున్నారు డాక్టర్ గురురాజా.

### ఎన్ఆర్ఐల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా...

ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో విస్తరించి ఉన్న ఎన్నారై టీడీపీ విభాగాలను ఏకతాటిపైకి తీసుకురావడమే తమ ప్రథమ లక్ష్యమని డాక్టర్ గురురాజా తెలిపారు. డాక్టర్ గురురాజా నేతృత్వంలో 45 మంది సభ్యులతో గ్లోబల్ ఎన్ఆర్ఐ టీడీపీ విభాగాన్ని పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించారు. ప్రపంచంలోని అన్ని దేశాల ప్రతినిధులను ఒకే గొడుగు కిందకు చేర్చి పార్టీ అధినాయకత్వంతో సమన్వయం చేసుకుంటూ ఎన్ఆర్ఐ టీడీపీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాలని ఆయన యోచిస్తున్నారు. విదేశాల్లో స్థిరపడిన ప్రవాసాంధ్రులకు తమ సొంత ఊళ్లలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు ఒక ప్రత్యేక సహాయ వేదిక ఏర్పాటు, ఎన్నారైల ఆస్తుల పరిరక్షణ, ప్రభుత్వ అధికారుల సమన్వయంతో ఎన్ఆర్ఐల సమస్యల పరిష్కారం వంటి అంశాలపై ఆయన దృష్టి సారించనున్నారు. గ్లోబల్ ఎన్ఆర్ఐ టీడీపీ చీఫ్‌గా నేడు బాధ్యతలు స్వీకరించబోతున్న డాక్టర్ గురురాజా, ఆయన టీమ్‌కు చైతన్యరథం శుభాభినందనలు.

## రాష్ట్రాభివృద్ధిలో ప్రవాసాంధ్రులను భాగస్వాములను చేయడమే లక్ష్యం: డాక్టర్ గురురాజా



రాజకీయాల్లో ప్రత్యక్షంగా పాల్గొనడానికి సంకోచించే ప్రవాసాంధ్రులను చైతన్యపరిచి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములను చేయడమే తన ధ్యేయమని డాక్టర్ గురురాజా చెబుతున్నారు. చంద్రబాబునాయుడు అభివృద్ధి విజన్ పట్ల గౌరవం ఉన్నప్పటికీ చాలా మంది వైద్యులు, ఇంజినీర్లు, ఐటీ నిపుణులు, మేధావులు సాధారణ రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. అలాంటి ఔత్సాహికుల కోసం వేర్వేరు వేదికలను రూపొందించి, వారి ఆలోచనలు, సలహాలు, నైపుణ్యాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రగతి కోసం ఉపయోగించాలని ఆయన భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణం... ముఖ్యంగా పెట్టుబడులు, ఆధునిక సాంకేతికతను తీసుకురావడంలో ప్రవాసాంధ్రులను ప్రధాన రాయబారులుగా మార్చడమే తన ధ్యేయమని గురురాజా చెప్పారు. రాష్ట్రంలో నూతన పరిశ్రమల స్థాపన, స్టార్టప్‌లకు మార్గదర్శనం చేయడానికి విదేశీ తెలుగు పారిశ్రామికవేత్తలను అనుసంధానించాలన్నదే తన కర్తవ్యమని తెలిపారు. ఎన్నారై టీడీపీ ని కేవలం ఎన్నికల సమయంలో ప్రచారానికే పరిమితం చేయకుండా ప్రవాసాంధ్రుల బాగోగులు చూసే, రాష్ట్ర సమగ్రాభివృద్ధిలో కీలక భాగస్వామిగా నిలిచే వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమంటున్న గురురాజా... ఆ దిశగా సరికొత్త ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు.

# నెరవేరిన స్వప్నం - ఉత్తరాంధ్రను తాకిన గోదావరి జలాలు



పాయకరావుపేట (చైతన్యరథం): గోదావరి జలాలు ఉత్తరాంధ్రను తాకాయి. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట సమీపంలోని పోలవరం ఎడమ కాలువ క్రాస్ రెగ్యులేటర్ ప్రాంతానికి గోదావరి జలాలు రాత్రికిరాత్రే చేరుకున్నాయి. పోలవరం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ ద్వారా తూర్పు గోదావరి, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల పరిధిలోని లక్షలాది ఎకరాలకు సాగు, తాగునీటి అవసరాలను తీర్చడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టు రూపకల్పన జరిగిందని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు. తాజాగా పాయకరావుపేట ప్రాంతంలోని క్రాస్ రెగ్యులేటర్ వద్దకు నీరు చేరుకుంది. ఈ క్రమంలో కాలువ నిర్మాణ పనుల పురోగతి, నీటి ప్రవాహ వేగంపై అధికారులకు ఓ స్పష్టత వచ్చింది. ఈ నేపథ్యంలో గోదారి జలాల రాకతో స్థానిక రైతుల్లో నూతన ఉత్సాహం వ్యక్తమవుతోంది. ఆయకట్టు భూములకు నీటి కష్టాలు తీరతాయని ఈ సందర్భంగా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లోని పంటలు కళకళలాడుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# అమాయకుల్ని బురిడి కొట్టిస్తున్న సైబర్ నేరగాళ్లు

**●ఇంట్లో కూర్చునే లక్షలు సంపాదించవచ్చంటూ ఫేక్ యాప్‌లతో ఉచ్చు**

**●క్యూవీఎస్ఈ యాప్ పేరుతో మోసాలు... అప్రమత్తంగా ఉండాలన్న పోలీసులు**




అరచేతిలో వైకుంఠం చూపిస్తూ.. అతి తక్కువ సమయంలోనే కోటీశ్వరులు కావచ్చని ఆశపెడుతున్న సైబర్ నేరగాళ్లు అమాయకుల జేబులకు భారీగా చిల్లులు పెడుతున్నారు. స్మార్ట్ ఫోన్ చేతిలో ఉంటే చాలు, ఇంట్లో కూర్చునే లక్షలు సంపాదించవచ్చంటూ వలవేసి నిలువునా దోచేస్తున్నారు. తాజాగా స్టాక్ మార్కెట్, క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్ పేరుతో ఆన్‌లైన్ మార్కెట్లోకి వచ్చిన 'క్యూవీఎస్ఈ' (QVSE) యాప్ మోసాలపై కాకినాడ జిల్లా పోలీసులు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. అడ్డదారిలో భారీ లాభాలు వస్తాయని నమ్మించి అందినకాడికి దండుకుంటున్న ఈ ఫేక్ యాప్ ఉచ్చులో పడొద్దని ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఆన్‌లైన్ ట్రేడింగ్ యాప్‌ల పట్ల అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమైందని వివరిస్తున్నారు.

ఈ సైబర్ మోసగాళ్ల వ్యూహం చాలా పకడ్బందీగా, అత్యంత చాకచక్యంగా ఉంటోంది. మొదట QVSE యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెట్టిన బాధితులకు పూర్తి నమ్మకం కలిగించేందుకు, లాభాల పేరుతో కొంత మొత్తం విత్‌డ్రా చేసుకునే అవకాశం కల్పిస్తారు. ఆ వచ్చిన కొద్దిపాటి లాభాలను చూసి గుడ్డిగా నమ్మేసిన జనాలు.. అత్యాశతో తమ వద్ద ఉన్న జీవితకాలపు పొదుపును, అప్పులు తెచ్చిన డబ్బును ఆ యాప్‌లో కుమ్మరిస్తున్నారు. తీరా పెద్ద మొత్తంలో డబ్బులు డిపాజిట్ చేశాక సైబర్ నేరగాళ్ల అసలు కథ మొదలవుతుంది. ఉన్నపళంగా బాధితుల ఖాతాలను టెక్నికల్ సమస్యల పేరుతో బ్లాక్ చేసి నిలువునా మోసం చేస్తారు. ఖాతాలు బ్లాక్ కావడంతో ఆందోళనకు గురయ్యే బాధితుల బలహీనతను ఈ కేటుగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. బ్లాక్ అయిన అకౌంట్లను పునరుద్ధరించుకోవాలన్నా, పెట్టిన పెట్టుబడిని వెంటనే విత్‌డ్రా చేసుకోవాలన్నా కొత్తగా పన్నులు, వెరిఫికేషన్ ఫీజుల పేరుతో మరో వసూళ్ల పర్వానికి తెరలేపారు. కొత్త ఖాతాదారులు అయితే 500 డాలర్లు, పాత సీనియర్ కస్టమర్లు అయితే 1000 డాలర్లు అదనంగా డిపాజిట్ చేయాలని కండిషన్లు పెడుతున్నారు. అయితే డబ్బులు వస్తాయన్న ఆశతో పొరపాటున ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లో చెల్లిస్తే, ఆ డబ్బు కూడా గోవిందా అని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. ఆన్‌లైన్ పెట్టుబడి మోసాల్లో సైబర్ నేరగాళ్లు దశాబ్దాలుగా అవలంబించే అత్యంత సాధారణ పద్ధతి ఇదేనని కాకినాడ జిల్లా పోలీసులు వివరిస్తున్నారు. ఈ వ్యవహారంపై కాకినాడ సీఐ ప్రత్యేకంగా ఒక మీడియా సమావేశం నిర్వహించి బాధితులను తీవ్రంగా అప్రమత్తం చేశారు. పోయిన డబ్బును ఎలాగైనా తిరిగి తెచ్చుకోవాలనే ఆత్రుతతో నేరగాళ్లు అడిగినంత డబ్బు చెల్లిస్తే మరింత ఆర్థిక నష్టంలో కూరుకుపోవడం ఖాయమని ఆయన హెచ్చరించారు. ఫీజులు, ట్యాక్సుల పేరుతో అదనంగా డబ్బులు అడిగే ఏ యాప్‌ను కూడా గుడ్డిగా నమ్మకూడదని, వెంటనే అప్రమత్తమై పోలీసు అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఇప్పటికే ఈ నకిలీ QVSE యాప్‌లో డబ్బులు పెట్టుబడిగా పెట్టి మోసపోయిన వారు తక్షణమే స్పందించాలని పోలీసులు సూచిస్తున్నారు. ఏ పరిస్థితిలోనూ తొందరపడి మరో రూపాయి కూడా వాళ్లకు డిపాజిట్ చేయవద్దని అధికారులు కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. ఎవరైనా ఇలాంటి ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసానికి గురైతే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే స్థానిక పోలీసులను గానీ, సైబర్ క్రైమ్ అధికారులను గానీ స్వయంగా సంప్రదించి వివరాలు నిర్ధారించుకోవాలి. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన టోల్ ఫ్రీ నంబర్ 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయడం ద్వారా పోయిన డబ్బును తిరిగి పొందే అవకాశం ఉంటుందని పోలీసులు వెల్లడించారు. మోసాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండటమే ఉత్తమ మార్గమని హితవు పలికారు.

# మెగా డీఎస్సీపై వైసీపీ వైఖరి కుక్కతోక పట్టుకొని గోదావరి ఈదినట్టుంది

**●16,400 ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీతో, తమను రాజకీయ నిరుద్యోగులుగా మార్చాడన్న అక్కసుతోనే గొడ్డలి పార్టీ నేతలు లోకేశ్‌ను బదనాం చేస్తున్నారు : ప్రత్తిపాటి పుల్లారావు**

చిలకలూరిపేట (చైతన్యరథం): "ఐదేళ్లపాటు జగన్ జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీల పేరు చెప్పి ఊరించి ఊరించి చివరకు నిరుద్యోగ యువతను ఉసూరుమనిపించాడు. ఏపీ యువత మేధస్సు, శక్తి సామర్థ్యాల్ని గంజాయి, మాదకద్రవ్యాలతో నీరుగార్చి, రాష్ట్ర భవిష్యత్ నే నిర్వీర్యం చేశాడు. అధికారంలో ఉండి తాను చేయలేని దాన్ని లోకేశ్ కేవలం 150 రోజుల్లో చేసి చూపించాడన్న అక్కసుతోనే జగన్.. కూటమి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీపై దుష్ప్రచారం చేస్తున్నాడు. ఒక్క మెగా డీఎస్సీతో 16,400 ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేసి, తమను శాశ్వత రాజకీయ నిరుద్యోగులుగా మార్చాడన్న కడుపుమంటతోనే గొడ్డలిపార్టీ నేతలు లోకేశ్‌ను బదనాం చేస్తున్నారు. మెగా డీఎస్సీపై వైసీపీనేతల వైఖరి కుక్కతోక పట్టుకొని గోదావరి ఈదినట్టుంది. అవినీతి, అనుకూల మీడియా మద్దతుతో ఆ పార్టీ నాయకులు కూటమి ప్రభుత్వం సాధించిన డీఎస్సీ విజయాల్ని కావాలనే వక్రీకరిస్తున్నారు. మొత్తం దేశమే గర్వించేలా, ఇతర రాష్ట్రాలకు ప్రామాణికంగా నిలిచేలా మెగా డీఎస్సీని విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఎంతో సమర్థవంతంగా నిర్వహించారు. ఆయన పనితీరు, నాయకత్వపటిమపై రాష్ట్ర యువతలో మరీ ముఖ్యంగా నిరుద్యోగుల్లో తిరుగులేని నమ్మకం ఏర్పడింది. జెన్ జీ దృష్టిలో హీరోగా మారిన లోకేశ్ ఇమేజ్‌ను డామేజ్ చేయాలన్న దుర్బుద్ధితోనే జగన్ ముఠా డీఎస్సీపై రోజుకో కట్టుకథ అల్లుతోంది. ఐదేళ్లపాటు అవినీతి, అక్రమాల ఆటల్లో విజేతలుగా నిలిచిన



వారు.. క్రీడాకోటా నిబంధనల్ని తప్పుపట్టడం హాస్యాస్పదంగా ఉంది. అధికారులు, డీఎస్సీ విజేతలు ఆధారాలతో సహా వాస్తవాల్ని కళ్లకు కట్టినట్టు వివరిస్తున్నా వైసీపీనేతల వక్రబుద్ధి మారడం లేదు." అని ప్రత్తిపాటి మంగళవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

# రైతులు అభివృద్ధి కోసం సహకార సంఘాలను బలోపేతం చేయాలి

**●ఎఫ్‌పీవోలు, సహకార సంఘాలను మరింత ప్రోత్సహించాలి**

**●డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున**



విజయనగరం (చైతన్యరథం): విజయనగరం జిల్లాలో రైతులను మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు సహకార సంఘాలు బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని విజయనగరం జిల్లా డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. మంగళవారం అమరావతిలో జరుగుతున్న టీడీపీ కాన్క్లేవ్‌లో ఆయన మాట్లాడుతూ విజయనగరం, కృష్ణా జిల్లాల డీసీసీబీల పనితీరును అధ్యయనం చేస్తే రైతుల పరిస్థితికి, సహకార బ్యాంకుల అభివృద్ధికి మధ్య ఉన్న సంబంధం స్పష్టమవుతుందని వివరించారు.

**కృష్ణా రైతులే బలానికి కారణం**

కృష్ణా జిల్లా డీసీసీబీ మెరుగైన స్థితిలో ఉండటానికి అక్కడి రైతుల ఆర్థిక పరిస్థితి, వ్యవసాయంలో అనుసరిస్తున్న మంచి పద్ధతులు ప్రధాన కారణమని నాగార్జున పేర్కొన్నారు. అదే తరహాలో విజయనగరం జిల్లాలోనూ రైతులను ఆర్థికంగా బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**గుడ్ ప్రాక్టీసెస్‌పై దృష్టి**

విజయనగరం జిల్లాలో రైతుల్లో కొంత వెనకబాటుతనం ఉందని, దీనిని అధిగమించేందుకు రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, మంచి ప్రాక్టీసెస్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. రైతులు సంఘటితంగా పనిచేసేలా చర్యలు తీసుకుంటే ఉత్పత్తి, ఆదాయం రెండింటినీ పెంచే అవకాశం ఉంటుందన్నారు.

**ఎఫ్‌పీవోలు, సహకార సంఘాలకు ప్రోత్సాహం**

రైతులను ఒకే వేదికపైకి తీసుకురావడంలో ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్‌పీవోలు), సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తాయని నాగార్జున అన్నారు. వీటిని మరింత ప్రోత్సహించి, రైతులకు అవసరమైన రుణాలు, మార్కెటింగ్, సాంకేతిక సహకారం అందేలా చూడాలని కోరారు. విజయనగరం జిల్లా రైతుల అభివృద్ధి, డీసీసీబీ బలోపేతం కోసం ఈ అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని వివరించారు.

# స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ - 2026 ఫలితాల్లో జాతీయ స్థాయిలో సత్తా చాటిన గుంటూరు నగరం




పర్యావరణ పరిరక్షణలో ఆంధ్రప్రదేశ్ సరికొత్త రికార్డు సృష్టించింది. కేంద్ర పర్యావరణ, అటవీశాఖ విడుదల చేసిన 'స్వచ్ఛ వాయు సర్వేక్షణ్-2026' ఫలితాల్లో గుంటూరు నగరం జాతీయ స్థాయిలో సత్తా చాటింది. 3 నుంచి 10 లక్షల లోపు జనాభా ఉన్న నగరాల కేటగిరీలో గుంటూరు జాతీయ స్థాయిలో రెండో ర్యాంకును కైవసం చేసుకుని రికార్డు సృష్టించింది. ఈ కేటగిరీలో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఫిరోజాబాద్ నగరంతో కలిసి గుంటూరు రెండో ర్యాంకును పంచుకుంది. ఈ ఘనతకు గానూ కేంద్రం ప్రకటించిన రూ.50 లక్షల నగదు బహుమతిలో గుంటూరు నగరపాలక సంస్థ రూ.25 లక్షల ప్రైజ్ మనీని చేజిక్కించుకుంది.

ఢిల్లీ పర్యావరణ భవన్‌లో ఇటీవల జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో జాతీయ హరిత ట్రిబ్యునల్ (NGT) ఛైర్‌పర్సన్ జస్టిస్ ప్రకాశ్ శ్రీవాస్తవ, ఎయిర్‌క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్ ఛైర్‌పర్సన్ రాజేష్‌వర్మ, కేంద్ర పర్యావరణశాఖ కార్యదర్శి తన్మయ్‌కుమార్, సీపీసీబీ ఛైర్మన్ అమన్‌దీప్‌గర్గ్‌ల చేతుల మీదుగా గుంటూరు నగరపాలక సంస్థ ప్రతినిధులు ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును స్వీకరించారు.

**ఏపీలోని ఇతర నగరాల ర్యాంకులు ఇలా:**

దేశవ్యాప్తంగా "నేషనల్ క్లీన్ ఎయిర్? ప్రోగ్రామ్" (NCAP) కింద ఉన్న 130 నగరాల్లో వాయు నాణ్యత ప్రమాణాల ఆధారంగా ఈ సర్వే నిర్వహించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలు నగరాలు తమ స్థానాలను మెరుగుపరుచుకోగా, కొన్ని వెనుకబడ్డాయి. 10 లక్షలకు పైగా జనాభా 48 నగరాలు, 3-10 లక్షలలోపు జనాభా ఉన్న 42 నగరాలు, 3 లక్షలలోపు జనాభా ఉన్న 40 పట్టణాలకు ర్యాంకులు ప్రకటించారు.

ఇందులో 10 లక్షలకు పైబడి జనాభా ఉన్న నగరాల్లో విజయవాడ గతేడాదితో పోలిస్తే 5 స్థానాలు మెరుగుపరుచుకుని 8వ ర్యాంకు సాధించింది. 2025 ర్యాంకులతో పోలిస్తే విశాఖపట్నం 4 స్థానాలు కోల్పోయి 21వ ర్యాంకుకు పడిపోయింది. 3-10 లక్షలలోపు జనాభా కేటగిరీలో గుంటూరు 4 స్థానాలు ఎగబాకి రెండో స్థానాన్ని కైవసం చేసుకుంది. గతేడాది 18వ స్థానంలో ఉన్న నెల్లూరు, ఈసారి ఏకంగా 9వ స్థానానికి చేరి టాప్-10లో నిలిచింది. అనంతపురం ఒక స్థానం మెరుగుపరుచుకుని 35 నుంచి 34వ స్థానానికి చేరింది. కర్నూలు రెండేళ్లుగా ఎటువంటి మార్పు లేకుండా 29వ స్థానంలోనే యథాతథంగా నిలిచింది. రాజమహేంద్రవరం గతేడాది 12వ స్థానంలో ఉండగా, ఈసారి రెండు స్థానాలు కోల్పోయి 14కి పడిపోయింది. గతేడాది 23వ ర్యాంకులో ఉన్న కడప, ఈసారి ఏకంగా 34వ స్థానానికి పడిపోయింది.

చైతన్యరథం

# విజయవాడ అభివృద్ధికి ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని ప్రత్యేక చొరవ

- ఎంపీ లాడ్స్ ద్వారా రూ.15కోట్ల నిధుల కేటాయింపు
- ప్రజా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు



విజయవాడ(ఎంపీ కార్యాలయం)విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎంపీ లాడ్స్ (మెంబర్స్ ఆఫ్ పార్లమెంట్ లోకల్ ఏరియా డెవలప్మెంట్ స్కీం) ద్వారా ఎంపీ కేశినేని శివనాథ్ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నారు. 18వ లోక్‌సభ కాలానికి విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గానికి మొత్తం రూ.15 కోట్లు కేటాయించగా, అందులో రూ.5,83,54,032 విలువైన పనులకు సిఫార్సులు చేయబడ్డాయి. ప్రస్తుతం రూ.8,86,45,968 నిధులు అందుబాటులో ఉన్నాయి.

**ప్రజా అవసరాలకు ప్రాధాన్యత**

విజయవాడ పార్లమెంట్ పరిధిలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన తాగునీరు, డ్రైనేజీ, కమ్యూనిటీ హాళ్ళు, రహదారి మౌలిక వసతులు, కల్వర్టులు, సాగునీటి సదుపాయాలు, శ్మశానవాటికల అభివృద్ధి తదితర పనులకు ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని ప్రాధాన్యతనిస్తున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే పలు పనులకు నిధులు మంజూరు కాగా, కొన్ని పనులు పూర్తయ్యాయి, మరికొన్ని పురోగతిలో ఉన్నాయి. 2026--27 సంవత్సరానికి కూడా ప్రజల స్థానిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని పలు కొత్త పనులను ప్రతిపాదించారు. రూ.3,26, 32,000పైగా పనులకు సిఫార్సులు 2025-26 సంవత్సరానికి అయితే 2026-27 సంవత్సరానికి రూ 2,57,22, 032 పైగా పనులను ప్రతిపాదించారు.

**వీటిలో ముఖ్యమైన పనులు**

జగ్గయ్యపేట మండలం వేదాద్రి వద్ద కృష్ణా నదిపై ఎత్తిపోతల సాగునీటి పథకానికి 2300 HP పంప్‌సెట్ సరఫరా, ఏర్పాటు, విద్యుత్ మరియు యాంత్రిక పనులు.నందిగామ మండలం రాఘవాపురం గ్రామంలోని కమ్మవారిపాలెం వద్ద మంగళ వాగుపై కల్వర్టు, రిటైనింగ్ వాల్ నిర్మాణం. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ 31వ డివిజన్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం.వాంబే కాలనీ, 60వ డివిజన్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం.విజయవాడ 11వ డివిజన్‌లోని P&T కాలనీ నుంచి గురునానక్ కాలనీ రోడ్డు వరకు పైప్‌లైన్ ఏర్పాటు. ఆటోనగర్ ELSR నుంచి గురునానక్ కాలనీ రోడ్డు వరకు పైప్‌లైన్ ఏర్పాటు.నందిగామ మండలం మునగచెర్ల గ్రామంలో గ్రావిటీ మెయిన్ పైప్‌లైన్, 40 KL సంప్ ఏర్పాటు. తిరువూరు 17వ వార్డులోని కమ్యూనిటీ హాల్‌లో MS గ్రిల్స్, గ్లాస్ ఇంటీరియర్, సీలింగ్, ఫ్లోర్ మరియు వాల్ టైల్స్ పనులు.ఎ.కొండూరు మండలం గొల్లమండల గ్రామంలో మామిళ్ల వాగుపై 1000 మి.మీ. వ్యాసం కలిగిన రెండు వెంట్ల పైప్ కల్వర్టుల నిర్మాణం. విజయవాడలోని బెజవాడ బార్ అసోసియేషన్ సిటీ సివిల్ కోర్ట్ కాంప్లెక్స్‌లో మహిళా బార్ అసోసియేషన్ భవన నిర్మాణానికి నిధుల కేటాయింపు. జగ్గయ్యపేట మండలం బాలుసుపాడు గ్రామంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం. మల్కాపురం గ్రామంలోని ఎస్సీ శ్మశానవాటికలో అభివృద్ధి పనులు. 2026-27లో మరిన్ని అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూడా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజా అవసరాలకు అనుగుణంగా పలు పనులను ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని ప్రతిపాదించారు.

**విజయవాడ పార్లమెంట్ అభివృద్ధే లక్ష్యం**

ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని మాట్లాడుతూ, విజయవాడ పార్లమెంట్‌లోని ప్రతి ప్రాంతానికి సమాన ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే స్థానిక సమస్యలు, అవసరాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, అందుబాటులో ఉన్న ఎంపీ లాడ్స్ నిధులతో సాధ్యమైనంత మేరకు అభివృద్ధి పనులను చేపడతామని ఆయన పేర్కొన్నారు. విజయవాడ పార్లమెంట్‌ను మరింత అభివృద్ధి చెందిన, మెరుగైన మౌలిక వసతులు కలిగిన పార్లమెంట్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామని ఎంపీ స్పష్టం చేశారు.

# మంగళగిరిలో రెండో రోజు టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్

●పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యం: నేతలకు అధినాయకత్వం దిశానిర్దేశం



మంగళగిరి / వినుకొండ (చైతన్యరథం): మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహిస్తున్న రెండు రోజుల టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్ రెండో రోజు కొనసాగింది. పార్టీ జాతీయ అధ్యక్షులు, సీఎం చంద్రబాబు, పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ పాల్గొని పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, పార్టీ ముఖ్య నేతలతో పాటు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు హాజరయ్యారు. రెండు రోజుల పాటు శిక్షణ, పరస్పర చర్చల విధానంలో నిర్వహిస్తున్న ఈ కాంక్లేవ్ ద్వారా ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకుల్లో నాయకత్వ లక్షణాలను మరింతగా పెంపొందించడం, క్షేత్రస్థాయిలో పార్టీ వ్యవస్థను పటిష్టం చేయడం, ప్రజలకు మరింత చేరువగా పనిచేసేలా నాయకులను తీర్చిదిద్దడం ప్రధాన ఉద్దేశంగా ఉంది. మొత్తం 10 సెషన్లలో వివిధ కీలక అంశాలపై చర్చలు, ప్రజెంటేషన్లు నిర్వహిస్తున్నారు.

**క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలి**

మొదటి రోజు సమావేశాల్లో నాయకత్వ అభివృద్ధి, పార్టీ సంస్థాగత నిర్మాణం, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, స్వర్ణాంధ్ర విజన్-2047, రాజకీయ,ఆర్థిక సాధికారత, సంపూర్ణ సంక్షేమం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. పార్టీ, ప్రభుత్వం మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లాలని నాయకత్వం సూచించింది. రెండో రోజు సుస్థిర అభివృద్ధి, ప్రజా సేవలు, సుపరిపాలన, పొలిటికల్ కమ్యూనికేషన్, ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడం, స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధత వంటి అంశాలపై ప్రధానంగా చర్చలు కొనసాగాయి. సీఎం చంద్రబాబు, నారా లోకేష్, పార్టీ నాయకులు కొన్ని సూచనలు చేశారు. ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేస్తూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి ఘన విజయం సాధించే దిశగా సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. 2029 ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగించాలని సూచించారు.

**ఈ సందర్భంగా ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ...** పార్టీ అధినాయకత్వం అందిస్తున్న మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేయడంతో పాటు ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించడంలో ముందుండాలని పేర్కొన్నారు. టీడీపీ నాయకత్వానికి కొత్త దిశానిర్దేశం చేస్తూ పార్టీ, ప్రభుత్వ సమన్వయాన్ని మరింత పటిష్టం చేసి, క్షేత్రస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీని మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ఈ లీడర్‌షిప్ కాంక్లేవ్ కొనసాగింది.

# నాయకత్వానికి కొత్త దిశ చూపిన టీడీపీ కాన్క్లేవ్ : ఎమ్మెల్యే మాధవి

మంగళగిరి (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహించిన "టీడీపీ లీడర్‌షిప్ ట్రైనింగ్ కాన్క్లేవ్" నాయకత్వానికి కొత్త దిశ చూపించిందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ లోని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడం, ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగించడం, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరవేయడం వంటి అంశాల్లో ఈ కాన్క్లేవ్ ఎంతో దోహదపడిందన్నారు.

# గొడ్డలి పార్టీ దుష్ప్రచారాన్ని సోషల్ మీడియాను సమర్థంగా వినియోగించి తిప్పికొట్టాలి

●రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి

●జెన్ జీ ఆలోచనలకు ప్రాధాన్యం.. రియల్‌టైమ్ నిర్ణయాలతో ముందుకు : మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు



మంగళగిరి (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహిస్తున్న రెండో రోజు లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ పార్టీ నాయకులు, శ్రేణులను ఉద్దేశించి పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, సోషల్ మీడియా వేదికలను సమర్థవంతంగా ఉపయోగించడం, ప్రతిపక్ష దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.

ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో సోషల్ మీడియా ప్రాధాన్యం రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సోషల్ మీడియాను సమర్థంగా వినియోగించాలని సూచించారు. ప్రతిపక్షం చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని వాస్తవాలతో తిప్పికొట్టాలని, ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అమరావతిని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసే దిశగా ముందుకు సాగుతోందని, ఈ విషయాన్ని మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని నాయకత్వం స్పష్టం చేసింది. అమరావతి అభివృద్ధి, రాష్ట్ర ప్రగతికి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ప్రజలకు సులభంగా అర్థమయ్యే విధంగా వివరించాలని సూచించింది. నేటి యువత, ముఖ్యంగా జెన్ జీ ఆలోచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని రాజకీయ నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని కాంక్లేవ్‌లో చర్చించారు. జెన్ జీ రియల్‌టైమ్ నిర్ణయాలతో దూకుడుగా ముందుకు సాగుతోందని, అదే వేగాన్ని రాజకీయ వ్యవస్థలోనూ తీసుకురావాలని సూచించారు.

**వైసీపీ దుష్ప్రచారాన్ని ఉపేక్షించరాదు**

ప్రతిపక్షం చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించరాదని పార్టీ నాయకత్వం స్పష్టం చేసింది. వాస్తవాలను ప్రజలకు చేరవేయడంతో పాటు ఫేక్ ప్రచారం ఎక్కడ జరిగినా వెంటనే స్పందించి తిప్పికొట్టాలని సూచించింది. ఫేక్ ప్రచారంపై ఆధారపడే గొడ్డలి పార్టీ రాజకీయాలు చేస్తోందని నాయకులు విమర్శించారు. టీచర్లను బెదిరించే స్థాయికి ఆ పార్టీ అనుకూల మీడియా దిగజారిందని ఆరోపించారు. ఇలాంటి బరితెగింపు చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదని, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చట్టపరంగా, రాజకీయంగా తగిన విధంగా స్పందించాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

# స్వచ్ఛ వాయు సర్వేక్షణ-2026లో విజయవాడకు ఘన గుర్తింపు



విజయవాడ (చైతన్యరథం) : విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, వాయు కాలుష్య నియంత్రణ, పరిశుభ్రత కోసం చేపడుతున్న పలు కార్యక్రమాలకు జాతీయ స్థాయిలో ఘన గుర్తింపు లభించడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు వ్యాఖ్యానించారు. మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రి శాఖ ఆధ్వర్యంలో జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమం (NCAP)లో భాగంగా నిర్వహించిన స్వచ్ఛ వాయు సర్వేక్షణ-2026లో దేశవ్యాప్తంగా 130 నగరాల్లో విజయవాడ సత్తా చాటింది. 60వ డివిజన్ జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానాన్ని సాధించి, 200 మార్కులకు గాను 190 మార్కులు పొందింది. ఈ సందర్భంగా రూ.30 లక్షల నగదు బహుమతి లభించింది. న్యూఢిల్లీలోని పర్యావరణ భవన్‌లో జాతీయ స్వచ్ఛ వాయు దినోత్సవం సందర్భంగా ఈ అవార్డును అందజేశారు. అదేవిధంగా 31వ డివిజన్ రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించి, 200కి 200 మార్కులతో పూర్తి స్కోర్ సాధించింది. రాష్ట్ర స్థాయి అవార్డుగా రూ.15 లక్షల నగదు బహుమతి అందుకుంది. 60వ డివిజన్‌లో రీసైక్లింగ్ కేంద్రాలు, మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ (MRF), వ్యర్థాల శాస్త్రీయ వర్గీకరణ, నిర్మాణ వ్యర్థాలతో ఇటుకల తయారీ, విండ్రో కంపోస్టింగ్, దుమ్మురహిత రహదారుల అభివృద్ధి, మియావాకి మినీ ఫారెస్ట్, పచ్చదనం పెంపు, ఎలక్ట్రిక్ వాహనాల ప్రోత్సాహం వంటి కార్యక్రమాలు చేపట్టారు. 31వ డివిజన్‌లో సేంద్రియ వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణకు వర్మీ కంపోస్టింగ్, శ్మశానవాటికలో ఆధునిక కాలుష్య నియంత్రణ పరికరాలు, ఏలూరు కాలువ కట్ట వెంబడి పచ్చదనం అభివృద్ధి, ఎలక్ట్రిక్ వెహికల్ ఛార్జింగ్ స్టేషన్ తదితర కార్యక్రమాలను అమలు చేశారు. పరిశుభ్రమైన విజయవాడ – స్వచ్ఛమైన గాలి – ఆరోగ్యకరమైన ప్రజలే లక్ష్యంగా నగరపాలక సంస్థ చేపడుతున్న కార్యక్రమాలకు లభించిన ఈ గుర్తింపు విజయవాడ ప్రజలకు గర్వకారణమని అధికారులు పేర్కొన్నారు.

## నెల్లూరులో పాఠశాలలను ప్రారంభించనున్న మంత్రి లోకేష్

●వీఆర్ స్కూల్ కంటే మెరుగ్గా డీఎస్ఆర్, ఆర్ఎస్ఆర్ స్కూల్స్‌ను తీర్చిదిద్దుతాం

● మంత్రి నారాయణ నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం: షరణి



నెల్లూరు (చైతన్యరథం): నెల్లూరులోని మూలాపేట డీఎస్ఆర్, స్టోన్ హౌస్‌పేట ఆర్ఎస్ఆర్ పాఠశాలలను ప్రారంభించేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ నెల 16వ తేదీ రానున్న నేపథ్యంలో.. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ కుమార్తె పొంగూరు షరణి మంగళవారం ఈ పాఠశాలలను సందర్శించారు. పాఠశాల మైదానాలు, తరగతి గదులను పరిశీలించిన ఆమె, చదువుకుంటున్న విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థుల విద్యాభ్యాసం, మధ్యాహ్న భోజన నాణ్యతతో పాటు బీజ విద్యార్థులకు అందుతున్న శిక్షణ తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె స్వయంగా పిల్లలకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డించారు. అనంతరం షరణి మాట్లాడుతూ... గతంలో VR పాఠశాలను ఏ విధంగానైతే డెవలప్ చేశామో, అంతకంటే మెరుగ్గా డిఎస్ఆర్, ఆర్ఎస్ఆర్ పాఠశాలలను రినోవేట్ చేయాలని మా నాన్నగారు బాధ్యత అప్పగించారని తెలిపారు. లోకేష్ వచ్చే లోపే గ్రౌండ్ వర్క్ నుంచి క్లాస్ రూమ్‌ల వరకు అన్ని పనులను వేగవంతం చేస్తున్నామని, మౌలిక సదుపాయాలతో పాటు టీచర్ క్వాలిటీ, అకాడమిక్స్ పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. నెల్లూరు ప్రజలు నారాయణ గారిపై ఉంచిన నమ్మకాన్ని ఖచ్చితంగా నిలబెట్టుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 39,40డివిజన్ల క్లస్టర్ ఇన్‌ఛార్జ్ అన్నంగి ప్రసాద్ జనరల్ సెక్రటరీ మధుసూదన్, వైస్ ప్రెసిడెంట్ మురళీ మోహన్, నాయకులు దీనదయాల్, మురళీ, కృష్ణ సింగ్, విజయలక్ష్మి, రాజేష్, 8,10వ డివిజన్ క్లస్టర్ ఇన్‌చార్జ్ తిరుమల నాయుడు, కో-క్లస్టర్ ఇన్‌చార్జ్ హేమంత్, యూనిట్ ఇంచార్జి వెంకట్రావు, వైస్ ప్రెసిడెంట్ మల్లికార్జున, గయాజ్, శ్రీమన్నారాయణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వేమిరెడ్డి కుటుంబంపై బురదజల్లితే సహించం : కావలి టీడీపీ శ్రేణుల హెచ్చరిక

●నిరాధార ఆరోపణలు చేస్తే తగిన బుద్ధి చెబుతాం: అనిల్‌కుమార్‌కు కూటమి నేతల స్ట్రాంగ్ కౌంటర్



కావలి (చైతన్యరథం): నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలపై మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ చేస్తున్నవన్నీ పచ్చి నిరాధార ఆరోపణలని కావలి నియోజకవర్గ టీడీపీ నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కూటమి నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గతంలో వైఎస్సీపీ మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డిప్రసన్నకుమార్‌రెడ్డికి టీడీపీ మహిళా నేతలు సరైన రీతిలో బుద్ధి చెప్పడంతో ఆయన నియోజకవర్గం వదిలి పారిపోయారని, ఇప్పుడు అనిల్‌కుమార్ యాదవ్ తెరపైకి వచ్చి వేమిరెడ్డి కుటుంబం, వారి వ్యాపారాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో మంత్రి పదవిని అడ్డం పెట్టుకుని క్వార్ట్జ్ రాళ్ల దందాతో కోట్లు కొల్లగొట్టింది అనిల్ కాదా అని ప్రశ్నించారు. ఆ అక్రమ సంపాదన విషయాన్ని స్వయంగా ఆయనే గతంలో మీడియా ఎదుట ఒప్పుకున్న సంగతి ప్రజలు మర్చిపోలేదన్నారు. ప్రజల్లో విశేష ఆదరణ ఉన్న టీడీపీ నాయకత్వాన్ని దెబ్బతీయాలనే దురుద్దేశంతోనే ఈ కుట్రలకు తెరలేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు నిస్వార్థ సేవలందిస్తున్న సౌమ్యుడైన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిపై వ్యక్తిగత విమర్శలు చేయడం సిగ్గుచేటని హితవు పలికారు. "జగన్మోహన్‌రెడ్డి భిక్షతోనే విపిఆర్ ఎంపీ అయ్యారు" అని ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడటం విడ్డూరంగా ఉందని.. నాడు చంద్రబాబునాయుడి దయతో మంత్రి పదవి పొందిన విషయాన్ని ఆయన విస్మరించి, నేడు జగన్ కాళ్ల దగ్గర పడి ఉన్నారని ఎద్దేవా చేశారు. వేమిరెడ్డి తన రాజ్యసభ సభ్యత్వానికి స్వచ్ఛందంగా రాజీనామా చేసి, టీడీపీ తరపున నిలబడి ప్రజల ఆశీస్సులతో 2 లక్షల పైచిలుకు భారీ మెజార్టీతో ఎంపీగా గెలుపొందారని గుర్తుచేశారు. గతంలో నీటిపారుదల శాఖ మంత్రిగా ఉండి, అయ్యప్ప మాల వేసుకుని మరీ దేవుడిపై అబద్ధాలు చెప్పిన ఘనత అనిల్‌కుమార్‌దని విమర్శించారు. "తొందరెందుకు అనిల్.. భవిష్యత్తులో అన్నీ చూస్తావ్" అంటూ ఈ సందర్భంగా టీడీపీ నాయకులు గట్టి హెచ్చరికలు జారీ చేశారు.

## టీడీపీ నేత వెంకటరామిరెడ్డి మృతి... నేతల పరామర్శ

రొద్దం: రొద్దం మండలంలోని మేకల పల్లి గ్రామానికి చెందిన తెదేపా సీనియర్ నేత వెంకటరామిరెడ్డి గుండెపోటుతో మంగళవారం మృతి చెందారు. సమాచారం అందుకున్న మంత్రి సవిత, ఎంపీ బీకే పార్థసారథి గ్రామానికి చేరుకొని ఆయన భౌతికకాయానికి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## తిరుమలలో ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

● శాస్త్రోక్తంగా శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించిన అర్చకులు

●శ్రీవారికి నూతన పరదాలను సమర్పించిన టీటీడీ చైర్మన్ బి.ఆర్.నాయుడు



తిరుమల (చైతన్యరథం): కలియుగ వైకుంఠం తిరుమల గిరులు బ్రహ్మోత్సవాల శోభను సంతరించుకోనున్నాయి. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు శ్రీ వేంకటేశ్వరస్వామి వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 15వ తేదీ నుంచి అత్యంత వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఈ బ్రహ్మాండమైన ఉత్సవాలకు ముందస్తుగా, స్వామివారి సన్నిధిని పవిత్రం చేసే 'కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం' వేడుకను మంగళవారం నాడు టీటీడీ అధికారులు శాస్త్రోక్తంగా, కన్నుల పండువగా నిర్వహించారు. శ్రీవారి ఆలయం అంతటా ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లేలా ఈ శుద్ధి కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో చేపట్టారు. తిరుమల క్షేత్రంలో ఏటా నాలుగు ప్రధాన పర్వదినాలకు ముందు ఈ కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ. ఉగాది, ఆణివార ఆస్థానం, సాలకట్ల బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం రోజున మాత్రమే ఈ పవిత్ర కార్యక్రమాన్ని చేపడతారు. ఈ సంప్రదాయంలో భాగంగా రాబోయే బ్రహ్మోత్సవాలను దృష్టిలో ఉంచుకుని, ఆలయ యంత్రాంగం అత్యంత నిష్ఠతో ఈ శుద్ధి ప్రక్రియను పూర్తి చేసింది. ఈ పవిత్ర కార్యక్రమం సందర్భంగా శ్రీవారి ఆలయ గర్భగుడిలోని ఆనందనిలయం మొదలుకొని బంగారువాకిలి వరకు ప్రతి అంగుళాన్ని సుగంధ జలాలతో శుభ్రం చేశారు. ప్రధాన ఆలయం లోపల ఉన్న ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం మొత్తం, ప్రసాదాలు తయారయ్యే పోటు, గోడలు, పైకప్పుతో పాటు స్వామివారి సేవలో వినియోగించే పూజాసామగ్రిని స్వచ్ఛమైన నీటితో నిశితంగా కడిగారు. ఎక్కడా ఎలాంటి అపవిత్రత లేకుండా అడుగడుగునా శుద్ధి చేశారు. ఈ శుద్ధి ప్రక్రియ జరుగుతున్నంత సేపు స్వామివారి మూలవిరాట్టును ప్రత్యేకమైన వస్త్రంతో పూర్తిగా కప్పి ఉంచుతారు. నీటితో శుభ్రం చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర అరుదైన సుగంధ ద్రవ్యాలతో పవిత్రమైన పరిమళ జలాన్ని తయారు చేస్తారు. ఈ సువాసనలు వెదజల్లే జలాన్ని గర్భగుడితో సహా ఆలయమంతటా ప్రోక్షణం చేస్తారు. దీంతో ఆలయ పరిసరాలు మొత్తం దివ్యమైన పరిమళాలతో నిండిపోయాయి. ఆలయ శుద్ధి, పరిమళ జల ప్రోక్షణం పూర్తయిన వెంటనే స్వామివారి మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని అత్యంత భక్తితో తొలగిస్తారు. ఆ తరువాత వేద పండితులు, అర్చకులు మూలమూర్తికి ప్రత్యేక పూజలు, నైవేద్య సమర్పణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. ఈ ఆగమ విధులకు అదనపు ఈఓ వెంకయ్య చౌదరి హాజరై ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. సంప్రదాయ పూజలు ముగిసిన వెంటనే భక్తులకు స్వామివారి సర్వదర్శనం ప్రారంభించారు. కాగా, ఈ పవిత్ర కార్యక్రమం కారణంగా మంగళవారం ఉదయం జరగాల్సిన అష్టదళ పాద పద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది.

## చంద్రన్న తొలి ప్రాధాన్యత సంక్షేమానికే! : బొజ్జల బృందమ్మ



శ్రీకాళహస్తి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రగతికి అహర్నిశలూ శ్రమిస్తూనే, ప్రజల కష్టనష్టాలకు ఉపశమనం కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలకు రూపకల్పన చేసి, వాటిని ప్రజల చెంతకు చేర్చిన సియం చంద్రబాబునాయుడు తొలి ప్రాధాన్యత సంక్షేమానికే అని శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు, బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ కొనియాడారు.

**ఆపన్నులకు ఆసరాగా చంద్రబాబు సర్కార్**

అనుకోని ప్రమాదాలకు గురైన వారు, తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారు, శారీరక మరియు మానసిక వైకల్యం ఉన్న వారికి అవసరమైన వైద్యపరమైన చికిత్సకు ఆర్థికంగా తోడ్పాటు అందించే ముఖ్యమంత్రి సహాయనిధి ఒక సంజీవిని వలె ఉపయోగపడుతూ, లక్షలాది కుటుంబాలను ఆదుకుంటున్నదని, ఇది మానవీయ విలువలు కలిగిన చంద్రబాబునాయుడు ప్రభుత్వం చూపిస్తున్న ఉదారత అని కొనియాడారు. గత వైసీపీ పాలనాకాలంలో సియం రిలీఫ్ ఫండ్ మంజూరుకు ఎదురైన అవాంతరాలను అధిగమించి గత రెండు సంవత్సరాలుగా దరఖాస్తు చేసుకున్న ప్రజలందరికీ సియం రిలీఫ్ ఫండ్ క్రమం తప్పకుండా మంజూరు చేస్తున్నారని, ఇందులో భాగంగానే ఈరోజు శ్రీకాళహస్తి పట్టణంలోని పలువురు లబ్ధిదారులకు బొజ్జల బృందమ్మ స్వయంగా వారి ఇళ్ళ వద్దకు చెక్కులు అందజేసినారు.

**అభివృద్ధి సాధనతోనే సంక్షేమరాజ్య స్థాపన!**

జగన్ రెడ్డి యొక్క తుగ్లక్ నిర్ణయాల కారణంగా పడకేసిన అభివృద్ధిని గాడిలో పెట్టి, అటు ఉత్తరాంధ్ర నుండి రాయలసీమ వరకు పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టేలా చేసిన చంద్రబాబునాయుడు ప్రజా సంక్షేమం సాధించాలంటే అభివృద్ధితోనే సాధ్యమవుతుందని ఆచరణాత్మకంగా నిరూపించారని కొనియాడారు.

**ఎన్టీఆర్ భరోసా పింఛను - పేద ప్రజల సంజీవిని**

వివిధ రకాల సమస్యలతో బాధపడుతున్న పేద ప్రజలకు సంజీవినిలా నెలనెలా అందించే ఆర్థిక సాయమైన ఎన్టీఆర్ భరోసా పథకాన్ని ఇప్పటికే 62,00,000 లక్షల మందికి అందిస్తూ, రేపు నెల నుండి మరో మూడు లక్షల మంది అర్హులైన వారికి పింఛను అందించడానికి తగిన విధంగా దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించడం ద్వారా తమ ప్రభుత్వం సంక్షేమానికి ఇస్తున్న ప్రాధాన్యత ఏపాటిదో మరోసారి చంద్రబాబునాయుడు రుజువు చేసుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బొజ్జల బృందమ్మ, వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, తెలుగుదేశం పార్టీ శ్రీకాళహస్తి పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ నాయుడు, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్, శ్రీకాళహస్తి పట్టణ సహకార బ్యాంకు మాజీ ఛైర్మన్ డి.వి.నారాయణ, మాజీ కౌన్సిలర్ షేక్ మహబూబ్ బాషా, తిరుపతి పార్లమెంటు నాయకులు గాజుల భగత్, తుపాకుల ప్రసాద్, పూల శేఖర్, షేక్ ఖాదర్, నూర్ మొహమ్మద్, శంకరయ్య, విజయ, గగన్ యాదవ్, ఢిల్లీ బాబు, సుమతి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలోనే గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన

గోపవరం (చైతన్యరథం): కడప జిల్లాలోని గోపవరం మండలాన్ని తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా మారుస్తామని మండల టీడీపీ అధ్యక్షుడు మామిడి సుధాకర్‌రెడ్డి తెలిపారు. మండల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్ల వైసీపీ హయాంలో మండలంలోని గ్రామాల్లో ఎటువంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీలకు నిధులు కేటాయించి గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించిందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి అందుతున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో గోపవరం మండలంలోని అన్ని గ్రామాల్లో టీడీపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

# డీమార్ట్ తరహాలో ఏపీ ప్రభుత్వం మీ మార్ట్‌లు

ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో వేయి మీ మార్ట్‌లు ఏర్పాటు చేయనుంది. అక్టోబర్ ఒకటో తేదీ సీఎం నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా వీటిని ప్రారంభించనున్నారు. ఈ విషయాన్ని ఏపీ పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. డీ మార్ట్‌లకు పోటీగా.. అదే కాన్సెప్ట్ ఆధారంగా ఈ మీ మార్టులను తెస్తున్నామని.. వీటి ద్వారా తొలుత 64 సరుకులను ప్రజలకు అందుబాటులో ఉంచనున్నట్లు మంత్రి వివరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో డీ మార్ట్‌లకు పోటీగా.. అదే తరహాలో మీ మార్ట్‌లు ఏర్పాటు చేస్తోంది. తక్కువ ధరకే నాణ్యమైన సరుకులను అందించేందుకు నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా వేయి మీ మార్ట్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఇప్పటి వరకూ 870 షాపులు సిద్ధమయ్యాయని.. మరో 130 షాపులను కూడా వేగంగా పూర్తిచేసి.. అక్టోబర్ ఒకటో తేదీన సీఎం నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా వేయి మీ మార్ట్‌లను ప్రారంభించనున్నట్లు తెలిపారు. డీమార్ట్‌లతో పోటీ పడటానికి.. వాటి కాన్సెప్ట్‌తో డీ మార్ట్‌లకంటే తక్కువకే సరుకులు అందించేలా మీ మార్ట్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు నాదెండ్ల మనోహర్ వివరించారు. 64 సరుకులతో వీటిని ప్రారంభిస్తున్నామని.. ఆ తర్వాత మరిన్ని విస్తరిస్తామని నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.


మరోవైపు మీ మార్ట్ – నీది నాది మనందరిది' అనే నినాదంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేస్తోంది. మీ మార్ట్‌ల ద్వారా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలోనాణ్యమైన నిత్యావసర వస్తువులను.. మార్కెట్ కంటే తక్కువ ధరలకే ప్రజలకు అందించనున్నారు. మీ మార్ట్‌ల ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాల కిరాణా ఖర్చులను తగ్గించాలని.. నాణ్యమైన సరుకులను తక్కువ రేట్లకే అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మీ మార్టుల ద్వారా పౌరసరఫరాల శాఖ పర్యవేక్షణలో కల్తీ లేని, నాణ్యమైన సరుకులను అందిస్తారు. నూనెలు, బియ్యం, పప్పులు ఇతర నిత్యావసరాలను ఒకేచోట లభ్యమయ్యేలా చూస్తారు. మధ్యవర్తుల కమీషన్లను తగ్గించి.. ఆ లాభాన్ని డిస్కౌంట్ల ద్వారా వినియోగదారులకు చేరవేయనున్నారు. అలాగే ప్రభుత్వ నెట్‌వర్క్ ద్వారా మీ మార్ట్‌లను గ్రామ, పట్టణ స్థాయిలో అందుబాటులోకి తేనున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. మరోవైపు ఏపీ ప్రభుత్వం ఇప్పటికే నాణ్యమైన సన్నబియ్యాన్ని తక్కువ ధరలకే విక్రయిస్తున్న సంగతి తెలిసిందే. ఇందుకోసం ప్రత్యేకంగా విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

## కిలో ఉల్లి... 32 రూపాయలకే... మొబైల్ కేంద్రాల ద్వారా అందుబాటులోకి



అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. మార్కెట్లో ఉల్లిపాయ ధరలు పెరిగిన నేపథ్యంలో.. రాయితీపై ఉల్లిని అందించాలని నిర్ణయించింది. రైతు బజార్ల ద్వారా కిలో ఉల్లిని రూ.32లకే అందించనున్నారు. వచ్చే వారం నుంచి రాష్ట్రంలోని 115 రైతు బజార్లతో పాటుగా.. మొబైల్ కేంద్రాల ద్వారా ఉల్లిని రాయితీపై అందించనున్నట్లు ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. అలాగే రాయితీపై కందిపప్పును కూడా రేషన్‌తో పాటుగా అందిస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. మార్కెట్లో పెరుగుతున్న ఉల్లి ధరలు మధ్యతరగతి జీవికి కన్నీరు పెట్టిస్తున్నాయి. నెల రోజుల కిందటి వరకూ కిలో రూ.30కి కాస్త అటూఇటుగా ఉన్న ఉల్లి రేటు.. ప్రస్తుతం రెట్టింపు అయ్యింది. కిలో ఉల్లి రూ.60 నుంచి రూ.70 వరకూ పలుకుతోంది. ఈ నేపథ్యంలో మధ్యతరగతి జీవుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కిలో ఉల్లిపాయలను 32 రూపాయలకే అందించాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 115 రైతు బజార్ల ద్వారా వచ్చే వారం నుంచి ఉల్లిపాయల విక్రయాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. మొబైల్ కౌంటర్లు కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. మరోవైపు ఏపీలోని రేషన్ కార్డుదారులకు గత కొంతకాలంగా కందిపప్పు అందని సంగతి తెలిసిందే. మార్కెట్లో కందిపప్పు రేట్లు పెరగటంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో రేషన్‌తో పాటుగా కిలో కందిపప్పును రాయితీపై అందించనున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. బహిరంగ మార్కెట్లో ఉన్న కందిపప్పు రేటు కంటే 25శాతం నుంచి 30 శాతం తక్కువ ధరకు కందిపప్పు విక్రయించనున్నట్లు తెలిపారు. అయితే నాలుగైదు నెలలు మాత్రమే కందిపప్పు పంపిణీ చేయనున్నట్లు నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ఇక పీడీఎస్ బియ్యంలో 25 శాతం బదులుగా పది శాతం నూకలను పంపిణీ చేస్తామని తెలిపారు.

# ఏపీలో త్వరలోనే స్థానిక ఎన్నికలు ఓటర్ లిస్టులో పేరు చెక్ చేసుకోండిలా



ఏపీలో త్వరలోనే స్థానిక ఎన్నికలు జరగనున్నాయి. మరో రెండు, మూడు నెలల్లో స్థానిక ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా అందుకు అనుగుణంగా చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలోనే ఓటర్ల జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారిక పోర్టల్‌లో ప్రజలకు అందుబాటులో ఉంచారు. ప్రజలు ఈ పోర్టల్ సందర్శించి తమ వివరాలను నమోదు చేసి.. ఓటు ఉందో, లేదో తెలుసుకునే వీలుంది ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలోనే 2025 ఓటర్ల జాబితాతోనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో 2025 ఓటర్ల జాబితాను ఆంధ్రప్రదేశ్ ఎన్నికల సంఘం పోర్టల్‌లో ఉంచింది. ఈ పోర్టల్‌ను సందర్శించి ఓటరు జాబితాలో ఓటు ఉందో లేదో ఎలా తెలుసుకోవచ్చనేదీ ఇప్పుడు చూద్దాం....

ఏపీ స్థానిక సంస్థల ఎన్నికల ఓటరు జాబితాలో పేరు ఉందో లేదో తెలుసుకునేందుకు ముందుగా రాష్ట్ర ఎన్నికల సంఘం పోర్టల్ సందర్శించాల్సి ఉంటుంది. బ్రౌజర్‌లో https://sec-ems.ap.gov.in/apsec/ అని టైప్ చేసి క్లిక్ చేయాల్సి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం అనే పేజీ ఓపెన్ అవుతుంది. అందులో ఓటర్స్ పోర్టల్ అనే ఆప్షన్ ఎంచుకోవాల్సి ఉంటుంది. అనంతరం Search Your Name in Electoral Roll అనే ఆప్షన్ మీద క్లిక్ చేయాలి. అక్కడ Search by EPIC, Search BY Details అనే రెండు ఆప్షన్లు ఉంటాయి.

అందులో సెర్చ్ బై ఎపిక్ ఎంచుకోవాలి. ఆ తర్వాత రూరల్ లోకల్ బాడీస్, అర్బన్ లోకల్ బాడీస్ అనే రెండు విభాగాలు ఉంటాయి. అందులో మీరు ఉండే ప్రాంతాన్ని అనుసరించి ఎంపిక చేసుకుంటే.. మరో పేజీ ఓపెన్ అవుతుంది. అందులో మీ జిల్లా పేరు, మండలం పేరు ఎంచుకుని ఎపిక్ నంబర్ (ఓటరు కార్డు నంబర్) నమోదు చేసి సెర్చ్ ఆప్షన్ మీద క్లిక్ చేస్తే ఓటరు జాబితాలో మీ పేరు ఉంటే ఫోటో, పేరు, బూత్ నంబర్, సీరియల్ నంబర్ వంటి వివరాలు కనిపిస్తాయి. ఏపీ ప్రభుత్వం త్వరలోనే స్థానిక ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఈ విధానం ద్వారా మీ ఓటు ఉందో లేదో పరిశీలన చేసుకోవచ్చు. మరోవైపు ఈ అక్టోబర్, నవంబర్ లోగా స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. నిర్దేశిత సమయంలోగా ఎన్నికల ప్రక్రియ పూర్తిచేసి ఆర్థిక సంఘం నిధులు ఆగిపోకుండా చర్యలు చేపడుతోంది. ఇప్పటికే బీసీ రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ కూడా పూర్తి చేసింది.

# టీడీపీ లీడర్ షిప్ కాంక్లేవ్‌లో ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

**●పొలిటికల్ కమ్యునికేషన్‌పై చర్చ... ఎల్‌నినోపై అవగాహన**



రాప్తాడు (చైతన్యరథం): మంగళగిరి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన 2వ రోజు టీడీపీ లీడర్ షిప్ కాంక్లేవ్ కార్యక్రమంలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జిల్లాలోని ఎమ్మెల్యేలు, అధ్యక్షులు ఇతర ముఖ్య నాయకులతో కలిసి ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్ పాల్గొన్నారు. పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రజలకు మరింత చేరువగా పనిచేయడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు–అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లడం, క్షేత్రస్థాయిలో పార్టీని పటిష్టం చేయడం వంటి పలు ముఖ్యమైన అంశాలపై అధ్యక్షుడు చంద్రబాబు, నారా లోకేష్ దిశా నిర్దేశ్యం చేశారు. సుస్థిర అభివృద్ధి, ప్రజాసేవలు, సుపరిపాలన, పొలిటికల్ కమ్యునికేషన్‌పై చర్చ – ఎల్ నినోపై అవగాహన, స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధతపై చర్చించారు. అధినేత చంద్రబాబు నాయకత్వ సామర్థ్యం పెంపుపై దిశానిర్దేశం చేశారు. అలాగే సమష్టి కార్యాచరణపై సూచనలు చేశారు.

# అనంతపురంలో భారీ సౌర విద్యుత్ ప్రాజెక్టు 18 నెలల్లో ప్రారంభం



ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాలో, బ్రూక్‌ఫీల్డ్, యాక్సిస్ ఎనర్జీల సంయుక్త సంస్థ అయిన ఎవ్రెన్ అభివృద్ధి చేస్తున్న 552 మెగావాట్ పీక్(MWp) యుటిలిటీ–స్కేల్ సౌర విద్యుత్ ప్రాజెక్టుకు సంబంధించిన ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) కాంట్రాక్టును యాక్సిస్ ఎనర్జీ దక్కించుకుంది. రాబోయే 18 నెలల్లో ఈ ప్రాజెక్టును ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇది యాక్సిస్ ఎనర్జీ యొక్క స్వచ్ఛ ఇంధన ప్రాజెక్టుల విస్తరణలో ఒక ముఖ్యమైన భాగంగా నిలవడంతో పాటుగా ఎవ్రెన్‌తో దాని వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుంది. ఈ సోలార్ ప్రాజెక్టు 400 మెగావాట్ల పవన–సౌర హైబ్రిడ్ పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులో భాగంగా ఉంది. ఇందులో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ (BESS)ను అనుసంధానించి, రాష్ట్ర విద్యుత్ గ్రిడ్‌కు అనుసంధానం చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్ యొక్క గరిష్ట విద్యుత్ డిమాండ్‌ను తీర్చటానికి అనుగుణంగా రూపొందించబడిన ఈ ప్రాజెక్ట్, గరిష్ట వినియోగ సమయాల్లో పునరుత్పాదక విద్యుత్‌ను అందిస్తుంది. ఇది గ్రిడ్ విశ్వసనీయతను పెంచుతూ, రాష్ట్ర స్వచ్ఛ ఇంధన లక్ష్యాలకు మద్దతు ఇస్తుంది. ఈ ప్రాజెక్ట్‌లోని 640.5 మెగావాట్ల పవన విద్యుత్ విభాగానికి సంబంధించిన ఈపీసీ (EPC) పనులను కూడా యాక్సిస్ ఎనర్జీ చేపడుతోంది, ప్రస్తుతం నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

## కొత్తగా పింఛన్ అప్లై చేసుకునేవారికి గుడ్ న్యూస్..

**● అక్టోబర్ 1 నాటికి కొత్త కార్డుదారులకు మొదటి విడత సొమ్ము**



ఆంధ్రప్రదేశ్‌లో అర్హులైన పేదలకు పింఛన్లు అందించే ప్రక్రియ మరింత సులభతరమైంది. ఎన్టీఆర్ భరోసా కింద కొత్తగా దరఖాస్తు చేసుకునేవారికి ఎదురవుతున్న పెద్ద అడ్డంకిని తొలగిస్తూ ప్రభుత్వం తాజా ఆదేశాలు ఇచ్చింది. ఇప్పటివరకు నగరాలు, పట్టణాల్లో నివసించేవారు దరఖాస్తు చేయాలంటే ఇంటి పన్ను అసెస్‌మెంట్ రశీదు తప్పనిసరిగా జతచేయాల్సి వచ్చేది. సొంత ఇల్లు లేనివారు, అద్దె ఇళ్లలో ఉండేవారు ఈ నిబంధన వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. క్షేత్రస్థాయి నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌తో స్పందించిన యంత్రాంగం, వెబ్‌సైట్‌లో ఈ షరతును తొలగించింది. రేపటి నుంచి ఈ ఆంక్షలు లేకుండానే నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు.

### పోటెత్తిన దరఖాస్తులు

దరఖాస్తులు మొదలైన తొలిరోజే రికార్డు స్థాయిలో దాదాపు 75 వేల మంది సచివాలయాలకు పోటెత్తారు. రద్దీ వల్ల సర్వర్లు మొరాయించినా అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. దరఖాస్తుల దాఖలుకు ఈ నెల 14వ తేదీ వరకు అవకాశం కల్పించారు. వచ్చిన అప్లికేషన్లను 20 రోజుల్లోగా క్షేత్రస్థాయిలో విచారించి.. అక్టోబర్ 1 నాటికి కొత్త కార్డుదారులకు మొదటి విడత సొమ్మును చేతికి అందించాలని ఆదేశాలు వెళ్లాయి.

### ఆధార్ ఈ-కేవైసీకి గ్రీన్ సిగ్నల్

మరోవైపు సంక్షేమ పథకాల్లో బోగస్ లబ్ధిదారులను ఏరివేసేందుకు ఆధార్ ఈకేవైసీ విధానాన్ని చట్టబద్ధం చేస్తూ ప్రభుత్వం ప్రత్యేక గెజిట్ విడుదల చేసింది. సచివాలయాలు, మీ సేవ, సదరం క్యాంపులలో బయోమెట్రిక్ ఆధారిత సేవల నిర్వహణకు సంబంధించి కేంద్ర నిబంధనల ప్రకారం రాష్ట్రం పూర్తి వివరణలను అధికారికంగా వెల్లడించింది. దీనివల్ల అర్హులైన వారికే నేరుగా ప్రభుత్వ ప్రయోజనాలు దక్కనున్నాయి.



# గురువుల సేవలు అమూల్యం

### తానా-పాఠశాల ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

### విద్యావేత్త వెంకట్రావుకు ఘన సత్కారం

**యూఎస్ఏ:** అమెరికా రాజధాని వేదికగా తానా-పాఠశాల ఆధ్వర్యంలో ప్రవాస భారతీయుల సమక్షంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఆచార్యులు, విద్యావేత్త మూల్పూరి వెంకట్రావుని ముఖ్య అతిథిగా ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమాన్ని పాఠశాల అధ్యక్షుడు భానుప్రకాష్ మాగులూరి సమన్వయపరిచారు. భారతదేశ రెండవ రాష్ట్రపతి, గొప్ప తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజును మననం చేసుకుంటూ ఆయనకు ఘన నివాళులర్పించారు. సమాజ పురోగతికి పునాది అయిన అక్షర జ్ఞానం, విజ్ఞానం అందిస్తూ దిశానిర్దేశం చేస్తూ విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు చేసే నిస్వార్థ సేవలను, వారి కృషిని గుర్తించి గౌరవించుకోవడం సమాజాన్ని సంస్కరించుకోవటమే అని వెంకట్రావు అన్నారు. మాతృ భూమి, మాతృ భాష మన మూలాలుగా... తరాలు మారుతున్నా, విజ్ఞాన మాధ్యమాలు మారుతున్నా విజ్ఞానం అందించే గురు స్థానం శాశ్వతంగా పదిలమని అది మన సంస్కృతిలో భాగమని భానుప్రకాష్ అన్నారు. ప్రవాస భారతీయ పెద్దలు మాట్లాడుతూ గురు పరంపర మన ఘన చరిత్ర అని, తల్లిదండ్రుల తర్వాత మన ఉన్నతి, అభ్యున్నతిని తనను మించి తన శిష్యుడు ఎదగాలని కాంక్షించే నిస్వార్థ భావం ఒక్క గురువుకే సాధ్యమన్నారు. అందుకే భారతీయ ధర్మంలో ఆచార్య దేవోభవ అని కీర్తిస్తూ గురుస్థానాన్ని శిఖరాగ్రాన నిలబెట్టారన్నారు. ప్రవాస పెద్దలందరూ కలిసి ప్రొఫెసర్ వెంకట్రావును సన్మానించి అభినందించారు.

# ఉల్లాసంగా... ఉత్సాహంగా...

### అట్లాంటాలో ఘనంగా జీఎంసీ, ఎస్ఎంసీ, ఆర్ఎంసీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం






**అట్లాంటా:** తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ వైద్య కళాశాలలైన గుంటూరు మెడికల్ కాలేజీ, సిద్ధార్థ మెడికల్ కాలేజీ, రంగరాయ మెడికల్ కాలేజీ ఉత్తర అమెరికా పూర్వ విద్యార్థుల 19వ ద్వివార్షిక ఆత్మీయ సమ్మేళనం అట్లాంటా వేదికగా ఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో అమెరికా, యూకే ప్రాంతాల వైద్యులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆనందక్షణాలను పంచుకున్నారు. జీఎంసీఏఎన్ఏ అధ్యక్షుడు డాక్టర్ రామకోటేశ్వరరావు, కన్వీనర్ డాక్టర్ శివ సుధాకర్, ఆర్ఎంసీఏఎన్ఏ అధ్యక్షురాలు డాక్టర్ అనూష, కన్వీనర్ డాక్టర్ కృష్ణకాంత్, ఎస్ఎంసీఏఎన్ఏ అధ్యక్షురాలు డాక్టర్ సంయుక్త, కన్వీనర్ డాక్టర్ శ్రీదేవి మార్గదర్శకత్వంలో కార్యక్రమం విజయవంతంగా సాగింది.

శ్రేయ లక్ష్మి కోడెల భక్తిగీతంతో ప్రారంభమైన వేడుకలో శివ గ్రూప్ డ్యాన్స్, జ్యోత్స్న నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గాయకులు అంజనా సౌమ్య, వాహిని, రాము దుర్వాసుల, ఆళ్ల శ్రీనివాసులు రెడ్డి ఆలపించిన పాటలు శ్రోతలను మంత్రముగ్ధులను చేశాయి. రాజమహేంద్రవరానికి చెందిన డాక్టర్ విజయ్‌భాస్కర్ ప్రదర్శించిన 'అన్నమయ్య' రూపకం, ఆరోగ్య సంరక్షణపై డాక్టర్ మోహన్ కిశోర్ ప్రదర్శించిన విశ్లేషణాత్మక స్కిట్ ఆలోజింపజేశాయి. అమెరికన్ మెడికల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ బాబీ ముక్కామల కీలక ప్రసంగం చేశారు. ఆర్ఎంసీఏఎన్ఏ మాజీ అధ్యక్షుడు డాక్టర్ సుబ్బారాయ చౌదరి మాతా-శిశు ఆసుపత్రి ప్రాజెక్టు ప్రాముఖ్యతపై ప్రజెంటేషన్ ఇచ్చారు. జీఎంసీ 1986 బ్యాచ్ వైద్యులు వైద్య కళాశాలలో చేరి 40ఏళ్లు పూర్తయిన సందర్భంగా తమ రూబీ ఆత్మీయ సమావేశాన్ని జరుపుకుని జీఎంసీఏఎన్ఏ ప్రాజెక్టుల కోసం 40వేల డాలర్లను విరాళంగా ప్రకటించారు.

వైద్య రంగానికి సంబంధించిన అత్యాధునిక అంశాలపై దాదాపు నాలుగు గంటల పాటు 'కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్' (CME) చర్చ జరిగింది. GMCANA ఫ్యూచర్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ రామన్ దామినేని, RMCANA ఫ్యూచర్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ శ్రీనివాస్ బసవయ్య గోకరకొండ, SMCANA ఫ్యూచర్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ దివాకర్ వి.లింగం ఎన్నికయ్యారు. వీరంతా ఈ పదవిలో రెండేళ్లు కొనసాగుతారు. డాలస్‌కు చెందిన అమర్ కార్యక్రమాలను పర్యవేక్షించగా డాలస్‌లోని మైత్రి రెస్టారెంట్ రుచికరమైన కేటరింగ్ ఏర్పాట్లు చేసింది. ఆటపాటలు, యోగా, పికిల్‌బాల్, గోల్ఫ్ వంటి క్రీడాంశాలతో వేడుకలు కోలాహలంగా ముగిశాయి.





# టోక్యోలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి

### రాధ, చిన్ని కృష్ణుడు వేషధారణలతో ఆకట్టుకున్న చిన్నారులు

**టోక్యో:** జపాన్‌లోని తెలుగు సమాజానికి అండగా నిలుస్తున్న తెలుగు అసోసియేషన్ ఆఫ్ జపాన్ (TAJ) ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. టోక్యోలోని ఓజిమా ప్రాంతంలో అత్యంత భక్తిశ్రద్ధలతో ఈ వేడుకలు జరిపారు. తెలుగు కుటుంబాలతో పాటు జపనీయులు కూడా ఉత్సాహంగా పాల్గొని భారతీయ ఆధ్యాత్మికత, సంస్కృతి, సంప్రదాయాలను ఆసక్తిగా వీక్షించారు. శ్రీకృష్ణుడి జన్మదినాన్ని పురస్కరించుకుని తాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, భజనలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా "ఎక్కడ ఉన్నా మన సంస్కృతి మనతోనే" అని తెలుగు కుటుంబాలు చాటాయి. చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ వేషధారణలతో అందరినీ ఆకట్టుకున్నారు. జపాన్‌లోని తెలుగు కుటుంబాలు తమ పిల్లలకు భారతీయ సంస్కృతి, ఆచారాలు, సంప్రదాయాలను పరిచయం చేస్తూనే.. స్థానికులతో సాంస్కృతిక అనుబంధాలను పెంపొందించేలా కార్యక్రమాన్ని



నిర్వహించారు. భారతదేశానికి వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న టోక్యోలో తెలుగు సంస్కృతి, భారతీయ సంప్రదాయాలు, జపాన్ స్థానికుల భాగస్వామ్యం, భక్తి, సమాజ ఐక్యత కలగలిసి వేడుకలకు ప్రత్యేక శోభను తీసుకొచ్చాయి. ఇందులో పాల్గొన్న కుటుంబాలు, చిన్నారులు, తాజ్ సభ్యులు, జపాన్ స్థానికులు పరస్పరం శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అనంతరం అందరికీ ప్రసాద వితరణ నిర్వహించారు. జపాన్‌లో భారతీయ, తెలుగు సంస్కృతిని కొనసాగిస్తూ.. జపాన్ సమాజంతో స్నేహపూర్వక సాంస్కృతిక వారధి నిర్మించడంలో 'తాజ్' కీలక పాత్ర పోషిస్తోందని నిర్వాహకులు తెలిపారు. భారతీయులు, జపనీయులు కలిసి శ్రీకృష్ణ జన్మాష్టమిలో పాల్గొనడం రెండు దేశాల మధ్య స్నేహం, సాంస్కృతికంగా పరస్పర అవగాహనకు ప్రతీకగా నిలిచింది.





# 'శ్రీవారి వైద్య సేవ'లో భక్తులకు సేవలందించండి

### ఎన్నారై వైద్యులకు టీటీడీ బోర్డు సభ్యుడు సదాశివరావు పిలుపు

**అట్లాంటా:** ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ వైద్య కళాశాలలైన విజయవాడ సిద్ధార్థ మెడికల్ కాలేజ్, కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజ్, గుంటూరు మెడికల్ కాలేజ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం అమెరికాలోని అట్లాంటా నగరంలో ఘనంగా జరిగింది. ఆయా కళాశాలల పూర్వ విద్యార్థులు, పలువురు అంతర్జాతీయ సూపర్ స్పెషాలిటీ వైద్యులు సహా వెయ్యి మందికి పైగా హాజరయ్యారు.




ఈ సందర్భంగా టీటీడీ బోర్డు సభ్యుడు నన్నపనేని సదాశివరావు... పాలక మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'శ్రీవారి వైద్య సేవ' కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. తిరుమలలోని స్విమ్స్, బర్డ్, అశ్విని హాస్పిటల్, పద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ హాస్పిటల్, ఎస్వీ ఆయుర్వేద ఆసుపత్రి, ఎస్వీ గోసంరక్షణశాల తదితర సంస్థల్లో భక్తులకు నిస్వార్థంగా వైద్య సేవలు అందించేందుకు ముందుకు రావాలని అమెరికాలోని ప్రముఖ వైద్యులను కోరారు. తాము స్వదేశానికి వచ్చినప్పుడు తప్పనిసరిగా తిరుమల 'శ్రీవారి వైద్య సేవ'లో పాల్గొని భక్తులకు తమ వంతు సేవలు అందిస్తామని పలువురు ఎన్నారై వైద్యులు హామీ ఇచ్చారు. ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు ఆశయాల మేరకు భక్తులకు స్వచ్ఛందంగా వైద్య సేవలు అందించేందుకు 'శ్రీవారి వైద్య సేవ' కార్యక్రమాన్ని టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర జూన్ 5న ట్రయల్ రన్‌గా ప్రారంభించారని సదాశివరావు గుర్తు చేశారు. ఇప్పటికే అనేక మంది వైద్యులు ఇందులో భాగస్వాములై భక్తులకు సేవలు అందిస్తున్నారని తెలిపారు. దేశ, విదేశాల్లో ఉన్న ప్రముఖ వైద్య నిపుణులను కూడా భాగస్వాములు చేసి భక్తులకు మరింత మెరుగైన వైద్యం అందించేందుకు టీటీడీ నిరంతరం కృషి చేస్తోందని ఆయన వివరించారు.



## పట్టాలపైకి తొలి బుల్లెట్ కోచ్

**2027లో సూరత్-బిలిమోరా సర్వీసుతో మొదలుకానున్న భారత హైస్పీడ్ యుగం**

దేశంలో పరుగులు పెట్టేందుకు మొదటి బుల్లెట్ రైలు సిద్ధమవుతోందని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. భారతదేశపు మొట్టమొదటి హై-స్పీడ్ రైలు ప్రాజెక్ట్ ముంబయి-అహ్మదాబాద్ హై-స్పీడ్ రైల్ కారిడార్ పనులు వేగంగా కొనసాగుతున్నాయన్నారు. రాబోయే కొద్ది నెలల్లో ఈ ప్రాజెక్టు నిర్మాణం కీలకమైన మైలురాయిని చేరుకోవచ్చని తెలిపారు. 2027లో సూరత్-బిలిమోరా స్టేషన్ల మధ్య బుల్లెట్ రైలు సేవలను ప్రారంభించనున్నట్లు మంత్రి ప్రకటించారు. 508 కిలోమీటర్ల మేర ఉన్న ముంబయి-అహ్మదాబాద్ కారిడార్లో ఈ సెక్షనే తొలుత ప్రజలకు అందుబాటులోకి వస్తుందన్నారు. వాపి-సూరత్ విభాగంలో హైస్పీడ్ కారిడార్ పనులు డిసెంబర్ 2026 నాటికి పూర్తి అవుతాయని అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. బుల్లెట్ రైలులోని మొదటి కోచ్ ఇప్పటికే తయారైందని, వచ్చే ఏడాది మే నెలలో ట్రయల్ రన్ కోసం దీన్ని పట్టాలపైకి తీసుకురానున్నట్లు కేంద్రమంత్రి తెలిపారు. హైస్పీడ్ కారిడార్లోని కీలక విభాగాలలో నిర్మాణాలు కొనసాగుతున్నట్లు చెప్పారు.

**ముంబయి-అహ్మదాబాద్ బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్..**

ముంబయి-అహ్మదాబాద్ హై-స్పీడ్ రైల్ కారిడార్ మహారాష్ట్ర, గుజరాత్, కేంద్రపాలిత ప్రాంతమైన దాద్రానగర్ హవేలీ మీదుగా వెళ్తుంది. ముంబయి-అహ్మదాబాద్ మధ్య ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గించడానికి దీనిని రూపొందిస్తున్నారు. ఈ కారిడార్లో తొలి హై-స్పీడ్ రైలు సర్వీసు 2027 ఆగస్టులో ప్రారంభం కానుంది. పూర్తి కారిడార్ను అందుబాటులోకి తీసుకురావడానికి ముందే.. సూరత్-బిలిమోరా విభాగాన్ని ప్రారంభించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది.

## సామూహిక అత్యాచారానికి ఉరిశిక్ష

**నాలుగేళ్ల నాటి కేసులో ఒకరికి మరణదండన, మరో ఇద్దరికి జైలు శిక్ష**




తమిళనాడులోని తిరునెల్వేలిలో ఓ మైనర్పై జరిగిన సామూహిక అత్యాచారం కేసులో పోక్సో ప్రత్యేక కోర్టు కీలక తీర్పు వెలువరించింది. నాలుగేళ్ల క్రితం జరిగిన ఈ కేసులో ఒక నిందితుడికి న్యాయస్థానం మరణశిక్ష విధించింది. మరో ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. వివరాల్లోకి వెళితే.. తిరునెల్వేలికి చెందిన 16 ఏళ్ల బాధితురాలికి 2022లో పెయింటర్గా పనిచేసే 25 ఏళ్ల మునీశ్వరన్ పరిచయమయ్యాడు. రెండు వారాలపాటు వీరిద్దరూ ఫోన్లో మాట్లాడుకున్నారు. తర్వాత పెళ్లిచేసుకుంటానని నమ్మించి మునీశ్వరన్ ఆ బాలికను మీనాక్షిపురం తీసుకెళ్లాడు. అక్కడ తన స్నేహితులు చిన్నకుట్టి, మురుగేశన్తో కలిసి బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం ఈ విషయాన్ని బాధితురాలు తన కుటుంబసభ్యులకు చెప్పడంతో వారు పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. దీనిపై విచారణ జరిపిన ప్రత్యేక న్యాయస్థానం.. మంగళవారం తీర్పు వెలువరించింది. చిన్నకుట్టికి మరణశిక్ష విధించిన కోర్టు.. మురుగేశన్కు 20 ఏళ్ల జైలు, మునీశ్వరన్కు 13 ఏళ్ల జైలు శిక్ష విధించింది.

# సత్యమే యువత మార్గం

**రాహుల్ 'ఛాత్రోం కి గూంజ'పై మోదీ పరోక్ష విమర్శలు**

**వడోదరలో అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభం**



యువత ఆకాంక్షలు, గళం.. విపక్షాల అబద్ధాలను అధిగమిస్తాయని ప్రధాని మోదీ అన్నారు. తప్పుదోవ పట్టించాలని చూసేవారు మన ప్రయాణంలో ప్రతి మలుపు వద్దా కనిపిస్తారని, కానీ భారత యువత సత్యాన్నే అనుసరిస్తుందని చెప్పారు. దేశ భవిష్యత్తును వారే నిర్ణయిస్తారని పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ 'ఛత్రోం కి గూంజ్' (విద్యార్థుల ప్రతిధ్వని) పేరిట విద్యార్థులతో మాట్లాడుతోన్న సంగతి తెలిసిందే. దానిని ఉద్దేశించే మోదీ విమర్శలు చేశారు. గుజరాత్లోని వడోదరలో 'నమో ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. "దేశంలో ప్రభుత్వాల పని సంస్కృతిలో వచ్చిన మార్పునకు వెస్టర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ ఒక ఉదాహరణ. దానికి సంబంధించి చివరి దశకూడా పూర్తయింది. 2004లో ఈ ప్రాజెక్టును ప్రతిపాదించారు. దీని అమలు కోసం 2006లో ఒక సంస్థను ఏర్పాటు చేశారు. 2014 వరకు దానికి సంబంధించిన ఫైళ్లు అక్కడక్కడే తిరిగాయి" అని యూపీఏ పాలనపై మోదీ ధ్వజమెత్తారు. 10 ఏళ్లలో వారు 50వేల టాయిలెట్లు కూడా కట్టించలేదని, తాము మాత్రం 50వేల రైలు కోచ్లను నిర్మించామని వెల్లడించారు.

అనంతరం యువత గురించి మాట్లాడిన ప్రధాని.. ఏఐ యుగానికి అంతా సిద్ధంగా ఉండాలన్నారు. ఏఐ నైపుణ్యాలు ఐటీ రంగానికి మాత్రమే పరిమితం కాకూడదని సూచించారు. అలాగే రూఫ్టాప్ సోలార్ విస్తరణ గురించి ప్రస్తావించారు. "ఇప్పుడు ఎన్నో కుటుంబాలు ఎలక్ట్రిసిటీ ఉత్పత్తిదారులుగా మారిపోయాయి. సౌర ఉత్పత్తి, అమర్చడం, సర్వీస్ విస్తరించడంతో యువతకు ఉపాధి అవకాశాలు పెరిగాయి" అని పేర్కొన్నారు. ఇప్పుడు దేశం చిప్స్ నుంచి షిప్స్ వరకూ తయారీ రంగంలో కొత్త చరిత్ర లిఖిస్తోందన్నారు.

**ధురంధర్ పాటతో మోదీకి స్వాగతం..**

'నమో ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో భాగంగా మోదీ వస్తుండగా.. వేదికపైన ధురంధర్, క్వీన్ చిత్రాల్లోని పాటలు వినిపించాయి. యువత నినాదాల మధ్య ప్రధానిని ఘనంగా స్వాగతించారు.

# బ్రిక్స్‌కు ముందు మోదీ-పుతిన్ చర్చలు

**అణు సహకారం, వాణిజ్యంపై దృష్టి**

**ఉక్రెయిన్ మధ్యవర్తిత్వానికి రష్యా అంగీకారం**



ప్రధాని నరేంద్ర మోదీ సెప్టెంబర్ 11న రష్యా అధ్యక్షుడు పుతిన్తో భేటీ కానున్నారు. ఈ నెల 12-13 తేదీలలో దిల్లీలో భారత్ అధ్యక్షతన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం జరగనున్న విషయం తెలిసిందే. ఆ సమావేశానికి ముందు ఇరువురు దేశాధినేతలు ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొననున్నట్లు రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ అధికార ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ వెల్లడించారు. భారత్ తమకు వ్యూహాత్మక భాగస్వామి అని.. ఇరుదేశాల మధ్య భద్రత, అంతరిక్షం, ఇంధనం, రవాణా, సైన్స్ అండ్ టెక్నాలజీ సహా పలు రంగాలలో సహకారం విస్తరిస్తోందన్నారు. ఇరుదేశాల నేతలు ద్వైపాక్షిక సమావేశంలో వాణిజ్యం, ఆర్థిక సంబంధాలకు పెద్దపీట వేయనున్నారని డిమిత్రి పేర్కొన్నారు. ఉక్రెయిన్తో యుద్ధం, గల్ఫ్ ఉద్రిక్తతలు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావవంటి విషయాలపైనా చర్చలు జరిపే అవకాశం ఉందన్నారు. రష్యా-ఉక్రెయిన్ సంక్షోభాన్ని పరిష్కరించడంలో భారత్ మధ్యవర్తిత్వం వహించడం తమకు అంగీకారమేనని తెలిపారు. యుద్ధాన్ని ముగించడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సైతం తీవ్రంగా కృషి చేస్తున్నారన్నారు. ఉక్రెయిన్తో చర్చలు తిరిగి ప్రారంభించడానికి అమెరికా చర్యలు తీసుకుంటోందన్నారు.

**బ్రిక్స్ ఇప్పుడు ఒక భారీ కూటమి..**

బ్రిక్స్ కేవలం ఒక సాధారణ సంస్థ మాత్రమే కాదని.. అదొక ప్రధాన ప్రపంచ కూటమి అని డిమిత్రి అభివర్ణించారు. ఈ కూటమి మరింత విస్తరించాలని రష్యా కోరుకుంటోందన్నారు. బ్రిక్స్ సమావేశాల్లో మరిన్ని దేశాలు పాల్గొంటే బాగుంటుందని.. ఇతర దేశాలను ఆహ్వానించడానికి తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు.

**భారత్ అణు సహకారంపై దృష్టి..**

రష్యా-భారత్ సహకారంలో అణు శక్తి ఒక కీలక రంగమని డిమిత్రి పేర్కొన్నారు. 'అణు రంగంలో రష్యా ప్రపంచ అగ్రగామిగా ఉంది. ప్రపంచంలోని అన్ని దేశాల కంటే మేమే ఎక్కువ అణు విద్యుత్ కేంద్రాలను నిర్మిస్తున్నాం. భారత్లో కుడంకుళం ప్రాజెక్ట్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. భారత్లో నిర్మించబోయే మరో కొత్త ప్లాంటుకు సంబంధించి చర్చలు జరుగుతున్నాయి" అని పేర్కొన్నారు.

## మోదీ సభకు ముందు నకిలీ గుర్తింపుతో చొరబాటు యత్నం

**- పీఎంవో అధికారి ముసుగులో వ్యక్తి అరెస్టు, తుపాకీ స్వాధీనం**



ప్రధాని నరేంద్ మోదీ ముంబై పర్యటనకు కొన్ని గంటల ముందే కలకలం రేగింది. ప్రధాని సభా ప్రాంగణంలో భద్రతా వైఫల్యం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనలో ఇద్దరు ఒక అధికారి, అతడి బాడీగార్డ్ను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రధాన మంత్రి కార్యాలయం అధికారిగా ఫోర్జరీ ఐడీ కార్డు కలిగిన వ్యక్తిని, అతడి బాడీగార్డ్ను అదుపులోకి తీసుకున్నారు. బాంద్రా కుర్లా కాంప్లెక్స్లోని నీతా ముకేశ్ అంబానీ కల్చరల్ సెంటర్లో వీరు అనుమానాస్పదంగా సంచరించడంతో పోలీసులు తనిఖీ చేశారు. దాంతో ఇద్దరూ దొరికిపోయారు. వీరినుంచి ఒక తుపాకీ స్వాధీనం చేసుకున్నారు. ముంబైలోని జియో వరల్డ్ సెంటర్లో ప్రధాని నరేంద్ర మోదీ సభ ఆరంభానికి భద్రతా వైఫల్యం నెలకొంది. ఫిన్టెక్ ఫెస్ట్ 2026 ఆవిష్కరణకు ప్రధాని రాక నేపథ్యంలో ఇద్దరు వ్యక్తులు నకిలీ గుర్తింపు కార్డులతో సభా ప్రాంగణంలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. బాంద్రా కుర్లా కాంప్లెక్స్లోని నీతా ముకేశ్ అంబానీ కల్చరల్ సెంటర్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వీరిని తనిఖీ చేసిన పోలీసులు అనంతరం.. అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన మంత్రి కార్యాలయం అధికారిగా నకిలీ ఐడీ కార్డు కలిగిన వ్యక్తిని రోషన్ పరేఖ్గా గుర్తించారు. అతడి బాడీగార్డ్ నుంచి తుపాకీని స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. ఉన్నత స్థాయి భద్రత ఉన్నప్పటికీ వీరిద్దరు నకిలీ ఐడీ కార్డులతో అంత దూరం ఎలా రాగలిగారు? అనే కోణంలో ముంబై నేర విభాగం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## 5 లక్షల మంది విద్యార్థులకు డిజిటల్ బూస్ట్

**ట్యాబ్లతోపాటు ఇంటర్నెట్ సదుపాయం కల్పించే దిశగా హరియాణా ప్రభుత్వ నిర్ణయం**

విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను అందించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైని అన్నారు. ప్రస్తుతం మార్కెట్కు అనుగుణంగా వారంతా నైపుణ్యాలు నేర్చుకోవాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల కోసం 5 లక్షల సిమ్ కార్డుల కొనుగోలుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని వెల్లడించారు. ఈ మేరకు ఉన్నతస్థాయి కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ-లెర్నింగ్లో భాగంగా ఈ ఏడాది 10 నుంచి 12 తరగతి చదివే విద్యార్థుల్లో 5 లక్షల మందికి ట్యాబ్లు పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. వీటికి ఇంటర్నెట్ సదుపాయం కల్పించేందుకు సిమ్ కార్డులు కొనుగోలు చేయాలని తాజాగా నిర్ణయించింది. తద్వారా విద్యార్థులు ఆన్లైన్లో స్టడీ మెటీరియల్తోపాటు ఇతర విద్యా సంబంధిత సోర్సుల నుంచి కొత్త నైపుణ్యాలను నేర్చుకునే వీలుంటుందని హరియాణా ప్రభుత్వం భావిస్తోంది.

# సముద్రంపైనా, గాల్లోనూ మంటలు!



**జైలుపై సౌదీ దాడికి ప్రతీకారంగా విరుచుకపడిన హూతీలు**

**ఎర్ర సముద్రంలో దిగ్బంధన ప్రకటన**

సౌదీ అరేబియా-హూతీల మధ్య పోరు తీవ్ర రూపం దాల్చింది. మంగళవారం తెల్లవారుజామున సౌదీపై హూతీలు జరిపిన దాడుల్లో 73మంది గాయపడ్డారు. అంతకుముందు రోజు యెమెన్‌లోని జైలుపై సౌదీ వైమానిక దాడి చేసిందని హూతీలు ఆరోపించారు. హల్మ్ నగరంలోని సెంట్రల్ కరెక్టివ్ ఫెసిలిటీపై సౌదీ చేసిన దాడిలో ఓ చిన్నారి సహా ఏడుగురు మృతి చెందారని హూతీల ఆరోగ్యశాఖ ప్రతినిధి అనీస్‌అల్ అస్బాహీ తెలిపారు. మరో ఏడుగురు గాయపడ్డారని వెల్లడించారు. శిథిలాల కింద 35మంది ఖైదీలు, భర్తను కలిసేందుకు వచ్చిన ఓ మహిళ చిక్కుకున్నట్టు వెల్లడించారు. జైలు భవనం కూప్పకూలిన దృశ్యాలను హూతీ అధికారిక టీవీ ఛానల్ ప్రసారం చేసింది. శిథిలాల్లో చిక్కుకున్న వారి కోసం కొన సాగుతున్న సహాయక చర్యలను ఆ వీడియోలో చూపించారు. ఈ దాడులకు ప్రతీకారం తప్పదని హూతీల సైనిక ప్రతినిధి యాహ్యా సరీ హెచ్చరిం చారు. గత 24 గంటల్లో సౌదీకి చెందిన నాలుగు నిఘా డ్రోన్లను కూల్చినట్లు తెలిపారు.

ఈ నేపథ్యంలో సౌదీ అరేబియాకు చెందిన నౌకలు ఎర్ర సముద్రం గుండా ప్రయాణించకుండా తాము సముద్ర దిగ్బం ధనం విధిస్తున్నట్టు ప్రకటించారు. తమ ఆదేశాల ను ఉల్లంఘిస్తే.. తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. హూతీలు జరిపిన దాడుల్లో చాలామంది ప్రజలు తీవ్రంగా గాయాలపాలైనట్టు సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాల ప్రతినిధి టుర్కీ అల్ మల్కి వెల్లడించారు. గాయపడిన వారిలో మహిళలు, చిన్నారులు ఉన్నట్లు పేర్కొన్నారు. దాడులకు దీటుగా బదులిస్తామన్నారు.

# యుద్ధం నుంచి షాపింగ్‌కు!

**250 రోజుల సముద్ర సేవ తర్వాత థాయ్ నగరంలో నావికుల మర్యాదపూర్వక విడిది**

పశ్చిమాసియా జలాల నుంచి థాయ్‌లాండ్‌కు వచ్చిన అమెరికా విమాన వాహకనౌక యూఎస్‌ఎస్ అబ్రహాం లింకన్.. అమెరికా దిశగా ప్రయాణం ప్రారంభించింది. ఇరాన్‌తో యుద్ధం కారణంగా 250 రోజులకు పైగా సముద్ర జలాల్లో విధులు నిర్వర్తించిన సైనికులు వస్తున్నప్పుడు థాయ్ నగరం పట్టాయాలో హడావుడి కనిపించింది. వారి రాకతో వ్యభిచార కార్యకలాపాలు పెరిగే అవకాశం ఉంటుందని అనుమానించిన స్థానిక పోలీసులు సెక్స్ వర్కర్లను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసిన సంగతి తెలిసిందే. అయితే సైనికుల నాలుగురోజుల పర్యటన అందుకు భిన్నంగా సాగిందని మీడియా కథనాలు పేర్కొన్నాయి. సెప్టెంబర్ 2న యూఎస్‌ఎస్ అబ్రహాం లింకన్, ఎయిర్ క్రాఫ్ట్ క్యారియర్, రెండు యుద్ధ నౌకలకు చెందిన నావికులు, పైలట్లు, మెరైనర్లు థాయ్‌లోని పట్టాయా నగరానికి చేరుకున్నారు. రాజధాని నగరం బ్యాంకాకు 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న పట్టాయా నైట్‌లైఫ్, బీచ్లకు ఫేమస్. విశ్రాంతి తీసుకోవడానికి వచ్చిన ఆ సిబ్బంది.. షాపింగ్ చేశారు. సాక్సుల వంటివాటిని కొనుగోలు చేశారు. థాయ్ ఆహారం తిన్నారు. బార్లలో సమయం గడిపారని స్థానికులు వెల్లడించారు. చిన్నచిన్న గొడవలు మినహా ఈసారి వచ్చిన సిబ్బంది ఎంతో మర్యాదగా వ్యవహరించారని పేర్కొన్నారు. ఆహారం, దుస్తులు, షూలు, బహుమతులపై అమెరికా బలగాలు ఎక్కువగా దృష్టిపెట్టడంతో నైక్, విక్టోరియాస్ సీక్రెట్, స్టార్‌బక్స్ వంటి సంస్థల వ్యాపార కార్యకలాపాలు పెరిగాయని స్థానిక



మీడియా కథనాలు వెల్లడించాయి. ఇదిలా ఉంటే ఒకప్పుడు మత్స్యకారుల గ్రామంగా ఉన్న పట్టాయా.. ఇప్పుడు వినోద కేంద్రంగా మారింది. అందుకు వియత్నాం యుద్ధమే కారణం. నాడు థాయిలో మోహరించిన అమెరికా సైనికులు.. విశ్రాంతి, వినోదం కోసం పట్టాయాకు వచ్చేవారు. కాలక్రమంలో అదొక పర్యాటక కేంద్రంగా రూపాంతరం చెందింది.



## చీకటిలో ప్రాణాంతక పోరాటం

**హర్మూజ్‌లో సీమైన్స్ తొలగించేశామన్న అమెరికా**

**నాలుగు నెలల రాత్రి కార్యాచరణతో విజయం..**

**ఇంకా మిగిలున్నాయేమోనన్న సందేహాలూ లేకపోలేదు..**

హర్మూజ్‌లో నౌకాయానానికి ఆటంకం కలిగిస్తోన్న సీమైన్స్‌ను పూర్తిగా తొలగించినట్లు గతనెలలో యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ప్రమాదకరమైన వీటిని తొలగించడానికి అమెరికా చేపట్టిన ఆపరేషన్ వివరాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. దాదాపు నాలుగు నెలలపాటు రాత్రి వేళల్లో యూఎస్ నేవీ సీల్స్ ఈ రహస్య ఆపరేషనను చేపట్టినట్టు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.అమెరికాతో యుద్ధం ప్రారంభమైన(ఫిబ్రవరి) సమయంలో.. హర్మూజ్‌ను తన నియంత్రణలోకి తెచ్చుకున్న ఇరాన్.. అంతర్జాతీయ నౌకా మార్గాల్లో సీమైన్స్‌ను పరిచింది. దాంతో ఇరాన్ చెప్పిన మార్గంలో కాకుండా.. ఇతర మార్గాల్లో వెళ్లిన పలు నౌకలు వాటిని ఢీకొని పేలిపోయాయి. సముద్ర జలాల్లో టెహ్రాన్ 80 సీమైన్లను అమర్చినట్లు అంతర్జాతీయ సముద్రసంస్థ జూన్‌లో అంచనా వేసింది. దీంతో వాటిని తొలగించడానికి అమెరికా దళాలు రంగంలోకి దిగాయి. మానవరహిత నౌకలు,రోబోట్లు,సోనార్ టెక్నాలజీ, అండర్‌వాటర్ క్రాఫ్టలు, నీటి అడుగున అనుమానాస్పద పరికరాలను గుర్తించే ప్రత్యేక యంత్రాల సహాయంతో అమెరికా నేవీ సీల్ డైవర్లు హర్మూజ్‌ను జల్లెడ పట్టారు.రాత్రి సమయాల్లో నాలుగునెలలపాటు నిర్వహించిన ఆపరేషన్‌లో ఇరాన్‌అమర్చిన సీమైన్లను విజయవంతంగా తొలగించారు. అమెరికా వద్ద అధునాతన సాంకేతికత ఉన్నప్పటికీ.. డైవర్లు ఈ సీమైన్స్ వద్దకు వెళ్లి స్వయంగా వాటిని నిర్వీర్యం చేసినట్లు తెలుస్తోంది.

**ఇంకా మిగిలున్నాయా?**

హర్మూజ్‌లో సీమైన్స్‌ను పూర్తిగా తొలగించినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించినప్పటికీ.. ఎక్కడైనా ఇంకా అవి ఉన్నాయేమోనని షిప్పింగ్ కంపెనీలు, సముద్ర భద్రతా సలహాదారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.ఒమన్ తీరజలాల్లో మైన్స్‌ను అమెరికా తొలగించిందని.. కానీ మిగిలిన ప్రాంతాల్లో అవి లేవని కచ్చితంగా చెప్పలేమన్నారు. అదే సమయంలో, అమెరికా దళాలు ఇప్పటికే క్లియర్ చేసిన ప్రాంతాలలో కూడా ఇరాన్ కొత్త సీమైన్లను అమర్చి ఉంటుందనే ఆందోళనలు కూడా వ్యక్తమవుతున్నాయి.

# ఎడారిలో కృత్రిమ నది!

**నదులూ లేవు.. వానలూ పడవు.. అయినా.. నీటి కరవు నిల్**

నదులు లేవు. వానలు కురవవు. అయినా దాహం తీరుతుంది. ఇదే సౌదీ అరేబియా అసలైన అద్భుతం! దేశంలో 95 శాతం భూభాగం ఎడారే. వార్షిక వర్షపాతం 100 మిల్లీమీటర్ల లోపే. అంటే, భారత్‌లో ఒక్క రోజు కురిసే వర్షం కంటే తక్కువ. వేసవిలో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల కిందకు దిగవు. బావి తవ్వితే నీటికి బదులు చమురు ఊరుతుంది. ఇంతటి కర్కశ ప్రకృతి మధ్యే, 3.7 కోట్లమంది ప్రజలకు నిత్యం, నిరంతరాయంగా మంచినీరు అందడం నిజంగా ఇంజినీరింగ్ మహాద్భుతమే.దీని రహస్యం ఏమిటంటే, 40లక్షల కోట్ల లీటర్ల చమురు నిల్వలున్న ఈ దేశం, తన ప్రజల దాహార్తిని తీర్చడానికి మాత్రం సముద్రాన్నే నమ్ముకుంది. ఎర్ర సముద్రం, పర్షియన్ గల్ఫ్ తీరాల వెంబడే అధిక జనాభా కేంద్రీకృతమై ఉండటంతో, ఉప్పునీటిని తాగునీటిగా మార్చే డీశాలినేషన్ ప్లాంట్లను భారీ స్థాయిలో నిర్మించింది. ప్రపంచంలోనే అతిపెద్దదిగా గిన్నిస్ రికార్డు సాధించిన రాస్ అల్ ఖైర్ ప్లాంటు ఒక్కటే రోజుకు 10 లక్షల క్యూబిక్ మీటర్ల (100 కోట్ల లీటర్లకుపైగా) నీటిని శుద్ధి చేస్తుంది. ఇది రియాద్, తూర్పు ప్రావిన్స్‌లకు వందల కిలోమీటర్ల దూరం దాటి చేరుతుంది. 700 కోట్ల డాలర్లకుపైగా వ్యయంతో నిర్మించిన ఒక్క ప్లాంటే,2,650 మెగావాట్ల విద్యుత్‌నూ ఉత్పత్తి చేస్తూ, డీశాలినేషన్‌కు అవసర మైన శక్తినీ సమకూరుస్తుంది. ఇలా ప్రపంచంలోనే అత్యంత పొడి భూభాగంపై, పూర్తిగా మానవ నిర్మిత నదీ వ్యవస్థను సృష్టించడం సౌదీ ఘనతే.



అయితే, ఈ పైప్‌లైన్ నిర్మాణం అనుకున్నంత సులభమేమీ కాదు. మండే ఎండలు, ఇసుక తుఫానులు, భూగర్భ పీడనం ఒకవైపు; తుప్పు పట్టించే ఉప్పునీరు మరోవైపు.. వీటన్నింటినీ తట్టుకుని దశాబ్దాలపాటు మనగలిగే పటిష్టమైన నెట్‌వర్క్‌ను సౌదీ నిర్మించింది. చమురు, గ్యాస్ పైప్‌లైన్లలో వాడే అధిక సామర్థ్యంగల కార్బన్ స్టీల్‌తోనే ఈ నీటి పైపులనూ తయారు చేస్తారు. ప్రతి పైపునూ ఆల్ట్రాసోనిక్ పరీక్షలకు గురిచేసి, తుప్పు పట్టకుండా ప్రత్యేక పూత పూస్తారు. ఆ తర్వాత భారీ ట్రక్కుల్లో ఎక్కించి, వందల కిలోమీటర్ల దూరంలోని ఎడారి ప్రాంతాలకు తరలిస్తారు. జీపీఎస్, అత్యాధునిక సర్వే పరికరాల సాయంతో ముందుగా మార్గాన్ని నిర్ధారించి, రాతి ప్రాంతాలు, పర్వతాలు అడ్డుగా వచ్చినచోట నియంత్రిత పేలుళ్లతో కందకాలు తవ్వి, ఆ తర్వాత పైపులను ఒక్కొక్కటిగా అనుసంధానిస్తూ భారీ నెట్‌వర్క్‌ను నిర్మిస్తారు. ఇందులో అత్యంత కీలకమైన ప్రక్రియ తీరప్రాంత ప్లాంట్ల వద్దే జరుగుతుంది - సముద్రం నుంచి కొన్ని వందల మీటర్ల దూరంలో భారీ ఇన్‌టేక్ పైపులను అమర్చి, ప్రతి 63 సెంటీమీటర్ల పైపు రోజుకు 1.5 కోట్ల లీటర్ల నీటిని పంప్ చేస్తుంది. చేపలు, పీతలు, జెల్లీ ఫిష్‌లు లోపలికి రాకుండా ప్రత్యేక రక్షణ తెరలు అడ్డుకుంటాయి. అనంతరం రివర్స్ ఆస్మాసిస్ లేదా మల్టీ-స్టేజ్ ఫ్లాష్ డిస్టిలేషన్ పద్ధతుల ద్వారా నీటిని శుద్ధి చేస్తారు - రివర్స్ ఆస్మాసిస్ పద్ధతి క్యూబిక్ మీటరుకు కేవలం 3-4 కిలోవాట్ల విద్యుత్తునే వినియోగిస్తుంది, పాత థర్మల్ పద్ధతులతో పోలిస్తే ఇది గణనీయమైన ఇంధన పొదుపు.

అయితే, ఇలా శుద్ధి చేసిన నీటిలో ఖనిజాలు దాదాపు ఉండవు, రుచి చప్పగా ఉంటుంది. అందుకే కాల్షియం, మెగ్నీషియం వంటి అవసరమైన ఖనిజాలను తిరిగి కలిపి, తాగడానికి అనువుగా పీహెచ్ స్థాయిలను సర్దుబాటు చేస్తారు. ఇదంతా అత్యంత ఖరీదైన వ్యవహారం. ఒక్క కిలోమీటరు పైప్‌లైన్ నిర్మాణానికే మిలియన్ల డాలర్లు ఖర్చవుతుంది. అయితే, సముద్ర జలాల నుంచి ఇంత భారీ మొత్తంలో నీటిని శుద్ధి చేయడం పర్యావరణపరమైన సవాళ్లనూ తెచ్చిపెడుతోంది. శుద్ధి ప్రక్రియలో మిగిలిపోయే అత్యంత సాంద్రత గల ఉప్పునీటిని (బ్రైన్) తిరిగి సముద్రంలోకి వదలడం వల్ల స్థానిక సముద్ర జీవావరణంపై దీర్ఘకాలిక ప్రభావం పడే అవకాశం ఉందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా రోజుకు 90 లక్షల క్యూబిక్ మీటర్లకుపైగా డీశాలినేషన్ సామర్థ్యాన్ని సౌదీ సాధించగా, 'విజన్ 2030' లక్ష్యాల్లో భాగంగా సౌర విద్యుత్‌తో నడిచే డీశాలినేషన్ ప్లాంట్లను మరింత విస్తరించే దిశగా అడుగులు వేస్తోంది. దీనివల్ల ఇంధన వ్యయం, కర్బన ఉద్గారాలు రెండూ తగ్గే అవకాశముంది. సహజసిద్ధ నదులు, సరస్సులు లేని ఈ ఎడారి దేశం, తన సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఆర్థిక సంకల్పాన్నే నదిగా మలచుకుని, జాతీయ మౌలిక సదుపాయాల్లో అత్యంత కీలకమైన భాగంగా తీర్చిదిద్దుకోవడం నిజంగా అసాధారణ విజయగాథే.

# షమి, ముకేశ్ దెబ్బకు సౌత్ జోన్ విలవిల

**466 పరుగుల భారీ ఆధిక్యంలో ఈస్ట్ జోన్**
**ఇషాన్ కిషన్ భారీ డబుల్ సెంచరీతో 708 పరుగులు చేసిన ఈస్ట్ జోన్**
**మూడో రోజు బౌలింగ్‌లోనూ సత్తా**
**తిలక్ వర్మ అర్థ శతకం చేసినా తప్పని కష్టాలు**



సౌత్ జోన్‌తో జరుగుతున్న దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్లో ఈస్ట్ జోన్ పూర్తి ఆధిపత్యం కొనసాగిస్తోంది. తొలి రెండు రోజులు బ్యాటింగ్‌లో అదరగొట్టిన ఈస్ట్ జోన్.. మూడో రోజు బంతితోనూ సత్తాచాటి సౌత్ జోన్‌ను ఒత్తిడిలోకి నెట్టింది. కెప్టెన్ ఇషాన్ కిషన్ అద్భుతమైన 270 పరుగుల భారీ ఇన్నింగ్స్‌కు తోడు ఇతర బ్యాటర్లు కూడా రాణించడంతో తొలి ఇన్నింగ్స్‌లో ఈస్ట్ జోన్ ఏకంగా 708 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఈ భారీ లక్ష్యాన్ని అందుకునే క్రమంలో సౌత్ జోన్ బ్యాటర్లు తడబడుతున్నారు. మంగళవారం మూడో రోజు ఆట ప్రారంభించిన సౌత్ జోన్‌కు ఆరంభం నుంచే ఎదురుదెబ్బలు తగిలాయి. ఒక్క బ్యాటర్ కూడా భారీ ఇన్నింగ్స్ ఆడకపోవడంతో పరుగుల కోసం తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. ఫామ్‌లో ఉన్న దేవదత్ పడిక్కల్ కొంతసేపు పోరాడాడు. 104 బంతులు ఎదుర్కొన్న అతడు నాలుగు ఫోర్లతో 62 పరుగులు చేశాడు. అయితే ఈ అర్ధ శతకాన్ని శతకంగా మలచలేకపోయాడు. ఓపెనర్ రికీ భుయ్ కేవలం ఒక్క పరుగు చేసి వెనుదిరగడంతో సౌత్ జోన్‌కు ఆరంభంలోనే షాక్ తగిలింది. ఆ తర్వాత నారాయణ్ జగదీశన్ 32, షేక్ రషీద్ 27, శ్రేయస్ గోపాల్ 26, స్మరన్ రవిచంద్రన్ 23 పరుగులతో తమ వంతు సహకారం అందించినా.. ఎవరూ క్రీజులో ఎక్కువసేపు నిలబడలేకపోయారు. కెప్టెన్ తిలక్ వర్మ మాత్రం జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. కీలక సమయంలో బాధ్యతాయుతంగా బ్యాటింగ్ చేసిన తిలక్ వర్మ 56 పరుగులతో అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. అతడితోపాటు చామ మిలింద్ 2 పరుగులతో క్రీజులో ఉన్నాడు.

బౌలింగ్‌లో ఈస్ట్ జోన్ తరఫున మహ్మద్ షమి, ముకేశ్ కుమార్ కీలక పాత్ర పోషించారు. ఇద్దరూ చెరో రెండు వికెట్లు పడగొట్టి సౌత్ జోన్ బ్యాటింగ్ లైనప్‌పై ఒత్తిడి పెంచారు. శిఖర్ మోహన్, ఎండీ కౌనైన్ ఖురేషీ ఒక్కో వికెట్ సాధించారు. దీంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి సౌత్ జోన్ 6 వికెట్ల నష్టానికి 242 పరుగులు చేసింది. అంతకుముందు ఈస్ట్ జోన్ భారీ స్కోరుకు ప్రధాన కారణం కెప్టెన్ ఇషాన్ కిషన్. అద్భుతమైన బ్యాటింగ్‌తో 334 బంతుల్లోనే 270 పరుగులు చేసిన అతడు 30 ఫోర్లు, 7 సిక్సర్లతో బౌలర్లను చితక్కొట్టాడు. అతడి ఇన్నింగ్స్‌కు కుమార్ కుశాగ్రా సెంచరీతో పాటు ఇతర బ్యాటర్ల సహకారం కూడా తోడవడంతో ఈస్ట్ జోన్ 708 పరుగుల భారీ స్కోరు సాధించింది. దీంతో ఫైనల్లో సౌత్ జోన్‌పై ఆరంభంనుంచే ఆధిపత్యం సాధించింది.

ప్రస్తుతం సౌత్ జోన్ ఇంకా 466 పరుగుల భారీ లోటులో ఉంది. మ్యాచ్‌లో మరో రెండు రోజుల ఆట మిగిలి ఉండటంతో సౌత్ జోన్ ముందుగా ఫాలోఆన్ తప్పించుకోవడానికి అవసరమైన పరుగులు చేయాల్సి ఉంది. మరోవైపు ఈస్ట్ జోన్ బౌలర్లు మిగిలిన నాలుగు వికెట్లను త్వరగా పడగొట్టి భారీ ఆధిక్యం సాధించాలనే పట్టుదలతో ఉన్నారు. దీంతో ఫైనల్‌లో చివరి రెండు రోజులు ఉత్కంఠగా మారే అవకాశం కనిపిస్తోంది.



## క్రికెట్ మ్యాప్‌తో దౌత్య దుమారం

అఫ్గాన్ ప్రచార వీడియోపై పాక్ గుర్రు!

భారత్‌తో జరగనున్న టీ20 సిరీస్‌కు ముందు అఫ్గానిస్థాన్ క్రికెట్ బోర్డు విడుదల చేసిన ఓ ప్రచార వీడియో వివాదానికి దారితీసింది. వీడియోలో పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే), గిల్గిట్-బల్టిస్థాన్ ప్రాంతాలను భారత్‌లో భాగంగా చూపించారు. దీంతో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఈ అంశాన్ని తమ విదేశాంగ శాఖ దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం. అయితే దీనిపై పాక్ ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి చర్య ప్రకటించలేదు. భారత్‌తో అఫ్గాన్ సంబంధాలు బలపడుతుండగా.. మరోవైపు పాక్‌తో కాబూల్‌కు సంబంధాలు దెబ్బతింటున్న సమయంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం ఆసక్తికరంగా మారింది. సరిహద్దు ఘర్షణలు, టీటీపీ అంశంపై ఇరు దేశాల మధ్య ఇప్పటికే ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి.

ఇదిలా ఉండగా, భారత్-అఫ్గాన్ మూడు టీ20ల సిరీస్ సెప్టెంబర్ 13నుంచి ఢిల్లీలో ప్రారంభం కానుంది. అఫ్గానిస్థాన్ ఆతిథ్య దేశంగా ఉన్నప్పటికీ మ్యాచ్‌లను భారత్‌లో నిర్వహిస్తున్నారు. ఆసియా క్రీడలకు ముందు జరుగుతున్న ఈ సిరీస్ ఇరు జట్లకూ కీలకం కానుంది. అయితే తాజా మ్యాప్ వివాదంతో ఈ క్రికెట్ సిరీస్‌పై ఇప్పుడు దౌత్యపరమైన ఆసక్తి కూడా నెలకొంది.

# జావేద్ వల్లే పాక్ క్రికెట్ నాశనం..

**గిలెస్పీ సంచలన ఆరోపణలు**
**కోచ్‌గా ఉన్న సమయంలో తీవ్ర అవమానాలు**
**పీసీబీ ఇంకా వేల డాలర్లు బాకీ ఉందని వ్యాఖ్య**

పాకిస్థాన్ క్రికెట్‌లో తెరవెనుక విభేదాలు మరోసారి తెరపైకి వచ్చాయి. 2024లో పాకిస్థాన్ టెస్టు కోచ్‌గా పనిచేసిన ఆస్ట్రేలియా మాజీ బౌలర్ జేసన్ గిలెస్పీ.. తన పదవీకాలంలో ఎదురైన చేదు అనుభవాలను తాజాగా బయటపెట్టాడు. ముఖ్యంగా అప్పటి చీఫ్ సెలక్టర్ అకిబ్ జావేద్ తనను తీవ్రంగా అగౌరవపరిచారని ఆరోపించాడు. అంతేకాదు.. కోచ్ పదవీకాలానికి సంబంధించి పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తనకు ఇంకా వేల డాలర్లు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నాడు. అకిబ్ జావేద్ చీఫ్ సెలక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత పాకిస్థాన్ క్రికెట్‌లో తన పరిస్థితి పూర్తిగా మారిపోయిందని గిలెస్పీ చెప్పాడు. "ఆయన వచ్చిన క్షణం నుంచే పాకిస్థాన్ క్రికెట్‌తో నా సంబంధం మారిపోయింది. ప్రతి విషయంలోనూ అకిబ్ జావేద్ పెత్తనం మొదలైంది. టెస్టు జట్టును పర్యవేక్షించడం, ఆటగాళ్ళు, సహాయక సిబ్బందితో పని చేయడం, జట్టు ఎంపిక.. ఇలా ఏ విషయంలోనూ నాకు స్వేచ్ఛ లేకుండా పోయింది. చివరకు నేను 'పేరుకే కోచ్'గా మిగిలిపోయాను" అని ఆవేదన వ్యక్తం చేశాడు.

ఈ పరిణామాలు తనపై తీవ్ర మానసిక ప్రభావం చూపాయని గిలెస్పీ తెలిపాడు. కోచింగ్‌పై తనకున్న ఆసక్తి తగ్గిపోయిందని, ఒక దశలో తన సామర్థ్యాలనే తాను ప్రశ్నించుకునే పరిస్థితి వచ్చిందని చెప్పాడు. అకిబ్ జావేద్ తన పట్ల ఏమాత్రం గౌరవంగా వ్యవహరించలేదని ఆరోపించిన గిలెస్పీ.. ఆయనకు బోర్డులో బలమైన మద్దతు ఉండటంతో ఎవరూ ప్రశ్నించలేని పరిస్థితి ఉందని విమర్శించాడు.

"అకిబ్ జావేద్ అక్కడ ఉన్నంతకాలం పాకిస్థాన్ క్రికెట్ వెనక్కి వెళ్తూనే ఉంటుంది. ప్రస్తుతం అక్కడ జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే చాలా బాధగా ఉంది. ఈ పరిస్థితులకు ప్రధాన కారణం అకిబ్ జావేదేనే" అని గిలెస్పీ తీవ్ర వ్యాఖ్యలు చేశాడు. పాకిస్థాన్ క్రికెట్‌లో కోచ్‌లకు స్వేచ్ఛ, గౌరవం లేకపోవడమే అసలు సమస్య అని ఆయన వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. ఇప్పటికే కోచ్‌లు, సెలక్టర్ల మార్పులతో తరచూ వార్తల్లో నిలుస్తున్న పాక్ క్రికెట్‌లో గిలెస్పీ తాజా ఆరోపణలు మరింత దుమారం రేపుతున్నాయి.



## హాకీలో మళ్లీ నీలి జెర్సీ..

**ఆసియా క్రీడల్లో సంప్రదాయ రంగుతో టీమిండియా**
**కాషాయ జెర్సీకి స్వస్తి..**
**పురుషుల, మహిళల జట్లకు ప్రధాన కిట్ రంగుగా నీలం కొనసాగింపు**



భారత హాకీ జట్టు జెర్సీ రంగు విషయంలో కీలక మార్పు చోటుచేసుకోనుంది. ఇటీవల జరిగిన ఎఫ్ఐహెచ్ పురుషుల, మహిళల హాకీ వరల్డ్‌కప్‌లో కాషాయ రంగు జెర్సీతో బరిలోకి దిగిన భారత జట్లు.. ఇకపై సంప్రదాయ నీలి రంగు జెర్సీకే తిరిగి మారనున్నట్టు సమాచారం. రాబోయే టోర్నమెంట్లలో బ్లూ కలర్‌ను ప్రధాన జెర్సీ రంగుగా కొనసాగించాలని హాకీ ఇండియా నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఆగస్టులో జరిగిన హాకీ వరల్డ్‌కప్‌లో భారత పురుషుల, మహిళల జట్లు కాషాయ జెర్సీలతో పోటీపడ్డాయి. అయితే ఆ టోర్నమెంట్‌లో ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధించలేకపోయాయి. ఈ నేపథ్యంలో భవిష్యత్ అంతర్జాతీయ టోర్నమెంట్ల కోసం జెర్సీ రంగును మరోసారి మార్చే నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. దీంతో భారత హాకీలో కాషాయ జెర్సీ ప్రయోగం ముగిసినట్లేనని తెలుస్తోంది.

త్వరలో జపాన్ ఆతిథ్యమివ్వనున్న 20వ ఆసియా క్రీడల్లో భారత హాకీ జట్లు నీలి రంగు జెర్సీలతోనే బరిలోకి దిగనున్నాయి. పురుషుల జట్టుకు హర్మన్‌ప్రీత్ సింగ్, మహిళల జట్టుకు సలీమా టెటె సారథ్యం వహించనున్నారు. ఈ మెగా ఈవెంట్‌లో భారత జట్ల ప్రధాన కిట్ రంగుగా బ్లూను ఖరారు చేసినట్టు హాకీ ఇండియా వర్గాలు తెలిపాయి. భారత హాకీకి నీలం రంగుతో ప్రత్యేక అనుబంధం ఉంది. అంతర్జాతీయ వేదికలపై భారత జట్లకు బ్లూ జెర్సీ చాలాకాలంగా గుర్తింపుగా కొనసాగుతుంది. అందుకే ఆసియా క్రీడలతో పాటు తదుపరి టోర్నమెంట్లలోనూ ఇదే రంగును కొనసాగించే అవకాశముంది. జెర్సీ మార్పుతోపాటు ఆసియా క్రీడల్లో మెరుగైన ప్రదర్శనపై భారత పురుషుల, మహిళల జట్లు దృష్టి పెట్టనున్నాయి. ఇప్పటికే రెండు జట్లు కీలక సన్నాహకాల్లో నిమగ్నమయ్యాయి.

# 'ట్రోఫీ వద్దు.. భారత్‌ను ఓడించండి!'

**పాక్ అభిమాని డిమాండ్.. వైరల్ వీడియోపై టీమిండియా ఫ్యాన్స్ కౌంటర్**
**సెమీస్‌కు పాక్.. ఫైనల్లో భారత్-పాక్ ఢీకి ఛాన్స్**
**'ఈసారి అంతకుమించిన ట్రీట్ ఇస్తా'మంటూ భారత అభిమానుల కామెంట్లు**



మహిళల ఆసియా కప్‌లో భారత్ చేతిలో ఘోర పరాజయం ఎదురైనా.. పాకిస్థాన్ సెమీఫైనల్ బెర్త్ దక్కించుకుంది. సోమవారం దుబాయ్‌లో జరిగిన తమ చివరి గ్రూప్ మ్యాచ్‌లో హాంకాంగ్ చైనాను 72 పరుగుల తేడాతో ఓడించి పాక్ నాకౌట్‌కు చేరింది. మ్యాచ్ అనంతరం పాకిస్థాన్ మహిళల జట్టు ప్రధాన కోచ్ వహాబ్ రియాజ్ స్టేడియంలోని అభిమానులతో మాట్లాడాడు. ఈ సందర్భంగా ఓ పాక్ అభిమాని చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

'మాకు ఆసియా కప్ ట్రోఫీ అవసరం లేదు.. కానీ సెమీఫైనల్, ఫైనల్‌లో భారత్‌ను ఓడించాలి' అంటూ ఆ అభిమాని వహాబ్ రియాజ్‌ను కోరాడు. ఈ వీడియో టీమిండియా అభిమానుల దృష్టిని ఆకర్షించడంతో సోషల్ మీడియాలో కౌంటర్లు వెల్లువెత్తుతున్నాయి. "వాళ్లు క్రికెట్‌ను యుద్ధంలా.. యుద్ధాన్ని ఆటలా ఆడతారు. కానీ రెండింటిలోనూ ఓటమే శాశ్వతం" అంటూ ఓ నెటిజన్ ఘాటుగా స్పందించగా.. "మొన్న ఇచ్చిన షాక్ సరిపోలేదనుకుంటా.. ఫైనల్‌కు రండి. ఈసారి అంతకుమించిన ట్రీట్ టీమిండియా ఇస్తుంది" అంటూ మరో అభిమాని కామెంట్ చేశాడు.

**ఫైనల్లో భారత్-పాక్ ఢీ?**

ఇప్పటికే గ్రూప్ దశలో భారత్, పాకిస్థాన్ తలపడగా.. ఆ మ్యాచ్‌లో టీమిండియా ఘన విజయం సాధించింది. ఇప్పుడు ఈ చిరకాల ప్రత్యర్థులు మరోసారి తలపడే అవకాశం ఉంది. రెండు జట్లు సెమీఫైనల్ చేరడంతో.. అక్కడ విజయం సాధిస్తే ఫైనల్లో భారత్-పాక్ అమీతుమీ తేల్చుకోనున్నాయి. హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత్ వరుసగా మూడు మ్యాచ్‌లు గెలిచి సెమీస్‌కు చేరింది. సెప్టెంబర్ 10న భారత్.. బంగ్లాదేశ్, యూఏఈ మ్యాచ్‌లో విజేతతో తొలి సెమీఫైనల్ ఆడనుంది. మరో సెమీఫైనల్లో పాకిస్థాన్.. శ్రీలంకను ఢీకొంటుంది. రెండు జట్లు తమ సెమీస్‌ల్లో గెలిస్తే సెప్టెంబర్ 13న జరిగే ఫైనల్లో మరోసారి భారత్-పాక్ పోరు ఖాయమవుతుంది.

# రణబాలి.. టీజర్‌పై అప్‌డేట్



*రౌడీ హీరో విజయ్ దేవరకొండ, ట్యాలెంటెడ్ డైరెక్టర్ రాహుల్ సంకృత్యాన్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ యాక్షన్ డ్రామా 'రణబాలి' సినిమాకు సంబంధించి మేకర్స్ క్రేజీ అప్‌డేట్ ప్రకటించారు. సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చేలా రూపొందించిన చిత్ర టీజర్‌ను సెప్టెంబర్ 9న సాయంత్రం 4:05కు విడుదల చేయబోతున్నట్టు యూనిట్ సోషల్ మీడియా ద్వారా అధికారికంగా వెల్లడించింది. ది లెజెండ్ ఆఫ్ ది కర్స్‌డ్ ల్యాండ్ రైజెస్ అనే క్యాప్షన్‌తో వస్తున్న అప్‌డేట్ ప్రస్తుతం నెట్టింట విశేషంగా వైరల్ అవుతోంది. 1854నుంచి 1878 మధ్య బ్రిటిష్ కాలంనాటి వాస్తవిక చారిత్రక సంఘటనలు, అణచివేతకు వ్యతిరేకంగా సాగే పోరాటం నేపథ్యంలో సినిమాను అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. ఈ పాన్-ఇండియా చిత్రంలో విజయ్ దేవరకొండ సరసన రష్మిక మందన్న నటిస్తుండగా, ప్రముఖ హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న చిత్రానికి టి-సిరీస్ సమర్పిస్తుండగా, స్టార్ మ్యూజిక్ డైరెక్టర్స్ అజయ్-అతుల్ సంగీతం సమకూర్చారు. భారీ పీరియడ్ డ్రామాను దసరా కానుకగా అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల చేయనున్నట్టు మేకర్స్ ఇప్పటికే ఖరారు చేశారు.*

# యశ్‌కు అటూ ఇటూ నిరాశే!



## యశ్ టాక్సిక్.. ఓటీటీ డీల్లోనూ నిరాశే..

ఇక భారీ అంచనాల మధ్య విడుదలైన 'టాక్సిక్ అభిమానులను నిరాశపర్చిన విషయం తెలిసిందే. దీంతో ఈ సినిమాకు సంబంధించిన ఓటీటీ డీల్‌పై రకరకాల వార్తలు వస్తున్నాయి. గతంలో ఈ సినిమా రైట్స్‌ను రూ.150కోట్లకు దక్కించుకొనేందుకు ప్రయత్నించిన ఓ సంస్థ ఇప్పుడు రూ.30కోట్లు మాత్రమే ఆఫర్ చేస్తున్నట్టు సమాచారం. సినిమా భారీ హిట్ అవుతుందని భావించిన చిత్రబృందం రూ.150కోట్ల డీల్‌ను అప్పుడు ఓకే చేయలేదని.. రూ.200కోట్లు డిమాండ్ చేసిందని సమాచారం. దీనిపై అధికారిక వివరాలు వెల్లడికావాల్సి ఉంది.

యశ్‌కు ఇండియానా జోన్స్‌లాంటి అడ్వెంచర్ కథ వినిపించానని.. కానీ, అది పట్టాలెక్కలేదని దర్శకుడు పీఎస్ మిత్రన్ తెలిపారు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన 'సర్దార్-2' సెప్టెంబర్ 10న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఆయన ఓ ఇంటర్వ్యూలో.. యశ్‌కు వినిపించిన కథ గురించి పంచుకున్నారు. యశ్‌కు నేను ప్రతిష్మాత్మక కథ వినిపించా. చాలా బలమైన ఎమోషన్స్ ఉన్నాయి. ఇండియానా జోన్స్‌లాంటి అడ్వెంచర్ స్టోరీ. నా డ్రీమ్ ప్రాజెక్ట్. అది రూపొందించి ఉంటే చాలా అద్భుతంగా ఉండేది. కానీ, అప్పుడు యశ్‌కు సమయంలేక దాన్ని వదులుకున్నారు. దీంతో అది నెరేషన్ దగ్గరే ఆగిపోయింది" అని చెప్పారు. అడల్ట్ కంటెంట్‌తో కూడిన ఎమోషన్స్‌లోని గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామాలో నటించడం కంటే.. భావోద్వేగాలు ఎక్కువగా ఉన్న అడ్వెంచర్ సినిమా ఎంపిక చేసుకుని ఉంటే బాగుండేదని పీఎస్ మిత్రన్ అభిప్రాయపడ్డారు.



## 'ఏ' లవ్ స్టోరీ.. ఎపిక్!

ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య ప్రధానపాత్రల్లో నటించిన చిత్రం 'ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్. ఆదిత్య హాసన్ దర్శకుడు. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మాతలు. 11న చిత్రం ప్రేక్షకుల ముందుకు రానున్న తాజా ప్రేమకథ సెన్సార్ పూర్తి చేసుకుంది. బోర్డు ఈ సినిమాకు 'ఏ' సర్టిఫికెట్ ఇచ్చింది. చిత్రబృందం ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించింది. ఇక ఈ వారం విడుదలకు సిద్ధమైన మరో చిత్రం 'మహేంద్రగిరి వారాహి' కూడా సెన్సార్ పనులు పూర్తిచేసుకుంది. సెన్సార్ బోర్డు యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. సుమంత్, ఐశ్వర్య రాజేశ్ ప్రధాన పాత్రధారులుగా నటించిన సినిమాని సంతోష్ జాగర్లపూడి తెరకెక్కించారు. లక్ష్మణ్, కలిపు మధు నిర్మించారు. సిద్ధు జొన్నలగడ్డ, మీనాక్షి గోస్వామి, బ్రహ్మానందం తదితరులు కీలక పాత్రలు పోషించారు. సెప్టెంబర్ 11న థియేటర్లలోకి రానుంది. ఈ సినిమా ద్వితీయార్థం గూస్‌బంప్స్ తెప్పిస్తుందని ఇటీవల సుమంత్ ఒక సందర్భంలో వెల్లడించడం తెలిసిందే.






## 'అమ్ములు పాప'గా అనస్వర

టాలీవుడ్‌లో వరుస అవకాశాలతో దూసుకుపోతున్న యువ కథానాయిక అనస్వర రాజన్ చేతిలో ఇప్పుడు అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టు ఉంది. అదే -మెగాస్టార్ చిరంజీవి సరసన నటిస్తున్న 'కాకా'. ఈ చిత్రంలో చిరంజీవికి కూతురిగా 'అమ్ములు పాప' అనే వైద్య విద్యార్థిని పాత్రలో నటిస్తున్న ఆమె తాలూకా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను, ఆమె పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ విడుదల చేశారు. తెలుపు -ఆకుపచ్చ కాంబినేషన్ దుస్తుల్లో, పుస్తకాలు, స్టెతస్కోప్‌తో సాదాసీదాగా, ముద్దుగా కనిపిస్తున్న అనస్వర పోస్టర్‌లో ప్రత్యేక ఆకర్షణ ఏమిటంటే -ఆమె నీడ మెగాస్టార్ చిరంజీవి రూపంలోకి మారడం. ఆమెకు రక్షణగా, నీడలా చిరంజీవి పాత్ర ఎల్లప్పుడూ నిలబడి ఉంటుందన్న సంకేతాన్ని ఈ సృజనాత్మక పోస్టర్ స్పష్టం చేస్తోంది. కథలో అమ్ములు పాత్రే కీలకమని, ఆమెకు సంబంధించిన పరిణామాలే చిరంజీవి పాత్రను విలన్లపై పోరాటానికి పురిగొల్పుతాయని సమాచారం. బాబీ కొల్లి దర్శకత్వంలో, కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న చిత్రానికి తమన్ సంగీతం అందిస్తుండగా, వచ్చే సంక్రాంతికి ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానుంది.

## చిన్న సినిమాల వైపు.. ప్రియాంక

సౌత్ ఇండస్ట్రీలో ఒకప్పుడు వరుస అవకాశాలతో దూసుకుపోయిన బ్యూటీ ప్రియాంక మోహన్, ప్రస్తుతం తన కెరీర్‌లో కొంత మందగమనాన్ని ఎదుర్కొంటున్నారు. పవన్ కల్యాణ్ సరసన నటించిన 'ఓజీ' వంటి భారీ చిత్రం తర్వాత ఆమె నటించిన నెట్‌ఫ్లిక్స్ ప్రాజెక్టు 'మేడ్ ఇన్ కొరియా' అంచనాలను అందుకోలేకపోయింది. ప్రస్తుతం కవిన్ సరసన 'కె09', మారి సెల్వరాజ్ దర్శకత్వంలో 'మంజనత్తి' చిత్రాల్లో నటిస్తున్నా, కెరీర్ గ్రాఫ్ నెమ్మదించిందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. తాజాగా ఏజీఎస్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న 29వ చిత్రంలో నటుడు జై సరసన హీరోయిన్‌గా ఎంపికవడంపై సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. స్టార్ హీరోలతో నటించిన ఆమె చిన్న సినిమాలు అంగీకరించడం కెరీర్ డౌన్‌ఫాల్‌కు సంకేతమని కొందరు అభిప్రాయపడుతుంటే, శింబు రాబోయే చిత్రం 'అరసన'లో కీలక పాత్ర పోషిస్తారన్న ప్రచారం ఆమెకు కొంత ఊరటనిస్తోంది.



## త్రిష.. చాలా గొప్ప వ్యక్తి

ఇండస్ట్రీలో త్రిషలాంటి వ్యక్తులు చాలా అరుదుగా ఉంటారన్నారు నటి మాళవిక మోహనన్. కొత్త వాళ్లను ఆమె ఎంతో ప్రోత్సహిస్తారని తెలిపారు. 'సర్దార్-2' ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో మాళవిక మాట్లాడుతూ త్రిషతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. రజనీకాంత్ ప్రధానపాత్రలో తెరకెక్కిన 'పేట' సినిమాలో ఆమెతోకలిసి వర్క్‌చేసిన అనుభవాన్ని గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో ఆమె తనను ఎంతో ఆప్యాయంగా పలకరించారని తెలిపారు."నేను ఇండస్ట్రీకి వచ్చిన కొత్తల్లో 'పేట' అవకాశం వచ్చింది. రజనీకాంత్ సినిమా కావడంతో ఎంతో ఆనందించా. కానీ, కమర్షియల్ సినిమా చేసిన అనుభవం లేకపోవడంతో కంగారుపడ్డాను. వారణాసిలో షూటింగ్ జరిగిన వేళ త్రిషతో కలిసి కొన్ని కాంబినేషన్ సీన్లలో నటించాను. అప్పుడే తనతో పరిచయం ఏర్పడింది. ఎంతో బాగా చూసుకున్నారు. ప్రతి విషయంలోనూ నన్ను భాగం చేసేవారు. పరిశ్రమలో చాలా మంది ఎవరి పని వారు చేసుకొని వెళ్లిపోతారు. కానీ, త్రిష కొత్తవారిపై కూడా ఆదరణ చూపిస్తారు. చాలా తక్కువ మంది మాత్రమే అలా చేయగలరు". "ఆ తర్వాత విజయ్‌కి జోడీగా నాకు 'మాస్టర్' సినిమాలో అవకాశం వచ్చినప్పుడు త్రిష స్పెషల్ మెసేజ్ పంపారు. 'బేబీ నీకు ఇంత పెద్ద ప్రాజెక్ట అవకాశం రావడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా' అని అన్నారు. అలా అభినందించడానికి పెద్ద మనసు కావాలి" అంటూ త్రిషపై మాళవిక ప్రశంసలు కురిపించారు. కెరీర్ కీలక మలుపు తిరిగే సమయంలోనూ త్రిష ఇచ్చిన ప్రోత్సాహం తనకెంతో ప్రత్యేకమన్నారు. 2021లో విడుదలైన 'మాస్టర్' విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. ఇక మాళవిక నటించిన తాజా చిత్రం 'సర్దార్-2' సెప్టెంబర్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది.

